www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 19-10-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 201 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ.1.52 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తర సా.5.50 తదుపరి హస్త; వర్జ్యం: తె.3.05-4.51; దుర్ముహూర్తం: సా.4.14-5.00; అమృతఘడియలు: ఉ.9.59-11.44; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నేడు ఇంగ్లండ్‌తో భారత్ కీలక పోరు

ఒత్తిడిలో హర్మన్ సేన

మహిళల వన్డే ప్రపంచ కప్

మ. 3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

ఇండోర్: వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమితో తీవ్ర ఒత్తిడిలో పడిన భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా పోటీ పడనుంది. సెమీస్ చేరాలంటే హర్మన్‌ప్రీత్ సేన తాము ఆడాల్సిన మూడు మ్యాచ్‌లలో కనీసం రెండు నెగ్గాలి. విశాఖలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లను ఓడడంతో భారత జట్టు వ్యూహాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇంగ్లండ్ లాంటి పటిష్ట జట్టును ఎదుర్కొనేందుకు ఆరో బౌలర్‌తో బరిలోకి దిగాలనుకొంటోంది. ఈ క్రమంలో పేసర్ రేణుక, స్పిన్నర్ రాధా యాదవ్‌లో ఒకరికి చోటు దక్కే అవకాశం ఉంది. టాపార్డర్ స్మృతి మంధాన, ప్రతీక రావల్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్ నిలకడలేని ఆట జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు ఓటమి లేకుండా సాగుతున్న ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్‌లో గెలిస్తే సెమీస్ బెర్త్ దాదాపు ఖరారవుతుంది. పెద్దగా ఒత్తిడి లేకపోవడంతో బ్రంట్ సారథ్యంలోని ఇంగ్లండే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగం తడబాటుకు గురవుతున్నా..బౌలింగ్ మెరుగ్గా ఉంది.

పాక్-కివీస్ మ్యాచ్ వర్షార్పణం

సెమీస్‌కు దక్షిణాఫ్రికా

కొలంబో: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కొలంబో వేదికపై జరుగుతున్న మ్యాచ్‌లను వరుణుడు వెంటాడుతున్నాడు. ఇప్పటికే ఈ వేదికపై ఆడిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లో మూడు వర్షంతో రద్దవగా.. తాజాగా పాకిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌కు కూడా వర్షం అడ్డుపడింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాక్ 25 ఓవర్లలో 92/5 స్కోరు దగ్గర ఉన్నప్పుడు భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటల వరకు వేచిచూసినా వరుణుడు తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రియాజ్ (28), మునీబా (22) రాణించగా, తహుహుకు 2 వికెట్లు దక్కాయి. మ్యాచ్ రద్దుతో పాక్ ఆశలు అడుగంటిపోగా.. కివీస్ టోర్నీలో నిలవాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లను నెగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. తాజా ఫలితంతో.. 8 పాయింట్లతో ఉన్న దక్షిణాఫ్రికా అధికారికంగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఇప్పటికే ఆసీస్ సెమీస్ చేరిన సంగతి తెలిసిందే.

సాత్విక్ జోడీకి నిరాశ

ఓడెన్స్: డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టికి డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో చుక్కెదురైంది. ఈ భారత జంట సెమీఫైనల్లో 21-23, 21-18, 16-21తో జపాన్ ద్వయం టకురో హోకి/యుగో కొబయాషి చేతిలో ఓటమిపాలైంది.



యాదగిరీశుడి సేవలో

సింధు దంపతులు

యాదగిరిగుట్ట (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, వెంకటదత్త సాయి దంపతులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని శనివారం దర్శించుకున్నారు. స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో సింధు కుటుంబసభ్యులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు.

తుదిపోరుకు తన్వి

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్



గువాహటి: వర్థమాన షట్లర్ తన్వీ శర్మ.. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో సైనా నెహ్వాల్, అపర్ణ పోపట్ తర్వాత ఈ టోర్నీ తుది పోరుకు చేరుకొన్న మూడో భారత మహిళా షట్లర్‌గా తన్వీ నిలిచింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో తన్వి 15-11, 15-9 లి సి య (చైనా)పై గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో రెండో సీడ్ అన్యపట్ పిచిట్‌ప్రీచెస్క్ (థాయ్‌లాండ్)తో తన్వి అమీతుమీ తేల్చుకోనుంది.

జ్యోతి సురేఖ కొత్త చరిత్ర

ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్లో కాంస్యం కైవసం



నాన్జింగ్ (చైనా): రికార్డులు కొల్లగొట్టడాన్ని ఆనవాయితీగా మార్చుకున్న తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ఖాతాలో మరో ఘనత చేరింది. ఈ విజయవాడ అమ్మాయి.. ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో కాంస్యం దక్కించుకుంది. దీంతో ఈ మెగా టోర్నమెంట్‌లో పతకం సాధించిన భారత తొలి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా సురేఖ కొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ నెం.2 ర్యాంకర్ ఎల్లా గిబ్సన్ (బ్రిటన్)తో శనివారం జరిగిన కంచు పతక పోరులో జ్యోతి అద్భుత ప్రదర్శన చేసింది. ఒక్క తప్పునకు తావివ్వకుండా..15కు 15 బాణాలను గురిచూసి సంధించి 10 పాయింట్ల చొప్పున రాబట్టింది. తద్వారా 150-140 స్కోరుతో గిబ్సన్‌ను చిత్తు చేసి కాంస్యం అందుకుంది. వరల్డ్ కప్ సిరీస్‌లలో చివరిదైన ఫైనల్లో మొత్తం ఎనిమిది మంది ఆర్చర్లు తలపడ్డారు. 29 ఏళ్ల సురేఖ క్వార్టర్‌ఫైనల్లో 143-140 స్కోరుతో అలెక్సిస్ రూయిజ్ (అమెరికా)పై విజయంతో టోర్నీలో శుభారంభం చేసింది. అయితే హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో ప్రపంచ టాప్ ర్యాంకర్ ఆండ్రియా బెకెరా (మెక్సికో) చేతిలో 143-145 సురేఖ ఓటమిపాలైంది. ఫలితంగా కాంస్యం పోటీలో నిలిచిన సురేఖ.. ప్రత్యర్థిపై అమోఘంగా రాణించి పతకం కైవసం చేసుకుంది.

వీరిపైనే కళ్లన్నీ!

గిల్ సారథ్యంలో ఉత్సాహంగా టీమిండియా

నితీశ్‌కు చాన్స్!

ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు

ఉదయం 9 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



పెర్త్: ఏడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ బరిలోకి దిగబోతున్నారు. అంతేకాదు.. సారథిగా శుభ్‌మన్ గిల్ ఆధ్వర్యంలో భారత వన్డే జట్టు తమ ప్రస్థానాన్ని ఆరంభించబోతోంది. ఈనేపథ్యంలో టీమిండియా ఆస్ట్రేలియా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే తొలి పోరుకు పెర్త్ వేదిక కానుంది. వెటరన్ విరాట్, రోహిత్‌లకు ఇదే ఆఖరి ఆసీస్ పర్యటన కావచ్చన్న వార్తలు వినిపిస్తుండడంతో.. వీరి ఆటను తిలకించేందుకు ఇరు జట్ల అభిమానులు భారీగా స్టేడియానికి తరలిరానున్నారు. టెస్టులు, టీ20లకు గుడ్‌బై చెప్పాక వన్డేలకే పరిమితమైన రో-కో.. మార్చిలో చాంపియన్స్ ట్రోఫీతో చివరిసారి ఆడారు. ఇప్పుడు దృష్టంతా తమపైనే ఉండడంతో అంచనాలకు అనుగుణంగా రాణించాలన్న పట్టుదలతో ఉన్న వీళ్లిద్దరు..ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. అటు గిల్‌కు సారథిగా ఈ సిరీస్ కీలకం కానుంది. 2027 వరల్డ్‌కప్‌నకు అతని ఆధ్వర్యంలోనే జట్టు వెళ్లనుండడంతో వన్డేల్లో నాయకుడిగా గిల్ ప్రతిభ నిరూపించుకోవాల్సి ఉంది. మరోవైపు మిచెల్ మార్ష్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు సొంతగడ్డపై తడాఖా చూపాలనుకుంటోంది.

పటిష్టంగా భారత్: మాజీ కెప్టెన్ రోహిత్, నూతన సారథి గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించనుండగా.. ఆ తర్వాత విరాట్, శ్రేయాస్, రాహుల్ రూపంలో టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. హార్దిక్ లేకపోవడంతో సీమ్ ఆల్‌రౌండర్‌గా ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ అరంగేట్రం చేయొచ్చు. అక్షర్ ఏడో నెంబర్‌లో రానుండగా, స్పిన్నర్లు కుల్దీప్, సుందర్‌లలో ఒకరిని ఎంపిక చేయొచ్చు. బౌన్సీ పిచ్‌పై పేసర్లుగా సిరాజ్, అర్ష్‌దీప్‌లకు తోడుగా బంతి చేతపట్టేందుకు ప్రసిద్ధ్, హర్షిత్‌ల మధ్య పోటీ ఉంది.



తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, విరాట్, శ్రేయాస్, రాహుల్, నితీశ్, అక్షర్, సుందర్/కుల్దీప్, హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్.

ఆస్ట్రేలియా: హెడ్, మిచెల్ మార్ష్ (కెప్టెన్), లబుషేన్, షార్ట్, కూపర్, ఫిలిప్, ఓవెన్, స్టార్క్, హాజెల్‌వుడ్, కునేమన్, ఎల్లిస్.

క్రికెటర్ల మృతికి అఫ్గాన్ ఆటగాళ్ల సంతాపం



ఆటగాళ్లను బలి తీసుకుంటారా..

మీతో ఆడేది లేదు

పాక్‌తో ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలగిన అఫ్గానిస్థాన్

పాక్ వైమానిక దాడిలో.. అఫ్గాన్ క్రికెటర్ల మృతికి నిరసన

ఏసీబీకి ఐసీసీ, బీసీసీఐ మద్దతు

కాబూల్: పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి వైదొలగుతున్నట్టు అఫ్గానిస్థాన్ ప్రకటించింది. అఫ్గానిస్థాన్‌లోని పక్తికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ శుక్రవారం అర్ధరాత్రి జరిపిన వైమానిక దాడిలో 14 మంది మరణించారు. ఇందులో ముగ్గురు దేశవాళీ క్రికెటర్లు కబీర్ ఆఘా, సిబ్గతుల్లా, హరూన్ ఉన్నారు. పాకిస్థాన్ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించిన అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ).. వచ్చేనెల 17 నుంచి 29 వరకు రావల్పిండి, లాహోర్ వేదికలుగా జరిగే ముక్కోణపు టోర్నీనుంచి తప్పుకొంటున్నట్టు వెల్లడించింది. ఈ టోర్నీలో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌తోపాటు శ్రీలంక పాల్గొనాల్సి ఉంది.

క్రికెట్ ప్రపంచానికి నష్టం: జైషా

'ముగ్గురు క్రికెటర్ల మరణం అఫ్గాన్‌కే కాదు క్రికెట్ ప్రపంచానికే నష్టం. ఈ క్లిష్ట సమయంలో అఫ్గాన్ క్రికెట్ బోర్డుకు అండగా ఉంటాం' అని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ జై షా, బీసీసీఐ కార్యదర్శి సైకియా తెలిపారు.

టోర్నీ కొనసాగుతుందన్న పాక్ క్రికెట్

అఫ్గానిస్థాన్ వైదొలగినా ముక్కోణపు టీ20 సిరీస్ యథాప్రకారం కొనసాగుతుందని పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) స్పష్టంజేసింది. అఫ్గానిస్థాన్ స్థానంలో జింబాబ్వే జట్టును ఆడిస్తున్నట్టు పీసీబీ ప్రకటించింది.

పాక్ సూపర్ లీగ్‌కు రషీద్ గుడ్‌బై!

దాడి అనైతికమని అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్ అన్నాడు. ఈ దాడికి ప్రతిగా.. పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను రషీద్ బహిష్కరించినట్టు సమాచారం. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న పీఎస్ఎల్ జట్టు లాహోర్ క్వలాండర్స్ పేరును రషీద్ తన ఎక్స్ ఖాతా నుంచి తొలగించడం ఇందుకు ఊతమిస్తోంది.

ఢిల్లీతో హైదరాబాద్ రంజీ డ్రా

హైదరాబాద్: బ్యాటర్ల వైఫల్యంతో హైదరాబాద్ కీలక పాయింట్లు కోల్పోయింది. గ్రూప్-డిలో ఢిల్లీతో రంజీ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఢిల్లీకి 3, హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభించాయి. ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 400/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 411 రన్స్‌కు ఆలౌటైంది. ఆయుష్ బదోనికి 6, అర్పిత్ రాణాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 138/3 స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌ను ఢిల్లీ 529/4 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, గ్రూప్-ఎలో యూపీతో మ్యాచ్‌ను ఆంధ్ర డ్రాగా ముగించింది.

రన్నరప్.. భారత్

జొహోర్ కప్ హాకీ చాంపియన్ ఆసీస్

జొహోర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో యువ భారత్‌కు చుక్కెదురైంది. శనివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో ఆస్ట్రేలియా 2-1తో భారత్‌ను ఓడించి నాలుగోసారి చాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీలో మూడుసార్లు ట్రోఫీ నెగ్గిన భారత్.. రన్నరప్‌నకు పరిమితమవడం ఇది ఐదోసారి. కాగా, చివరి రెండు టోర్నీల్లో కాంస్యంతో సరిపెట్టుకున్న భారత్ ఈసారి రజత పతకంతో ప్రదర్శనను మెరుగుపరచుకుంది.

సంవత్ 2082 మెరుపులివే

బిజినెస్ ప్లస్

సోమవారంతో ముగిసే 'సంవత్ 2081' స్టాక్ మార్కెట్ మదుపరులను తీవ్రంగా నిరాశ పరిచింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాలు మార్కెట్లను తీవ్ర ఆటుపోట్లకు గురి చేశాయి. దీంతో ఈ ఏడాది మార్చిలో ఒక దశలో సెన్సెక్స్ 71,500 పాయింట్లు, నిఫ్టీ సూచీ 21,750 పాయింట్ల కనిష్ఠ స్థాయిలను తాకాయి. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నా గత ఏడాది కాలంగా చూస్తే సెన్సెక్స్, నిఫ్టీ రెండూ దాదాపు 1.5 శాతం నష్టపోయాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఎక్కువగా మదుపు చేసే నిఫ్టీ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ 5.4 శాతం నుంచి 5.6 శాతం వరకు నష్టపోయాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల పోటు అలాగే ఉన్నా సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఈ దీపావళితో ప్రారంభమయ్యే 'సంవత్ 2082' మదుపరులకు మంచి లాభాలు పంచే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. దీనికి సంబంధించి కొన్ని కంపెనీల షేర్లను బ్రోకరేజీ సంస్థలు సిఫారసు చేశాయి. 'ఆంధ్రజ్యోతి బిజినెస్' పాఠకుల కోసం ఆ వివరాలు...

దీపావళితో ప్రారంభమయ్యే సంవత్ 2082లో వినియోగం, డిఫెన్స్, ఇన్‌ఫ్రా, టెక్నాలజీ రంగ షేర్లు బాగా పుంజుకుంటాయని విశ్లేషకుల అంచనా. మదుపరులు కూడా తమదైన పరిశోధన జరిపి లేదా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్‌ను సంప్రదించి పెట్టుబడులపై నిర్ణయం తీసుకుంటే మంచిది.

నిర్మల్ బంగ్	ప్రస్తుత ధర	టార్గెట్ ధర
జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్	రూ.322.90	రూ.482
ఫినోలెక్స్ ఇండస్ట్రీస్	రూ.190.90	రూ.278
స్టోన్‌క్రాఫ్ట్	రూ.688.45	రూ.870
టీసీఎస్	రూ.2,962.60	రూ.3,611
వరుణ్ బెవరేజెస్	రూ.461.40	రూ.541
ఐసీఐసీఐ బ్యాంక్	రూ.1,436.70	రూ.1,631
గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మా	రూ.2,741.35	రూ.3,425
డిఫ్యూజన్ ఇండస్ట్రీస్	రూ.361.55	రూ.466

జేఎం ఫైనాన్షియల్స్		
మారుతి సుజుకీ	రూ.16,399.90	రూ.19,000
ఫీమ్ ఇండస్ట్రీస్	రూ.1,935.05	రూ.2,400
యాక్సిస్ బ్యాంక్	రూ.1,200.15	రూ.1,330
ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్	రూ.497.95	రూ.600
ఎల్ అండ్ టీ ఫైనాన్స్	రూ.266.35	రూ.300
అపోలో హాస్పిటల్స్	రూ.7,909.15	రూ.9,000
లాయిడ్స్ మెటల్స్	రూ.1,322.90	రూ.1,680
రత్నమణి మెటల్స్	రూ.2,391.35	రూ.2,900
బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్	రూ.365.65	రూ.460
అనంత రాజ్	రూ.621,30	రూ.844
ఆస్ట్రల్	రూ.1,440.65	రూ.1,600

రెలిగేర్ బ్రోకింగ్..		
పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.396.65	రూ.502
రిలయన్స్ ఇండస్ట్రీస్	రూ.1,416.95	రూ.1,600
హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్	రూ.745.90	రూ.870
ఎం అండ్ ఎం ఫైనాన్షియల్	రూ.300.95	రూ.327
నువోకో విస్టాస్	రూ.411.50	రూ.478

కోటక్ సెక్యూరిటీస్		
ఆక్యుటాస్ కెమికల్స్	రూ.1,646.60	రూ.1,780
అదానీ పోర్ట్స్	రూ.1,479	రూ.1,900
కమిన్స్	రూ.3,976.10	రూ.4,400
ఎటర్నల్	రూ.342.70	రూ.375
ఐసీఐసీఐ బ్యాంక్	రూ.1,436.70	రూ.1,700
మహీంద్రా అండ్ మహీంద్రా	రూ.3,648.45	రూ.4,000

పీఎల్ క్యాపిటల్		
ఐటీసీ	రూ.412.10	రూ.530
ఐసీఐసీఐ బ్యాంక్	రూ.1,436.70	రూ.1,730
ఎరిస్ లైఫ్‌సైన్సెస్	రూ.1,596	రూ.1,975
అపోలో హాస్పిటల్స్	రూ.7,909.15	రూ.9,300
డామ్స్ ఇండస్ట్రీస్	రూ.2,478.75	రూ.3,085
బ్రిటానియా ఇండస్ట్రీస్	రూ.6,080.10	రూ.6,484
కేఈఐ ఇండస్ట్రీస్	రూ.4,129.80	రూ.4,996
ఎస్‌బీఐ	రూ.889.345	రూ.960

ఎల్‌కేపీ సెక్యూరిటీస్		
నైకా	రూ.261.20	రూ.340
బజాజ్ ఫైనాన్స్	రూ.1,070.15	రూ.1,260
దివీస్ ల్యాబ్స్	రూ.6,618.70	రూ.8,000
ఎస్‌బీఐ కార్డ్స్	రూ.926.30	రూ.1,100
స్విగ్గీ	రూ.432	రూ.540

ధనత్రయోదశికి

వెండి జిగేల్

సిల్వర్ విక్రయాల్లో 40% వృద్ధి

విలువపరంగా రెట్టింపు పెరుగుదల

అధిక ధరల కారణంగా 15% తగ్గిన పసిడి విక్రయాలు

ముంబై/న్యూఢిల్లీ: బంగారం, వెండి వంటి విలువ లోహాల కొనుగోలుకు ధనత్రయోదశి అత్యంత శుభప్రదమైన రోజుగా హిందువులు భావిస్తారు. ఈ ఏడాదిలో వీటి ధరలు అమాంతం పెరిగినప్పటికీ, కొనుగోళ్లు మాత్రం బాగానే జరిగాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ధనత్రయోదశికి బంగారంతో పోలిస్తే వెండికి అధిక గిరాకీ కన్పించిందని.. వెండి నాణేలు, పూజ వస్తువుల విక్రయాలు గతసారితో పోలిస్తే 35-40 శాతం పెరిగాయని, విక్రయాల విలువ రెట్టింపునకు పైగా పెరిగిందని ఆభరణాల వర్తక సంఘం వెల్లడించింది. బంగారం విక్రయాల పరిమాణం మాత్రం గత సారితో పోలిస్తే 15 శాతం వరకు తగ్గిందని అసోసియేషన్ పేర్కొంది. గత ఏడాదిలాగే ఈసారీ ధనత్రయోదశి రెండు రోజులు (శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం 1.45 గంటల వరకు) జరుపుకుంటున్నారు. దీంతో నగల షాపులు ఆదివారం కూడా తెరిచి ఉండనున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ధనత్రయోదశి విక్రయాలు జోరందుకున్నాయని, వినియోగదారులు అధికంగా నాణేల కొనుగోలుకు మొగ్గుచూపారని ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. పెట్టుబడి, పెళ్లి అవసరాల కోసం 1-50 గ్రాముల వరకు బులియన్ కొనుగోళ్లు జరిపారని వారు తెలిపారు.

మరోవైపు హైదరాబాద్‌లో ధనత్రయోదశి విక్రయాలు 50 శాతం వరకు తగ్గినట్లు వర్తకులు తెలిపారు. వినియోగదారులు కూడా కొద్ది మొత్తంలో పసిడి, వెండి కొనుగోళ్లకు మొగ్గు చూపినట్లు వారు పేర్కొన్నారు. మరోవైపు ఆన్‌లైన్ కొనుగోళ్లకు మాత్రం వినియోగదారులు మక్కువ చూపినట్లు క్విక్ కామర్స్ రంగ ప్రతినిధులు తెలిపారు.

రూ.50,000 కోట్లకు పైగా విక్రయాలు: గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధంతేరస్ విక్రయాలు పరిమాణంపరంగా 10-15 శాతం తగ్గినప్పటికీ, అమ్మకాల విలువ భారీగా పెరిగిందని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) చైర్మన్ రాజేశ్ రోక్డే అన్నారు. ఈసారి మొత్తం విక్రయాలు రూ.50,000 కోట్లు దాటవచ్చన్నారు. కాగా విక్రయాల పరిమాణం తగ్గినప్పటికీ, కొనుగోలు లావాదేవీల సగటు విలువ 20-25% పెరిగిందని జీజేసీ వైస్ చైర్మన్ అవినాశ్ గుప్తా అన్నారు.

ఒక్క రోజులో రూ.లక్ష కోట్లు: ఈ ధనత్రయోదశికి భారత వినియోగదారులు బంగారం, వెండి సహా ఇతర కొనుగోళ్లకు మొత్తం రూ.లక్ష కోట్లు వెచ్చించి ఉండవచ్చని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. అందులో బంగారం, వెండి కొనుగోళ్ల వాటానే రూ.60,000 కోట్లుగా ఉంటుందని, గత ఏడాదితో పోలిస్తే వీటి అమ్మకాలు 25 శాతం పెరిగాయని అసోసియేషన్ పేర్కొంది. గడిచిన ఏడాది కాలంలో బంగారం ధరలు 60 శాతం పెరిగి రూ.1.30 లక్షలు దాటినప్పటికీ, నగల షాపులకు వినియోగదారులు పోటెత్తారంటోంది

పసిడి కాస్త దిగొచ్చే: ధనత్రయోదశి నాడు పసిడి కొనుగోలుదారులకు స్వల్ప ఊరట లభించింది. ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయి నుంచి కాస్త దిగివచ్చాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం శనివారం రూ.2,400 తగ్గి రూ.1,32,400కు జారుకుంది. వెండి విషయానికొస్తే, కిలో ధర మరో రూ.7,000 తగ్గి రూ.1.70 లక్షలకు పరిమితమైంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,860 ▼	1,19,950 ▼	1,90,000 ▼
విజయవాడ	1,31,950 ▼	1,26,000 ▼	1,69,500 ▼
విశాఖపట్నం	1,29,440 ▼	1,18,650 ▼	1,90,000 ▼
రాజమండ్రి	1,30,850 ▼	1,19,950 ▼	1,74,000 ▼
ప్రొద్దుటూరు	1,31,100 ▼	1,20,610 ▼	1,71,000 ▼
ముంబై	1,29,584 ▲	1,18,699 ▲	1,69,230 ▲

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్‌కు 60% వాటా

- డీల్ విలువ రూ.26,853 కోట్లు
- భారత ఆర్థిక రంగంలో ఇదే అతిపెద్ద లావాదేవీ

న్యూఢిల్లీ: భారత బ్యాంకింగ్ రంగంలో బడా డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో యూఏఈకి చెందిన రెండో అతిపెద్ద బ్యాంక్ ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ 60 శాతం వాటాను రూ.26,853 కోట్ల (300 కోట్ల డాలర్ల)కు కొనుగోలు చేయనుంది. ఈ కొనుగోలు పూర్తయితే భారత ఆర్థిక రంగంలో విలువపరంగా ఇదే అతిపెద్ద డీల్ కానుంది. అంతేకాదు దేశీయ ఆర్థిక సేవల రంగంలో భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) కూడా ఇదే అవుతుంది. సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలను బోర్డు ఆమోదించిన సందర్భంగా ఎన్‌బీడీ బ్యాంక్ కొనుగోలు ప్రతిపాదనను ఆమోదించిందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆర్‌బీఎల్ బ్యాంక్ తెలిపింది. రూ.10 ముఖ విలువతో కలిగిన ఒక్కో షేరును రూ.280 ధరతో మొత్తం 95.90 కోట్ల షేర్లను ప్రిఫరెన్షియల్ ఇష్యూ ప్రాతిపదికన 60 శాతం వాటాను రూ.26,853 కోట్లకు ఎన్‌బీడీకి కేటాయించేందుకు శనివారం బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఎన్‌బీడీ బ్యాంక్ విదేశీ సంస్థ కావటంతో రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ఈ డీల్ ఉంటుందని తెలిపింది. కాగా ఈ ఏడాది యస్ బ్యాంక్‌లో జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ 24.9 శాతం వాటాలను రూ.16,333 కోట్లకు చేజిక్కించుకున్న సంగతి విదితమే.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ ఆదాయం రూ.602 కోట్లు

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.602 కోట్ల ఆదాయంపై రూ.76 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.599 కోట్లుగా ఉండగా లాభం రూ.72 కోట్లుగా నమోదైంది. మధ్యప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లాస్ కంటైనర్స్ ప్లాంట్ వచ్చే ఏడాదిన్నర కాలంలో అందుబాటులోకి రానుందని పేర్కొంది. అలాగే కంపెనీ అల్యూమినియం క్యాన్స్ విభాగంలోకి అడుగుపెడుతోందని, ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ 2027-28 తృతీయ త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 19వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	560
వరంగల్	537	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్			
హైదరాబాద్	112	విజయవాడ	126
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	110
కర్నూలు	112	నెల్లూరు	115
విశాఖపట్నం	129	అనంతపురం	115
గోదావరి	126		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 19-10-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 201 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ.1.52 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తర సా.5.50 తదుపరి హస్త; వర్జ్యం: తె.3.05-4.51; దుర్ముహూర్తం: సా.4.14-5.00; అమృతఘడియలు: ఉ.9.59-11.44; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.47

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీసీ బంద్ సక్సెస్!

పల్లె నుంచి పట్నం దాకా విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూత

బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, లెఫ్ట్ మద్దతు

రాష్ట్రవ్యాప్తంగా పోటాపోటీగా ర్యాలీలు, ధర్నాలు

ఎంజీబీఎస్ వద్ద 12 గంటల పాటు బైఠాయింపు

పండుగపూట సొంతూళ్లకు వెళ్లేవారికి తప్పని తిప్పలు

కొన్ని ప్రాంతాల్లో వ్యాపార సంస్థలపై రాళ్ల దాడి

అడ్డుకున్న పోలీసులు.. ఆయా చోట్ల ఉద్రిక్తత

స్థానిక ఎన్నికలను ఆపి మరీ బీసీ రిజర్వేషన్ల కోసం 23 నెలలుగా ప్రయత్నిస్తున్నాం: మహేశ్‌గౌడ్

బీసీ బంద్ చరిత్రలో నిలిచిపోతుంది

త్వరలో అన్ని రాజకీయ పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తాం: ఆర్.కృష్ణయ్య

అఖిలపక్షంతో సీఎం ఢిల్లీకి వెళ్లి ఒత్తిడి తేవాలి: జాజుల



బంద్ సందర్భంగా నిర్మానుష్యంగా నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్



ఎంజీబీఎస్ వద్ద మహేశ్, జాజుల తదితరులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత, రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు డిమాండ్‌తో బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ శనివారం విజయవంతంగా జరిగింది. పలు చోట్ల చిన్న చిన్న సమస్యలు మినహా దాదాపు ప్రశాంతంగా జరిగింది. బీసీ సంఘాల జేఏసీ పిలుపునిచ్చిన ఈ బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాలు, ఇతర పార్టీలు సైతం మద్దతు ప్రకటించడంతో సంపూర్ణంగా

మిగతా 13వ పేజీలో...



గ్రూప్-2లో ఎంపికైన ఓ అభ్యర్థికి నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, పొన్నం

తల్లిదండ్రులను పట్టించుకోకపోతే..

జీతంలో కోత

10-15 శాతం కట్ చేసి వారి ఖాతాలో వేస్తా

ఈ మేరకు త్వరలో చట్టం కూడా తీసుకొస్తాం

ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలతో బీఆర్ఎస్ పైశాచికానందం.. ఆ ఘటనలను నివారించాలి

కేసీఆర్ పాపాల పుట్ట పగులుతోంది

వాళ్ల దోపిడీ గురించి వాళ్ల కుటుంబీకులే చెబుతున్నారు

త్వరలోనే గ్రూప్-3, 4 ఫలితాలు: సీఎం రేవంత్

783 మందికి గ్రూప్-2 నియామక పత్రాల అందజేత

ప్రభుత్వం వచ్చి రెండేళ్లైనా కొందరి పనిలో మార్పు లేదు

ఏ దశలోనూ ఫైళ్లు, పనులు ఆగిపోవడానికి వీల్లేదు

సీఎస్, ముఖ్య కార్యదర్శులతో సమీక్షలో సీఎం రేవంత్

తుమ్మిడిహెట్టి కోసం త్వరలో మహారాష్ట్రకు సీఎం!

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): "ఉద్యోగులూ.. తల్లిదండ్రులను సంరక్షించుకోవడం.. పుట్టి పెరిగిన ఊరును అభివృద్ధి చేసుకోవడం మన బాధ్యత. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. ఉద్యోగులు ఎవరైనా వారి తల్లిదండ్రులను పట్టించుకోకపోతే.. వారి జీతంలో నుంచి 10-15 శాతం కోత విధిస్తా. ఆ మొత్తాన్ని వారి తల్లిదండ్రుల ఖాతాలో వేస్తా. ఒకటో తేదీన మీకు జీతం ఎలా వస్తుందో.. అలాగే ఆ మొత్తం మీ తల్లిదండ్రుల ఖాతాలో కూడా ఒకటో తేదీనే పడుతుంది. ఈ మేరకు త్వరలో చట్టం తీసుకొస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ మీరు సామాన్యులని, ఈరోజు నుంచి అధికారులని, బాధ్యతను సమర్థంగా

మిగతా 12వ పేజీలో...

మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు

23 వరకు పొడిగింపు

27న లాటరీ.. దరఖాస్తులు తగ్గడంతో చివరి నిమిషంలో అధికారుల ప్రకటన

ఇప్పటిదాకా 87 వేల దరఖాస్తులు.. శనివారం ఒక్కరోజే 40 వేలకు పైగా..

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు గతం కంటే ఈసారి దరఖాస్తులు తగ్గిన నేపథ్యంలో చివరి నిమిషంలో దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. దరఖాస్తు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు.. లాటరీ ప్రక్రియను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇక చివరి రోజు అనుకున్న శనివారం రాత్రి 11.30 గంటల వరకు 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని.. వీటితో మొత్తం సంఖ్య 87 వేలకు చేరిందని ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుండగా, ఈసారి దాన్ని రూ.3 లక్షలకు పెంచారు. గత రెండేళ్ల కాలానికి వైన్ షాపుల లైసెన్సుల కోసం 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈసారి

మిగతా 12వ పేజీలో...

మారీచ కుట్రలు!



కొత్త పలుకు!

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు పెట్టుబడుల వరద ప్రవహిస్తుందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇదొక మైలురాయి. భారీ పెట్టుబడి సాధించినందుకు 'ఆహా' అని మురిసిపోవాలి. అక్కడి మాజీ సీఎం జగన్ అండ్ కో మాత్రం విషం కక్కడం మొదలుపెట్టారు. డేటా సెంటర్ వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఏడుపులు లంకించుకున్నారు. జగన్ అండ్ కోలో ఇంత మనోవికారం ఎందుకు ఏర్పడిందో అంతుపట్టదు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారే అయితే తాము అధికారంలోకి వస్తే సీఎం చంద్రబాబును మించి పెట్టుబడులు సాధిస్తామని చెప్పుకోవాలి. అలా కాకుండా పొరుగు రాష్ట్రాలకు ఈర్ష్యగా మారిన ఈ ఒప్పందంపై విషం చిమ్మడం ఏమిటి? దీన్నిబట్టి వారి మెదళ్లు ఎంత విషతుల్యం అయ్యాయో అర్థం చేసుకోవచ్చు.

4

రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే చంద్రబాబుకు గానీ, ఐటీ మంత్రి లోకేశ్‌కు గానీ వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉండదు. పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ మహానగరమే ఇందుకు నిదర్శనం. సంక్షేమం పేరిట ప్రభుత్వం విసిరే మెతుకులు తింటూ జనం ఎదుగూ బొదుగూ లేని జీవితం గడపాలన్నదే జగన్ అండ్ కో అభిలాష.

జగన్ రెడ్డి విషపూరిత ఆలోచనలు, కుట్రలను అమలుచేయడానికి ఆయనకు మనుషుల కొరత లేదు. అంతుపట్టని ఉన్మాదం వారిని ఆవహిస్తోంది. చేసిన పాపాలకు జైలుకు వెళ్లి వచ్చిన వారిలో కూడా పశ్చాత్తాపం కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఈ క్రమంలోనే ఏపీలో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేస్తున్నారు. వాళ్లంతా జగన్ హయాంలో పత్రికా స్వేచ్ఛపై దాడి జరిగినప్పుడు కళ్లు మూసుకొని ఆనందించారు.

అధికారంలో ఉన్నంత కాలం 'ఏబీఎన్'తో పాటు 'టీవీ 5' ప్రసారాలను నిలిపివేయించలేదా? శాసనసభ కార్యక్రమాలను కూడా కవర్ చేయకుండా 'ఏబీఎన్'ను నిర్బంధించలేదా? సీఐడీ పోలీసులతో 'ఆంధ్రజ్యోతి' పత్రిక పైనా, సిబ్బందిపైనా కేసులు పెట్టించారు. ఆ కేసులకు సంబంధించి ఇప్పటికీ కోర్టులకు హాజరవుతున్నాం కదా? అధికారం కోల్పోయిన తర్వాత కూడా మా సంస్థలను దూరం పెట్టడం నిజం కాదా? జగన్ కార్యక్రమాలు, వైసీపీ నిర్వహించే విలేకరుల సమావేశాలకు 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' లపై నిషేధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు కదా? చివరకు నాపై కూడా దేశ ద్రోహం సెక్షన్ల కింద కేసులు పెట్టారు కదా?

నాటి బాధితుల ఆక్రందనలు మీకు శ్రవణానందకరంగా ఉండి ఉండవచ్చు. ఇప్పుడు మీ ఆక్రందనలు కూడా ఇతరులకు అదే విధంగా శ్రవణానందకరంగా ఉంటాయని సరిపెట్టుకోండి. ఇప్పుడు అద్దెకు తెచ్చుకున్న గొంతులు మీకు అనుకూలంగా మాట్లాడవచ్చు. అయితే అలాంటి గొంతులకు విలువ ఉండదు. దుష్ట సంప్రదాయాలను నెలకొల్పే ముందే ఆలోచించుకోవాలి. రేపు మనకూ అదే గతి పడుతుందని తెలుసుకోవాలి కదా?

సొంత ఖర్చుతో రోడ్లను బాగు చేసేందుకు సిద్ధం

» బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ ప్రకటన



బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర రోడ్ల దుస్థితి, చెత్త దిబ్బలపై ఇటీవల వరుస పోస్టులు పెట్టిన బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా తాజాగా సొంత డబ్బుతో 15 రోడ్లను బాగు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. రోడ్ల మరమ్మతు, నిర్వహణ ఖర్చులు భరిస్తానని ఆమె ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు సమాచారం. బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా హెబ్బగూడి గ్రామ పంచాయతీలో బయోకాన్ సంస్థ కార్యాలయం ఉంది. ఆ ప్రాంతంలోని సుమారు 13-15 రోడ్లను బాగు చేసేందుకు వివిధ శాఖల అధికారులతో బయోకాన్ సంస్థ అధికారులు చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే ఏయే రోడ్లను బాగు చేస్తారనేది ఇంకా నిర్ధారించలేదు. ఈ విషయమై బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ శనివారం స్పందించారు. కేఆర్‌పురలో 'బెంగళూరు నడక' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, 'రోడ్ల అభివృద్ధికి ఆమె (కిరణ్ మజుందార్‌షా) ముందుకొస్తే అప్పగిస్తాం' అని అన్నారు. ఇక్కడి ప్రజలు అధికంగా పన్నులు కడుతున్నారని, ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు కేటాయించిందని చెప్పారు. పౌరులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. తనను కలుసుకోలేని వారు 1533 నంబరుకు కాల్ చేసి సమస్యలు చెప్పవచ్చని శివకుమార్ సూచించారు.

ఇద్దరు యువతులతో ప్రేమ, పెళ్లి

» చిత్రదుర్గలో ఒకే వేదికపై వివాహం


ఇద్దరు భార్యలతో వసీం

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ పట్టణంలోని జేజేహట్టి కాలనీకి చెందిన వసీం షేక్(28) అనే యువకుడు ఇద్దరు యువతులను ఒకేసారి, ఒకే వేదికపై వివాహం చేసుకున్నాడు. వసీం గతంలో గోవాలో పనిచేసే సమయంలో షిఫా అనే యువతితో స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. కొంతకాలం తర్వాత జన్నత్ అనే చిత్రదుర్గ యువతితో స్నేహం ఏర్పడి అది కూడా ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇద్దరితోనూ వసీం ప్రేమ కొనసాగించాడు. ప్రేమిస్తున్న ఇద్దరినీ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మూడు కుటుంబాల వారూ ఈ విషయమై చర్చించి వివాహానికి అనుమతించడంతో ఇద్దరినీ వసీం వివాహం చేసుకున్నాడు. ఈ నెల 15న ఎంకే ప్యాలెస్‌లో రిసెప్షన్ (వలీమా) జరుపుకొన్నారు. కాగా.. ఇద్దరితో వివాహం గురించి వసీం మీడియాతో మాట్లాడుతూ.. 13 ఏళ్ల క్రితం షిఫాతో, ఏడేళ్ల క్రితం జన్నత్‌తో పరిచయం ఏర్పడిందని, స్వచ్ఛమైన ప్రేమతోనే పెళ్లి చేసుకున్నానని చెప్పాడు. తమ వివాహాన్ని ఎవరూ వ్యతిరేకించలేదని తెలిపాడు.

లోకం తీరు



భార్యకు ఆర్థిక స్థోమత ఉంటే భరణం ఇవ్వాల్సిన పనిలేదు

» ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: భార్యకు ఆర్థిక స్థోమత ఉన్నప్పుడు ఆమెకు భర్త మనోవర్తి చెల్లించాల్సిన పనిలేదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్-25ను ప్రస్తావిస్తూ ఆర్థిక స్వయం సమృద్ధి కలిగి ఉండి, స్వతంత్రంగా వ్యవహరిస్తున్న భార్యకు భరణం ఇవ్వాల్సిన పనిలేదని తెలిపింది. విడాకులు మంజూరయిన నేపథ్యంలో భర్త నుంచి భరణం ఇప్పించాలని కోరుతూ రైల్వే ట్రాఫిక్ సర్వీసులో గ్రూపు-1 అధికారిణిగా పని చేస్తున్న ఓ మహిళ చేసిన వినతిని తిరస్కరిస్తూ ధర్మాసనం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఆమెకు ఓ న్యాయవాదితో 2010లో వివాహం జరిగింది. కేవలం ఏడాది పాటే కలిసి జీవించారు. తనను భార్య మానసికంగా, శారీరకంగా వేధిస్తోందని ఆరోపిస్తూ ఆయన కుటుంబ న్యాయస్థానంలో కేసు పెట్టాడు. ఈ ఆరోపణలను ఖండించిన ఆమె భర్తే తన పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నాడని ప్రత్యారోపణ చేసింది. వాదనలు విన్న న్యాయస్థానం 2023 ఆగస్టులో విడాకులు మంజూరు చేసింది. సెటిల్‌మెంట్ కింద రూ.50 లక్షలు ఇవ్వాలని ఆమె విన్నవించగా కోర్టు నిరాకరించింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు.



'బంగారు' మిఠాయి.. కిలో రూ.1,11,000

» 24 క్యారెట్ల తినగలిగే గోల్డ్‌తో జైపూర్‌లో తయారీ

» మన దేశంలో అత్యంత ఖరీదైన మిఠాయి ఇదే

జైపూర్, అక్టోబరు 18: మిలమిలలాడే బంగారాన్ని నచ్చిన డిజైన్లలో నగలుగా మార్చుకోవడమే తెలుసు కానీ నోట్లో వేసుకుంటే కరిగిపోయే మిఠాయి రూపంలో తినొచ్చా? రాజస్థాన్ జైపూర్‌లోని ఓ మిఠాయి దుకాణంలో అమ్ముతున్న ఓ ప్రత్యేకమైన స్వీటే దీనికి సమాధానం చెబుతోంది. అక్కడ 'స్వర్ణ ప్రసాదం' పేరుతో బంగారాన్ని మిక్స్ చేసిన మిఠాయిని అమ్ముతున్నారు. ఈ మిఠాయిలో 24 క్యారెట్ల తినగలిగిన బంగారం లేదా స్వర్ణ భస్మాన్ని పొదిగారు. మనదేశంలో ప్రస్తుతం అత్యంత ఖరీదైన మిఠాయి ఇదే. కిలో 'స్వర్ణ ప్రసాదం' ధర రూ.1,11,000. స్వీటు తయారీలో అఫ్ఘానిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే చిల్గోజా అనే అత్యంత ఖరీదైన డ్రైఫ్రూట్‌ను వాడారు. కుంకుమ పువ్వు, పైన్ నట్స్‌తో గార్నిష్ చేశారు. ఈ స్వీటులో స్వర్ణ భస్మం అనే 24 క్యారెట్ల బంగారాన్ని మిక్స్ చేస్తున్నామని షాపు యజమాని అంజలి జైన్ చెప్పారు.

పథకాలు, చట్టాలకు హిందీ, సంస్కృత పేర్లా?

» కేంద్రంపై సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇనుపయుగం తమిళనాడు నుంచే ప్రారంభమైందన్న చారిత్రక వాస్తవాన్ని అంగీకరించేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వెనుకాడుతోందని, కీళడి పురావస్తు తవ్వకాలకు సంబంధించిన నివేదికను ఆమోదించకుండా పల్టీలు కొడుతోందని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్ ధ్వజమెత్తారు. ఆ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో కొన్ని ప్రశ్నలను సంధించారు. "బీజేపీ కూటమిలో చేరిన నేరస్థులు, అవినీతిపరులు ఎలా పవిత్రులుగా మారిపోతారో వివరించగలరా? దేశంలోని కీలకమైన పథకాలకు, చట్టాలకు హిందీ, సంస్కృతంలోనే పేర్లు పెట్టడం దురహంకారానికి నిదర్శనం కాదా? ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా కుటిల రాజకీయాలు జరిపి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలలో గందరగోళం సృష్టించడం న్యాయమా? తమిళనాడు నుంచే ఇనుపయుగం ప్రారంభమైందనే వాస్తవాన్ని ఎందుకు అంగీకరించడం లేదు" అని ప్రశ్నించారు.

ఢిల్లీలో ఎంపీల అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబరు 18: ఢిల్లీలో పలువురు లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు నివాసం ఉండే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కొంత మంది పిల్లలకు గాయాలయ్యాయని కొందరు నివాసితులు పేర్కొన్నారు. బాబా ఖరగ్ సింగ్ మార్గ్‌లో ఉన్న బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం 1.22 గంటల ప్రాంతంలో సమాచారం అందిన వెంటనే 14 ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. 2020లో ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అనేక మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల నివాసాలున్నాయి. కింద ఉండే ఫ్లోర్‌లో పటాసులు పేల్చిన సందర్భంగా ప్రమాదం జరిగిందని సమాచారం.

స్వీట్ షాపులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వీట్ తయారీ కేంద్రాలు, రిటైల్ షాపులపై ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మొత్తం 33 జిల్లాల్లోని 95 స్వీట్ యూనిట్లలో తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీల్లో అధికారులు పలు ఆందోళనకర విషయాలను గుర్తించారు. పాలతో తయారుచేసే జిలేబీ, లడ్డూ, ఖోవా వంటి పదార్థాలలో ప్రమాదకరమైన సింథటిక్ రంగులు వాడుతున్నట్లు తేలింది. అంతేకాక, స్వీట్ల అలంకరణకు వినియోగించే వెండి పూత (సిల్వర్ ఫాయిల్) కూడా నాన్-ఫుడ్ గ్రేడ్ నాణ్యతతో ఉందని, ఇది ఆరోగ్యానికి అత్యంత హానికరమని అధికారులు నిర్ధారించారు. చాలా తయారీ కేంద్రాల్లో కల్తీ నెయ్యితో స్వీట్లు తయారు చేస్తున్నట్లు వెల్లడైంది.

రష్యా చమురును

భారత్ అస్సలు కొనదు!

ఇప్పటికే కొనుగోళ్లు తగ్గించేసింది.. భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపా

» పాక్-అఫ్గాన్ యుద్ధాన్ని చిటికెలో ఆపగలను

» జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ట్రంప్

» వెంటనే ఉన్నది ఉన్నట్టుగా యుద్ధం ఆపేయాలని రష్యా, ఉక్రెయిన్‌లకు పిలుపు



వాషింగ్టన్, అక్టోబరు 18: భారత్ రష్యా నుంచి చమురును అస్సలు కొనదని, కొనుగోళ్లు ఇప్పటికే తగ్గించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ తర్వాత ట్రంప్ మీడియాతో మాట్లాడారు. "రష్యా నుంచి భారత్ అస్సలు చమురు కొనుగోలు చేయదు. ఇప్పటికే తగ్గించేసింది, దాదాపు పూర్తిగా ఆపేసింది. ఇకపై కొనదు.." అని పేర్కొన్నారు. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి వ్యాఖ్యానించారు. మరెన్నో యుద్ధాలను కూడా ఆపానని.. కావాలనుకుంటే పాక్-అఫ్ఘానిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడం తనకు చిటికెలో పని అని పేర్కొన్నారు. యుద్ధాలను ఆపడం ద్వారా కోట్లాది మంది ప్రాణాలు కాపాడానన్నారు.

ఉన్నది ఉన్నట్టుగా ఆపేయండి.

ఉక్రెయిన్, రష్యా రెండు దేశాలు కూడా ఉన్నది ఉన్నట్టుగా, ఎక్కడున్నవాళ్లు అక్కడ యుద్ధాన్ని ఆపేయాలని ట్రంప్ పిలుపునిచ్చారు. లేకపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుందని పేర్కొన్నారు. రష్యా ఆక్రమించిన భూభాగాలను వదులుకోవాలని ఉక్రెయిన్‌కు పరోక్షంగా స్పష్టం చేశారు. "ఇప్పటికే చాలా రక్తపాతం జరిగింది. ఇక చాలు. వెంటనే ఎక్కడ ఏది ఎలా ఉన్నది అలా యుద్ధాన్ని ఆపేయండి. ఇద్దరూ ఎవరికివారు విజయం సాధించినట్టు ప్రకటించుకోండి. ఏదైనా ఉంటే చరిత్ర నిర్ణయిస్తుంది.." అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌కు తొమహాక్ క్షిపణులు ఇచ్చే ఉద్దేశం లేదని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. తొమహాక్‌లు అవసరం రాకపోవడమే మంచిదని, నిజాయతీగా చెప్పాలంటే యుద్ధం ముగియడమే మంచిదని జెలెన్‌స్కీకి సూచించారు. ఇక కాల్పుల విరమణకు, చర్చలకు సమయం ఆసన్నమైందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ట్రంప్ చెబుతున్నది నిజమని, మొదట మనం ఎక్కడ ఉన్నామో అక్కడ ఆగి, ఆ తర్వాతే మాట్లాడాలని వ్యాఖ్యానించారు.


సిబ్గతులా, హరూన్, కబీర్ అఘా

పాక్ వైమానిక దాడుల్లో ముగ్గురు అఫ్గాన్ క్రికెటర్ల మృతి

» దేశవాళీ క్రికెటర్లు కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్ దుర్మరణం

కాబూల్/ఇస్లామాబాద్, అక్టోబరు 18: సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ పక్తికా ప్రావిన్స్‌లో పాక్ జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు అఫ్గాన్ క్రికెటర్లతో పాటు 14 మంది పౌరులు మృతిచెందారు. దేశవాళీ క్రికెట్ ఆడే కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్ మృతిచెందినట్లు అఫ్గాన్ క్రికెట్ బోర్డ్ వెల్లడించింది. పక్తికా ప్రావిన్స్ రాజధాని శరణలో జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొనేందుకు వచ్చి పాక్ దాడుల్లో మృతిచెందారని ఏసీబీ తెలిపింది. ఘటన నేపథ్యంలో వచ్చే నెలలో పాకిస్థాన్‌లో జరిగే ముక్కోణపు టి-20 సిరీస్‌లో పాల్గొనరాదని ఏసీబీ నిర్ణయించింది. అయితే అఫ్గాన్ పాల్గొనకున్నా తాము ముక్కోణపు సిరీస్ నిర్వహిస్తామని పాక్ స్పష్టం చేసింది. ఇలా ఉండగా పాక్ వరుసగా రెండోరోజు కూడా అఫ్గాన్‌పై వైమానిక దాడులు నిర్వహించింది. తాజా దాడుల్లో పలువురు తాలిబన్ ఫైటర్లు హతమయ్యారని పాక్ సైనిక వర్గాలు తెలిపాయి. మరోవైపు ఖతార్ మధ్యవర్తిత్వంలో దోహాలో పాక్, అఫ్గాన్ ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు జరిగాయి. చర్చల్లో రెండు దేశాల రక్షణ మంత్రులు, ఇంటలిజెన్స్ చీఫ్‌లు పాల్గొన్నారని తెలిసింది. కాల్పుల విరమణ కొనసాగుతున్నా పాక్ వైమానిక దాడులకు పాల్పడటంపై అఫ్గాన్ ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాక్ సైన్యం సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకోవడంపై బదులు తీర్చుకుంటామని తాలిబన్ ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది.

భారత భూభాగంలోనూ దాడులు చేయగలం!

» రెచ్చగొడితే విరుచుకుపడతాం!

» పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ ప్రేలాపనలు

» 'అణుబూచి' చూపిస్తూ హెచ్చరికలు



ఇస్లామాబాద్, అక్టోబరు 18: సరిహద్దులు దాటి, భారత భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలిగేలా రక్షణ సామర్థ్యాన్ని పెంచుకున్నామని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ ప్రకటించారు. 'గీత దాటలేరు' అనే భారత నమ్మకాన్ని వమ్ము చేయగలమని హెచ్చరించారు. ఏ చిన్న రెచ్చగొట్టే కార్యక్రమానికి దిగినా.. తీవ్రంగా స్పందిస్తామని భారత్‌ను హెచ్చరించారు. మరోసారి 'అణు బూచి' కూడా చూపించారు. 'అణ్వస్త్ర సామర్థ్యం ఉన్నప్పుడు యుద్ధానికి చోటు ఉండదని గుర్తుంచుకోవాలి' అని హెచ్చరించారు. కాకుల్‌లోని పాక్ మిలిటరీ అకాడమీలో శనివారం జరిగిన కార్యక్రమంలో మునీర్ భారత్‌ను ఉద్దేశించి పలు ప్రేలాపనలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో తాము స్పష్టమైన విజయాన్ని సాధించామని మునీర్ తెలిపారు. ఇకపై అలాంటి ఏ చిన్న ఘటన ఎదురైనా నిర్ణయాత్మక శక్తితో విరుచుకుపడతామని రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించారు. శత్రు దేశం(భారత్) ఆర్థిక, సైనిక నష్టాన్ని భారీగా చవిచూస్తుందని వ్యాఖ్యానించారు. అయితే... ఆపరేషన్ సిందూర్‌తో పాక్ చావుదెబ్బ తినిందని భారత్ ఇదివరకే పలుమార్లు స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలనూ ప్రపంచంముందుంచింది.

భారత్ ప్రతినిధిగా అఫ్ఘానిస్థాన్!

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తన నోటికి పనిచెప్పారు. అఫ్ఘానిస్థాన్‌తో పాక్‌కు కొనసాగుతున్న వివాదంలో భారత్ ప్రస్తావనకు తీసుకొచ్చి, లింక్ చేయడం ద్వారా ఉద్రిక్తతలు మరింత రాజేసే ప్రయత్నం చేశారు. కాబూల్ భారత్ ప్రతినిధిగా మారిందని వ్యాఖ్యానించారు. అఫ్ఘానిస్థాన్.. న్యూఢిల్లీ, నిషేధిత తెహ్రీక్-ఐ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)తో కలిసి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేస్తోందని 'ఎక్స్'లో ఆరోపించారు. ఇప్పుడు భారత్ ఒడిలో కూర్చొని తమ దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న అఫ్ఘాన్ పాలకులు.. ఒకప్పుడు తమ రక్షణలో ఉన్నారని, తమ భూభాగంపై ఆశ్రయం తీసుకున్నారన్నారు. అఫ్ఘానిస్థాన్‌తో సంబంధాలను ముగిస్తున్నట్లు ప్రకటించిన ఆయన.. 'మా దేశంలో నివసిస్తున్న అఫ్ఘాన్లు అందరూ వారి మాతృభూమికి వెళ్లిపోవాలి' అని పేర్కొన్నారు.

పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ పరిధిలోనే

» ఆపరేషన్ సిందూర్ కేవలం ట్రైలర్ మాత్రమే: రాజ్‌నాథ్ సింగ్



లఖ్‌నవూ, అక్టోబరు 18: పాకిస్థాన్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ పరిధిలో ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దాయాది దేశాన్ని గట్టిగా హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ట్రైలర్ మాత్రమేనని చెప్పారు. భారత్‌కు విజయాలు అలవాటుగా మారాయని చెప్పడానికి ఆ ఆపరేషన్ నిదర్శనమన్నారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌నాథ్‌తో కలిసి ఆయన సరోజిని నగర్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్ నుంచి తయారైన తొలి బ్రహ్మోస్ క్షిపణులను సైన్యానికి శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బ్రహ్మోస్ ఓ క్షిపణి మాత్రమే కాదు. మన దేశ వ్యూహాత్మక ధైర్యానికి అదొక ప్రతీక. ఎలాంటి దాడినైనా తిప్పికొట్టగలిగే సామర్థ్యం మన రక్షణ వ్యవస్థకు ఉంది. రక్షణ ఉత్పత్తుల్లో పెరుగుతున్న మన నమ్మకానికి, సామర్థ్యానికి ఇక్కడి బ్రహ్మోస్ ప్రాజెక్టు ఓ ప్రతీక. ఇక్కడి క్షిపణులను తయారు చేయడం ఒకప్పుడు కల. ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది" అని పేర్కొన్నారు.

శబరిమల ఆలయానికి కొత్త ప్రధాన అర్చకుడు

» బంగారు తాపడాలను తిరిగి అమర్చిన దేవస్థానం బోర్డు

శబరిమల, అక్టోబరు 18: శబరిమల వార్షిక తీర్థయాత్ర కొన్ని వారాల్లో మొదలవుతున్న వేళ, అయ్యప్ప స్వామి ఆలయ కొత్త మేల్శాంతిగా (ప్రధాన అర్చకుడిగా) ప్రసాద్ ఈ.డీ శనివారం నియమితులయ్యారు. కొల్లం జిల్లా మయ్యనాడుకు చెందిన మనూ నంబుతూరి ఎం.జీ.. అయ్యప్ప దేవాలయానికి 100 మీటర్ల దూరంలో ఉన్న మలికప్పురం ఆలయానికి మేల్శాంతిగా ఎంపికయ్యారు. నెలవారీ పూజల కోసం శుక్రవారం శబరిమల ఆలయం తెరుచుకోగా, ఉషాపూజ అనంతరం ట్రావెన్‌కోర్ దేవస్వాం బోర్డు ఆధ్వర్యంలో సంప్రదాయ లాటరీ పద్ధతి ద్వారా ఈ ఎంపిక జరిగింది. ఇక, శబరిమల గర్భగుడి ముందున్న ద్వారపాలకుల విగ్రహాలపై ఉన్న బంగారు తాపడాలను దేవస్థానం బోర్డు తిరిగి అమర్చింది. బంగారు పూత పూసిన రాగి తాపడాలను మరమ్మతుల కోసం 2019లో తొలగించగా.. పలకల్లో తూకం లోపం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో కేరళ హైకోర్టు విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.

జీఎస్టీ 2.0పై కేంద్ర మంత్రుల హర్షం

న్యూఢిల్లీ, అక్టోబరు 18: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) 2.0 సంస్కరణలు ఊహించని ఫలితాలు ఇస్తున్నాయని, ప్రజలకు మేలు చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ శ్లాబులు తగ్గించిన కారణంగా అనేక వస్తువుల ధరలు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయని, ఫలితంగా వాటి విక్రయాలు పుంజుకున్నాయని తెలిపారు. "కొన్ని వస్తువుల ధరలు అనుకున్న దానికంటే ఎక్కువగా దిగివచ్చాయి" అని వ్యాఖ్యానించారు. శనివారం ధన త్రయోదశిని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో కేంద్ర ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి ఆర్థిక మంత్రి.. 'జీఎస్టీ పొదుపు ఉత్సవ్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థ తారాజువ్వలా పుంజుకోనుందన్నారు. జీడీపీ 6.6 శాతానికి చేరుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసిందని తెలిపారు. ఇదంతా ప్రధాని మోదీ నాయకత్వ పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు.

కరూర్ మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు

» విజయ్ పార్టీ తరఫున ఖాతాల్లో జమ

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ రూ.20 లక్షల చొప్పున అందజేసింది. కరూర్ వేలుచామిపురంలో గత నెల 27న టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 100 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన వారు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది డిశ్చార్జి అయ్యారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, రూ.20లక్షల చొప్పున సాయం అందిస్తామని టీవీకే అధ్యక్షుడు విజయ్ ఇంతకు ముందే ప్రకటించారు.

ఢాకా ఎయిర్‌పోర్టులో అగ్ని ప్రమాదం

ఢాకా, అక్టోబరు 18 : బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ కార్గో కాంప్లెక్స్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఈ ప్రాంతంలో దట్టమైన పొగలు ఆవరించడంతో విమానాల రాకపోకలను నిలిపివేయాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఏమైనా ప్రాణ నష్టం జరిగిందా అన్న వివరాలు తెలియరాలేదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

తెలుగుదేశం–జనసేన మధ్య విభేదాలు రాకపోతాయా? చంద్రబాబు–పవన్ కల్యాణ్ కొట్టుకొని విడిపోకపోతారా? అని జగన్ అండ్ కో ఇప్పటి వరకూ ఆశగా చూశారు. తాజాగా పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రకటనలతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టు అయింది. దీంతో అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. గత కొంత కాలంగా క్షేత్రస్థాయిలో తెలుగుదేశం– జనసేన మధ్య తగవులు పెట్టడానికి చెయ్యని ప్రయత్నం లేదు. అయితే వారికి నిరాశే మిగిలింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అభినందించాల్సిందే. కాపుల ముసుగులో జగన్‌రెడ్డి మద్దతు దారులు ఎంతగా రెచ్చగొడుతున్నా ఆయన సంయమనమే పాటిస్తున్నారు. జనసైనికులకు కూడా దిశానిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రం బాగుపడాలంటే కనీసం పదిహేనేళ్ల పాటు కూటమి అధికారంలో కొనసాగాలని సూచిస్తున్నారు. అయితే అవతల ఉన్నది జగన్ అండ్ కో! హుందాతనంతో కూడిన రాజకీయాలను ఆ గుంపు నుంచి ఆశించలేము.

మారీచ కుట్రలు!

విశాఖపట్నం సమీపంలో 1.36 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో గూగుల్ సంస్థ ద్వారా ఏఐ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. దేశ చరిత్రలోనే ఇది అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని కేంద్రం ప్రకటించింది. మన దేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుసకొడుతున్న వేళ ఆ దేశానికి చెందిన గూగుల్ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అతి పెద్ద డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు పెట్టుబడుల వరద ప్రవహిస్తుందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇదొక మైలురాయి. భారీ పెట్టుబడి సాధించినందుకు 'ఆహా' అని మురిసిపోవాలి. అయితే పునాదులు కూడా దాటని వైద్య కళాశాలల నిర్మాణాలను చూసి 'ఆహా' అని ఆశ్చర్యపోవాలని చెప్పుకొన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండ్ కో మాత్రం విషం కక్కడం మొదలుపెట్టారు. గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఏడుపులు లంకించుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పర్యటనలకు వెళ్లినప్పుడు పచ్చని చెట్లను నరికేసినా పర్యావరణం గురించి ఒక్క నోరు కూడా పెగల్లేదు. ఇంతటితో ఆగకుండా ప్రతిపాదిత డేటా సెంటర్‌ను తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నాలు మొదలయ్యాయి. డేటా సెంటర్ అంటే సాదా సీదా గోడౌన్ లాంటిది అని, కంప్యూటర్లను లోపల పెట్టి బయటి నుంచి తాళాలు వేస్తారని వెకిలి మాటలు మాట్లాడుతున్నారు. జగన్ అండ్ కోలో ఇంత మనోవికారం ఎందుకు ఏర్పడిందో అంతుపట్టదు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారే అయితే తాము అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబును మించి పెట్టుబడులు సాధిస్తామని చెప్పుకోవాలి. అలా కాకుండా పొరుగు రాష్ట్రాలకు ఈర్ష్యగా మారిన ఈ ఒప్పందంపై విషం చిమ్మడం ఏమిటి? దీన్నిబట్టి వారి మెదళ్లు ఎంత విషతుల్యం అయ్యాయో అర్థం చేసుకోవచ్చు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోందని ప్రముఖ అంతర్జాతీయ పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ నెల 11న ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న జగన్‌రెడ్డికి ఇలాంటి పెద్ద విషయాలు తెలియకపోవచ్చు అంటే అర్థం చేసుకోవచ్చు. ఆయన మద్దతుదారుల్లో అంతో ఇంతో చదువుకున్న వాళ్లు ఉన్నారు. వారికి కూడా తెలియకపోతే ఎలా? రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే చంద్రబాబుకు గానీ, ఐటీ మంత్రి లోకేశ్‌కు గానీ వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉండదు. పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ మహానగరమే ఇందుకు నిదర్శనం. ఆహా అని మెచ్చుకోవాల్సిన సందర్భాలలో కూడా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. గూగుల్‌తో ఒప్పందానికి సంబంధించిన వార్తను జగన్ మీడియా అస్సలు పట్టించుకోలేదు. అంటే సదరు రోత మీడియాకు రాష్ట్ర ప్రయోజనాలు అంత ముఖ్యం కాదు.. జగన్‌రెడ్డి ప్రయోజనాల కోసమే ఆ మీడియా పనిచేస్తోందన్న మాట! ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ ఏఐ హబ్ గేమ్ చేంజర్ అనే చెప్పవచ్చు. అల్ప బుద్ధులు ఉన్న వారికి ఇది అర్థం కాదు. చేపలు, రొయ్యల దుకాణాలు ఏర్పాటు చేయించడమే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకొన్న వారికి ఇలాంటి పెద్ద విషయాలు అర్థం కావు. చేపలు, రొయ్యలను తాజాగా కొని తెచ్చుకొని తినవచ్చునని పులివెందుల ప్రజలు ఊహించారా? అని సెలవిచ్చిన జగన్‌రెడ్డి నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేము! ప్రభుత్వం సరఫరా చేసే విషతుల్యమైన మద్యం తాగుతూ చేపలూ రొయ్యలూ వండుకొని నంజుకుతింటూ కునారిల్లుతూ ఉండాలన్నది జగన్ అండ్ కో కోరిక. థింక్ బిగ్.. డ్రీమ్ బిగ్ అని దివంగత అబ్దుల్ కలాం చెప్పేవారు. జగన్ అండ్ కో నుంచి అంత ఆశించలేము. వినూత్న ఆవిష్కరణలు, భారీ పెట్టుబడుల గురించి ఆలోచించకపోయినా ఫర్వాలేదు– రాష్ట్రాభివృద్ధికి జరుగుతున్న ప్రయత్నాలపై మారీచ, సుబాహుల వలె నిప్పులు పోయడం ఏమిటి? సంక్షేమం పేరిట ప్రభుత్వం విసిరే మెతుకులు తింటూ జనం ఎదుగూ బొదుగూ లేని జీవితం గడపాలన్నదే జగన్ అండ్ కో అభిలాష. అధికారంలో ఉన్నప్పుడు ఆ దిశగానే అడుగులు వేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితిలో మార్పు మొదలైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరెందరో ఏపీకి రావొచ్చు. ఇదే ఒరవడి కొనసాగితే ప్రజల్లో కూటమికి ఆదరణ పెరుగుతుంది. అదే జరిగితే తమకు రాజకీయంగా నష్టమని భావిస్తున్న జగన్ అండ్ కో కుత్సితపు ఆలోచనలకు తెర తీశారు. కుట్రల అమలు మొదలుపెట్టారు. ఏదో ఒకటి చేసి పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉండకుండా చేయాలన్న ప్రయత్నాలు మొదలయ్యాయి. త్వమేవాహం అంటే త్వమేవాహం అనుకొనేలా కాకుండా జగన్‌రెడ్డికి భిన్నంగా చంద్రబాబు పని చేయడం ఏమిటి? ఆయన ప్రయత్నాలు ఫలించడం ఏమిటి? కేంద్రం నుంచి సహకారం అందడం ఏమిటి? అని రగిలిపోతున్నారు.

ఆ చావులు మరిచారా?

'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్టుగా అధికారంలో ఉన్నంత కాలం విషతుల్యమైన మద్యాన్ని ప్రజలకు విక్రయించి మద్యం కొనుగోళ్లలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్ అండ్ కో, ఇప్పుడు కల్తీ మద్యాన్ని తెర మీదకు తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జరుగుతూనే ఉంటాయి. కల్తీ సారా, కల్తీ మద్యం తాగి మన తెలుగునాటే కాదు, ఇతర రాష్ట్రాలలోనూ ఎంతో మంది మరణించిన సంఘటనలను చూశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, రాష్ట్రం విడిపోయాక గానీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒక్క జగన్మోహన్‌రెడ్డి మినహా మరే ముఖ్యమంత్రి కూడా మద్యం ద్వారా సొమ్ములు దండుకొనే ఆలోచన కూడా చేయలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా మద్యం ద్వారా వెనుకేసుకోవాలని భావించలేదు. కాసులకు కక్కుర్తిపడి విషతుల్యమైన మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఘనత మాత్రం జగన్‌రెడ్డికే దక్కుతుంది. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్ అండ్ కో పాలనలో కల్తీ మద్యం సరఫరా కాలేదా? అంటే జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు మరణించిన విషయం అప్పుడే మరచిపోతే ఎలా? గతంలో ఏమి జరిగినా చర్యలు ఉండేవి కావు. ఇప్పుడు ములకలచెరువులో ఈ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేయడానికే వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు త్వరలోనే బయటికొస్తాయి. పాపం పండే ప్రమాదం ఉందని తెలియడంతో జగన్‌రెడ్డి రోత మీడియా యథావిధిగా అభూత కల్పనలతో కథనాలను వండి వారుస్తోంది. ఈ క్రమంలో ప్రజలకు నిజాలు చెప్పాలని ప్రయత్నిస్తున్న 'ఆంధ్రజ్యోతి' పత్రికపై మాజీ మంత్రి పేర్ని నాని విషం కక్కుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనాలు జుగుప్స కలిగిస్తున్నాయని ఆయన నోరు పారేసుకున్నారు. నిజానికి ఒకప్పుడు సౌమ్యుడిగా పేరున్న నాని వైసీపీలో చేరిన తర్వాత వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. అప్పుడు ఆయన ప్రవర్తన సంస్కారవంతంగా ఉండేది. జగన్‌రెడ్డితో చేతులు కలిపిన తర్వాత ఆయన ప్రవర్తన మారింది. మంచివాడు అనిపించుకున్న పేర్ని నాని వంటి వారు కూడా వివేకం మరచి విజ్ఞత లేకుండా మాట్లాడటం చూస్తుంటే వారు ఏదైనా వైరస్ బారినపడ్డారా అన్న అనుమానం కలుగుతుంది. లేని పక్షంలో మంచివాళ్లు కూడా జగన్ పక్షం చేరగానే హద్దూ అదుపూ లేకుండా ఎలా వ్యవహరించగలరు? కల్తీ మద్యం తయారీ అనేది అసాధారణ సంఘటన ఏమీ కాదు. అయితే జగన్ అండ్ కో దీనికి ఎందుకంత ప్రాధాన్యం ఇస్తున్నారంటే, కారణం లేకపోలేదు. మద్యం ద్వారా నేను ఒక్కడినే సొమ్ములు వెనుకేసుకోలేదు.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే పని చేస్తున్నారని ప్రజలను నమ్మించడానికే ఈ తాపత్రయం. అదే సమయంలో మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. జగన్‌రెడ్డి ఒక పార్టీకి అధిపతి కనుక ఇలాంటి ట్రిక్కులు చేయడంలో ఆశ్చర్యం ఉండకపోవచ్చు. చంద్రబాబుపై రాజకీయంగా బురద చల్లడాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు. కానీ, రాష్ట్రంపై కూడా విషం చిమ్మాలనుకోవడం ఏమిటి? అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నించడం ఏమిటి? ఈ క్రమంలో జగన్ అండ్ కో గత కొంత కాలంగా చేస్తున్న ప్రచారం, అమలు చేస్తున్న కుట్రలను పరిశీలిస్తే వారికి ఇలాంటి విషపూరిత ఆలోచనలు ఎలా వస్తాయో అని ఆశ్చర్యం వేస్తుంది.

> **గూగుల్ నిర్ణయం తర్వాత మరెందరో ఏపీకి రావొచ్చు. ఇదే ఒరవడి కొనసాగితే ప్రజల్లో కూటమికి ఆదరణ పెరుగుతుంది. అదే జరిగితే తమకు రాజకీయంగా నష్టమని భావిస్తున్న జగన్ అండ్ కో కుత్సితపు ఆలోచనలకు తెర తీశారు. కుట్రల అమలు మొదలుపెట్టారు. ఏదో ఒకటి చేసి పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉండకుండా చేయాలన్న ప్రయత్నాలు మొదలయ్యాయి.**

కులాల కుంపట్లలో చలి కాచుకుంటూ..

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంలో తప్పు లేదు. ప్రజల తరఫున ప్రతిపక్షంగా పోరాటం చేయడం కూడా వారి హక్కు. అంతేగానీ జరగనిది జరిగినట్టుగా, ఏమీలేని చోట విద్వేషాలు రగిలించే ప్రయత్నాలు చేయడం, కులాల కుంపట్లు రగిలించడం ఏమిటి? దారి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే కూటమి ప్రభుత్వం మరో పదిహేనేళ్లు అధికారంలో ఉండాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు. తెలుగుదేశం–జనసేన మధ్య విభేదాలు రాకపోతాయా? చంద్రబాబు–పవన్ కల్యాణ్ కొట్టుకొని విడిపోకపోతారా? అని జగన్ అండ్ కో ఇప్పటి వరకూ ఆశగా చూశారు. తాజాగా పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రకటనలతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టు అయింది. దీంతో అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. గత కొంత కాలంగా క్షేత్రస్థాయిలో తెలుగుదేశం– జనసేన మధ్య తగవులు పెట్టడానికి చెయ్యని ప్రయత్నం లేదు. అయితే వారికి నిరాశే మిగిలింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అభినందించాల్సిందే. కాపుల ముసుగులో జగన్‌రెడ్డి మద్దతుదారులు ఎంతగా రెచ్చగొడుతున్నా ఆయన సంయమనమే పాటిస్తున్నారు. జనసైనికులకు కూడా దిశా నిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రం బాగుపడాలంటే కనీసం పదిహేనేళ్ల పాటు కూటమి అధికారంలో కొనసాగాలని సూచిస్తున్నారు. అయితే అవతల ఉన్నది జగన్ అండ్ కో! హుందాతనంతో కూడిన రాజకీయాలను ఆ గుంపు నుంచి ఆశించలేము. ఈ నేపథ్యంలోనే నెల్లూరు జిల్లా కందుకూరులో ఒక సంఘటన జరిగింది. ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వైషమ్యాల వల్ల ఒకరి హత్య జరిగింది. హత్యకు గురైన వ్యక్తి కాపు సామాజిక వర్గానికి చెందినవాడు. హత్య చేసిన వ్యక్తి కమ్మ సామాజిక వర్గానికి చెందినవాడు. ఇంకేముందీ.. వైసీపీకి చెందిన రాబందులు వాలిపోయాయి. కమ్మ–కాపు అంశాన్ని తెర మీదకు తెచ్చి వైషమ్యాల సృష్టికి చేయని ప్రయత్నం లేదు. నిజానికి హతుడు–హంతకుడు కొంత కాలం క్రితం వరకు సన్నిహితంగానే ఉండేవారు. కారణాలు ఏవైనా వారి మధ్య వైరం ఏర్పడింది. దీంతో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మదంతో విచక్షణ మరచి కారుతో తొక్కించి చంపాడు. జరిగినది హత్య అని తెలియగానే పోలీసులు ఈ దురాగతానికి పాల్పడిన వ్యక్తితో పాటు అతడి తండ్రిని కూడా హత్యా నేరం కింద అరెస్టు చేశారు. ఇక్కడ కులాల గొడవ తలెత్తకూడదు. అయితే అలా వదిలేస్తే వారు జగన్ అండ్ కో ఎందుకవుతారు? వైసీపీకి మద్దతుగా ఉంటున్న కాపు సామాజికవర్గానికి చెందిన కొద్ది మంది అక్కడ వాలిపోయారు. కాపులను రెచ్చగొట్టే విధంగా వీడియోలు వదిలారు. ఫేక్ ఐడీలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ వీరంగం వేస్తున్నారు. అధికారంలో ఉన్నది కమ్మ సామాజిక వర్గమని, అందుకే కాపులకు రక్షణ లేకుండా పోయిందని, సొంత సామాజిక వర్గాన్ని రక్షించుకోవడంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విఫలమయ్యారని, కమ్మ వాళ్ల చేతిలో కాపులు మరోసారి మోసపోయారంటూ కాపులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక ముస్లిం మహిళకు వంగవీటి శిరీష అనే పేరు తగిలించి పోస్టులు పెట్టించారు. చౌదరి గారు ఆశపడితే నాయుడు తన భార్యను పంపకపోతే పరిణామం ఇలాగే ఉంటుందని తీవ్రమైన వ్యాఖ్యలతో సదరు ఫేక్ ఐడీ ద్వారా పోస్టులను సోషల్ మీడియాలో తిప్పారు. రాజకీయాల్లో ఇంత నీచత్వం ఏమిటి? ఫేక్ ఐడీలతో ప్రజల మెదళ్లలో విషం నింపే ప్రయత్నాలు చేయడాన్ని మించిన దురాగతం ఉంటుందా?



కూటమిలో చిచ్చు కోసం తహతహ!

ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు మరెక్కడైనా వ్యక్తుల మధ్య వివాదాలు ఏర్పడటం, ఘర్షణలు జరిగి హత్యలకు దారి తీయడం కొత్త కాదు. అన్నదమ్ములే కొట్టుకు చస్తున్నారు. ఏ సంఘటనలోనైనా ఒకరు బాధితుడైతే మరొకరు నేరస్థుడవుతారు. కందుకూరులో కూడా ఇదే జరిగింది. అతడు కాపు. చంపిన వ్యక్తి కమ్మ కావడం యాదృచ్ఛికం. ఈ దురాగతానికి పాల్పడిన వాడిని కాపాడటానికి ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ ప్రయత్నించలేదు కదా? హంతకుడు జైల్లోనే ఉన్నాడు. అధికారంలో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్‌ను అనేక విధాలుగా అవమానించడమే కాకుండా ఆయన నటించిన సినిమాలు కూడా నడవకుండా అడ్డుపడిన జగన్ అండ్ కో, ఇప్పుడు కాపులను రెచ్చగొట్టడం చూస్తే వారి ఆంతర్యం అర్థం చేసుకోవచ్చు. ఎలాగైనా కూటమిలో చిచ్చు పెట్టాలి. చంద్రబాబు–పవన్ కల్యాణ్ మధ్య విభేదాలు సృష్టించాలి. ఇందుకోసం గోతి కాడ నక్కల్లా ఎదురు చూస్తున్నారు. కూటమి ఐక్యంగా ఉంటే మళ్లీ అధికారంలోకి రావాలన్న తమ కోరిక కలగానే మిగిలిపోతుందన్నది వారి బాధ. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు కమ్మ–కాపులు సఖ్యంగానే ఉండేవారు. వంగవీటి రంగా హత్యానంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి రంగప్రవేశంతో ఈ రెండు సామాజిక వర్గాల మధ్య పూడ్చలేని అగాథాన్ని సృష్టించారు. కందుకూరులో జరిగిన సంఘటన ఇద్దరు వ్యక్తులకు సంబంధించినదే. ఇందులో ఆ రెండు కులాలకు చెందిన ఇతరుల ప్రమేయం ఏముంది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కాపులే కాదు కమ్మ వారు కూడా హత్యలకు గురయ్యారు. ఈ హత్యలకు స్థానిక పరిస్థితులే కారణం కానీ కులాలు కావు కదా? మెదళ్ల నిండా విషం నింపుకొని రాజకీయం చేయాలనుకుంటున్న జగన్ అండ్ కోను అర్థం చేసుకోవడం మానవమాత్రులకు సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే సంప్రదాయ రాజకీయాలకు మాత్రమే అలవాటుపడిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉండి కూడా జగన్‌ను ఎదుర్కోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. విచిత్రమేమింటే, జగన్‌రెడ్డి విషపూరిత ఆలోచనలు, కుట్రలను అమలుచేయడానికి ఆయనకు మనుషుల కొరత లేదు. అదేమిటో గానీ, జగన్‌ను సమర్థించే వారు గానీ, కుట్రల అమలులో పాలుపంచుకొంటున్న వారు గానీ విచక్షణ కోల్పోతున్నారు. అంతుపట్టని ఉన్మాదం వారిని ఆవహిస్తోంది. లేనిపక్షంలో జగన్ కోసం అడ్డమైన పనులూ చేసి ఇబ్బందులపాలవడానికి ఎందుకు సిద్ధపడతారు? చేసిన పాపాలకు జైలుకు వెళ్లి వచ్చిన వారిలో కూడా పశ్చాత్తాపం కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనం. నేరం చేస్తే దొరికిపోతామన్న భయం వారిలో కనిపించడం లేదు. దొరికిపోయినా ఫర్వాలేదు జగన్‌రెడ్డి కోసం జైలుకు వెళ్లడానికి, చివరకు చనిపోవడానికి కూడా సిద్ధపడటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎలాగోలా జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని కేక్‌లా కోసుకు తినవచ్చునన్న ఆశల్లో విహరిస్తున్నారు. కందుకూరు సంఘటనపై ఫేక్ ఐడీతో పోస్టులు పెట్టిన మహిళ కేవలం డబ్బుల కోసమే ఆ పని చేశారని భావించలేము. ఆమెను అంతకు మించిన ఉన్మాదం ఏదో ఆవహించి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ బెడద పోవాలంటే పులివెందులను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించి దానికి జగన్‌రెడ్డిని శాశ్వత ముఖ్యమంత్రిగా చేస్తే సరిపోతుందేమో! లేని పక్షంలో జగన్‌రెడ్డి వ్యాపింపజేస్తున్న వైరస్ ఇతర జిల్లాల ప్రజలకు సోకి మొత్తం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంది. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. విచిత్రం ఏమిటంటే హైదరాబాద్‌లో ఉంటూ జగన్‌కు మద్దతు పలికే వారికి మాత్రం ఆంధ్రప్రదేశ్ పురోగమించడం నచ్చడం లేదు. తెలంగాణలో కొత్త ప్రాజెక్టులు వచ్చినా, అభివృద్ధి జరిగినా ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్నవారు ఎవరూ విమర్శించలేదు. జగన్‌రెడ్డికి జలుబు చేస్తే తెలంగాణలో ఆయన మద్దతుదారులు ముక్కు చీదుకుంటూ ఉపశమనం కలిగించాలనుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై లేని వ్యతిరేకతను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని హైదరాబాద్‌లో కూర్చొని విమర్శలు చేస్తున్నారు. వాళ్లంతా జగన్‌రెడ్డి హయాంలో పత్రికా స్వేచ్ఛపై దాడి జరిగినప్పుడు కళ్లు మూసుకొని ఆనందించారు. ఇవాళ తన దాకా వచ్చేసరికి జగన్‌రెడ్డికి కూడా పత్రికా స్వేచ్ఛ గుర్తుకొచ్చింది. అధికారంలో ఉన్నంత కాలం 'ఏబీఎన్'తో పాటు 'టీవీ 5' ప్రసారాలను నిలిపివేయించలేదా? శాసనసభ కార్యక్రమాలను కూడా కవర్ చేయకుండా 'ఏబీఎన్'ను నిర్బంధించలేదా? సీఐడీ పోలీసులతో 'ఆంధ్రజ్యోతి' పత్రిక పైనా, సిబ్బంది పైనా కేసులు పెట్టించారు. ఆ కేసులకు సంబంధించి ఇప్పటికీ కోర్టులకు హాజరవుతున్నాం కదా? అధికారం కోల్పోయిన తర్వాత కూడా మా సంస్థలను దూరం పెట్టడం నిజం కాదా? జగన్ కార్యక్రమాలు, వైసీపీ నిర్వహించే విలేకరుల సమావేశాలకు 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్'లపై నిషేధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు కదా? చివరకు నాపై కూడా దేశ ద్రోహం సెక్షన్ల కింద కేసులు పెట్టారు కదా? ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ గురించి గొంతు చించుకుంటున్న వాళ్లు అప్పుడు నోరు కట్టేసుకోవడానికి కారణం ఏమిటి? పత్రికా స్వేచ్ఛ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అప్పుడు గుర్తుకురాలేదా? నీవు నేర్పిన విద్యనే నీరజాక్షా.. అన్నట్టుగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుండటాన్ని తప్పు పట్టే నైతిక హక్కు జగన్ అండ్ కోకు ఉందా? నాటి బాధితుల ఆక్రందనలు మీకు శ్రవణానందకరంగా ఉండి ఉండవచ్చు. ఇప్పుడు మీ ఆక్రందనలు కూడా ఇతరులకు అదే విధంగా శ్రవణానందకరంగా ఉంటాయని సరిపెట్టుకోండి. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అని అంటారు. నాడు అధికార మదంతో విర్రవీగినందుకు ఇప్పుడు ఫలితం అనుభవించాలి కదా? ఇప్పుడు అద్దెకు తెచ్చుకున్న గొంతులు మీకు అనుకూలంగా మాట్లాడవచ్చు. మీకు మద్దతుగా మాట్లాడవచ్చు. అయితే అలాంటి గొంతులకు విలువ ఉండదు. దుష్ట సంప్రదాయాలను నెలకొల్పే ముందే ఆలోచించుకోవాలి. రేపు మనకూ అదే గతి పడుతుందని తెలుసుకోవాలి కదా? అప్పట్లో 'ఏబీఎన్' ప్రసారాల నిలిపివేతపై న్యాయస్థానాలు ప్రశ్నించగా, మాకేమి సంబంధం అని బుకాయించారు. అప్పుడు మీరు ఏర్పాటు చేసిన దారిలోనే ఇప్పుడు అధికారంలో ఉన్న వారు నడిస్తే ఎలా తప్పు పట్టగలరు? సాటి మీడియాను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నది ఎవరు? ఇప్పుడు మీ మీడియాను కూడా అధికారంలో ఉన్నవారు తమ ప్రత్యర్థిగానే భావించడంలో తప్పేముంది? అధికారం శాశ్వతం అని విర్రవీగిన వారికి ప్రకృతి గుణపాఠం నేర్పుతుంది. అన్యాయం, అక్రమం, దుర్మార్గం, దారుణం అని ఇప్పుడు ఎంత ఘోషించినా అది అరణ్య రోదనే అవుతుంది. ఇప్పటికైనా జగన్‌రెడ్డి అండ్ కో బాధ్యతగా వ్యవహరిస్తే మంచిది. అలా కాకుండా తాము కాకుండా ఎవరు అధికారంలో ఉన్నా రాష్ట్రం సర్వనాశనం అవుతుందని నిత్యం గగ్గోలు పెట్టినా నిజం ఏమిటో తెలుసుకోలేని స్థితిలో ప్రజలు లేరు. అధికారంలో ఉన్నప్పుడు గిట్టని మీడియాను అణచివేయడానికి ఎంత ప్రయత్నించినా మీ ఓటమిని తప్పించుకోలేకపోయారు కదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా నిజంగా తప్పు చేస్తే దాన్ని శిక్షించే విషయం ప్రజలే చూసుకుంటారు. అయితే ముందుగా మీ విశ్వసనీయత ఏపాటిదో తెలుసుకుంటే మంచిది. రాష్ట్రానికి మంచి జరిగినప్పుడు కూడా హర్షించలేని మనస్తత్వం ఉన్నవాళ్లను ఆ దేవుడే కాపాడాలి!

> **నిజానికి ఒకప్పుడు సౌమ్యుడిగా పేరున్న పేర్ని నాని వైసీపీలో చేరిన తర్వాత వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. అప్పుడు ఆయన ప్రవర్తన సంస్కారవంతంగా ఉండేది. జగన్‌రెడ్డితో చేతులు కలిపిన తర్వాత ఆయన ప్రవర్తన మారింది. మంచివాడు అనిపించుకున్న నాని వంటి వారు కూడా వివేకం మరచి విజ్ఞత లేకుండా మాట్లాడటం చూస్తుంటే వారు ఏదైనా వైరస్ బారినపడ్డారా అన్న అనుమానం కలుగుతుంది. లేని పక్షంలో మంచివాళ్లు కూడా జగన్ పక్షం చేరగానే హద్దూ అదుపూ లేకుండా ఎలా వ్యవహరించగలరు? కల్తీ మద్యం తయారీ అనేది అసాధారణ సంఘటన ఏమీ కాదు. అయితే జగన్ అండ్ కో దీనికి ఎందుకంత ప్రాధాన్యం ఇస్తున్నారంటే, కారణం లేకపోలేదు. మద్యం ద్వారా నేను ఒక్కడినే సొమ్ములు వెనుకేసుకోలేదు.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే పని చేస్తున్నారని ప్రజలను నమ్మించడానికే ఈ తాపత్రయం. అదే సమయంలో మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

వెలిగించుడు దీపాలను!

వెలిగించుడొక దీప కళిక స్వార్థధ్వాంత
పటలమంతయు పటాపంచలవగ
వెలిగించుడొక దీప కళిక ఘోర జిఘాంస
మానసమ్ములనుండి మలిగిపోవ
వెలిగించుడొక దీప కళిక కామాది షట్
శత్రువర్గంబెల్ల సమసిపోవ
వెలిగించుడొక దీప కళిక మానవజాతి
బురుషార్థములవెల్గు పొనరజేయ

మానవత్వపు మనికికి మరొక దివ్వె
జీవకారుణ్యమును పెంపు చేయనొకటి
విశ్వశాంతిని వెలయింప వేరుదివ్వె
ఆ పరంజ్యోతి రూపును చూపు దివ్వె

వెలిగించుడు దీపాలను
తొలగింపగ ఇరుల తెరలు దురితము దొరగన్
ఖలుడా నరకుని నీడయె
ఇలలో లేకుండ వెలుగులింపెసలారన్

– వేదాంతం శరచ్చంద్రబాబు

మమతల మతాబులు

చీకటిలో చిరుదివ్వెలు వెలిగించుటే పండుగోయి
అజ్ఞానపు అంధకారం విడుచుటనే పండుగోయి
నరకాసుర సంహారం జన జీవన సంతోషం
సత్యభామ వీరోచితం జగతి శాంతి కేతనం

అసుర గణ వధపర్వం ప్రగతి కాంతి పతాకం
అబల కాదు ఏ వనితా తెలుపుతోంది ఈ చరిత
చిచ్చుబుడ్లు కాకర్లు హృది వెలుగుల ఆనవాళ్లు
మదిలోపల కాలుష్యం మసై పోవుటే పండుగోయి

మనసు మనసు కలిసి మెలిసి పురివిప్పితేనే
మమతల మతాబులే ముదముగ విరజిమ్మునోయి
తిమిరంతో సమరమే వెలుగు పూల నిచ్చునోయి
సాంప్రదాయ సందళ్లే వసంతమై వచ్చునోయి..!

– కటుకోజ్వల రమేష్

స్వర్ణ ధర్మ విజయ దీపావళి

స్వర్ణభారత ప్రాంగణద్వారములకు
పచ్చ మావి తోరణముల్ రెపరెపలాడ,
దీపములు గుండె గుమ్మాల తేజరిల్ల–
'దీపలక్ష్మి' భువికి వచ్చె– దివ్యగతిని!

సకల మానవకోటిని– జ్ఞానధర్మ
పథముల నడపు 'దీపాల పండుగ' ఇది!
ప్రతి గృహము 'అష్టలక్ష్మి' నివాసమవగ–
'స్వర్ణ దివ్య దీపావళి' పండుగ ఇది!

సకల దేవతాకోటికి సవినయముగ
మానవాళి కావించెడి– మంగళకర
భవ్య 'దీప పుష్పార్చనా' పర్వమిదియె!
'స్వర్ణ ధర్మదీపావళి' పర్వమిదియె!

అన్నదాతల మోముల – ఆశల చిరు
నవ్వుదివ్వెలు వెలిగించి, నవ్య అఖిల
భారతావని– భాగ్యాల పరిఢవిల్ల
'స్వర్ణ దీపలక్ష్మీ' మము సాకుమమ్మ!

– కళ్యాణశ్రీ

ఇంటింటా ఆనందరవళి

ముదితల కన్నుల్లో మతాబులు
చిరుతల చేతులలో కాకర పూలు
తమ్ముళ్లు వెలిగించిరి భూచక్రాలు
పెద్దన్న మోగించే పేటేరు టపాసులు!

దీపావళీ రవళుల కాంతులు
టపాసుల చిటపట మోతలకు
అమావాస్య జడలతో తిష్ట వేసిన
కారుచీకటి ఊరి పొలిమేరలనుంచి
పారిపోయే
ఇంటింటా దీపావళి..
కంటికి ఇంపైన రూపావళి..!

– జి. సూర్యనారాయణ

వెలుగుదారి

తిమిరానవెల్గె జ్యోతులు
కమనీయ టపాసులెల్ల గంభీరగతిన్
క్షమనలరారెను ఋజు ధ
ర్మము నడయాడ
భరతోర్వరయు రాజిల్లెన్

చైతన్యపతాక యిదియె
జాతికి నవదీప్తి యిదియె
సత్యంబిదియే
నీతివిధానంబిదె వి
ఖ్యాతంబిదె దీపలక్ష్మికాభరణమిదే

వెలుగే మనసంకేతము
వెలుగే మనబాంధవుండు
వెలుగే హితుడున్
వెలుగుల చత్రంబెత్తుచు
వెలుగుల దారిపయనింప
విజయము మనదే

– మంకుశ్రీను

విశ్వమంతా ప్రేమ రంగులు

ఆశావాదపు రాకెట్ల సాక్షిగా
ఓటమి జ్వాలలను చిమ్ముతూ
గెలుపు అంతరిక్షంలోకి
చిచ్చుబుడ్లు స్వేచ్ఛగా దూసుకెళ్లేలా
సుర సుర బాణాల ఆత్మవిశ్వాస దీపావళి
ఆనంద డోలికల ఇంద్రధనస్సు కావాలి

చెడుపై రావణ సంహారం
మంచిపై రాముని సందేశం
మనలోని విద్వేషాల బాంబుల
నరకాసురుడు అస్తమించి
విశ్వమంతా ప్రేమ రంగుల
నవోదయ దీపావళి వికసించాలి
శాంతి మంత్రం జీవనదిలా ప్రవహించాలి

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

మద్యం షాపులకు తగ్గిన డిమాండ్

- చివరి రోజు అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ
- వరంగల్ అర్బన్, రూరల్‌లో సుమారు 4500 మంది పోటీ
- 124 వైన్‌షాపులకు 23న లక్కీడ్రా

8



వరంగల్ రూరల్ ఈఎస్ కార్యాలయం ఎదుట దరఖాస్తుదారుల రద్దీ



బీసీ బంద్ సందర్భంగా హనుమకొండ చౌరస్తాలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

గర్జించిన బీసీలు

బీసీ బంద్ విజయవంతం

- వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ర్యాలీలు
- జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు
- నిలిచిపోయిన బస్సులు.. మూతపడిన దుకాణాలు
- బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాలు
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే నాయిని
- పాల్గొన్న పలువురు రాజకీయ ప్రముఖులు

7

లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించండి

విద్యుత్ సమస్యలపై సీఎండీకి ఎమ్మెల్యే కడియం వినతి



సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం

రాంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

జఫర్‌గడ్‌లో 7 సబ్‌స్టేషన్‌లు ఉన్నప్పటికీ లోడు అధికంగా ఉన్నందున 131/33 కేవీ సబ్‌స్టేషన్ అవసరమని ఈ సందర్భంగా కడియం సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నారాయణపూర్, చిల్పూర్ మండలంలోని నష్కల్, పల్లగుట్ట గ్రామాల్లో తక్కువ వోల్టేజ్ సమస్యతో రైతుల మోటార్లు కాలిపోతుండటంతో ఇబ్బందులు పడు తున్నారని ఆయా గ్రామాల్లో 33బై11 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయాలని కోరారు. జనగామ జిల్లాలోని జఫర్‌గడ్, లింగాలఘణపురం, చిల్పూర్ మండలా లల్లో ఒక్క ఆపరేషన్ విభాగం ఉండటం వల్ల సమయానికి విద్యుత్ సేవలు అందడంలేదని కూనూర్ ప్రధాన కేంద్రంగా ఒకటి, మల్కాపూర్ కేంద్రంగా ఒకటి, వడిచెర్ల కేంద్ర ఒక ఆపరేషన్ విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ త్వరలోనే సమస్యలు పరిష్కరించుతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

22న ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీమార్ట్, ఫ్లిప్‌కార్ట్, మెజిమో మీడియా, సంపద నెక్స్‌జెన్‌లలో 20 ఉద్యోగాలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు కలిగి 10వ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 22న ములుగు రోడ్డులోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 10.30 గంటలకు జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉర్సు గుట్ట వద్ద నేడు నరకాసుర వధ

హాజరు కానున్న పలువురు ప్రముఖులు

కరీమాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలకు ఏమాత్రం తీసిపోకుండా ఆదివారం నరకాసుర వధ నిర్వహించేందుకు ఉర్సు గుట్ట కుడా ప్రాంగణం సిద్ధమైంది. ఈసారి 58 అడుగుల భారీ నరకాసుర ప్రతిమను శక్తివంతమైన బాణాసంచాతో దహనం చేసేందుకు సిద్ధం చేశారు. అదే విధంగా ప్రత్యేక ఆకర్షణగా మిరుమిట్లు గొలిపే అత్యంత శక్తివంతమైన ప్రత్యేక బాణసంచాతో పాటు నాగుపాము, మల్లె పందిరి, రింగు రూపంలో బాణసంచాను సిద్ధం చేశారు. వేలాది మంది ప్రజలు పాల్గొనే ఈ వేడుకలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో లైటింగ్స్, సౌండ్స్, వేదిక ముందు బారికేడ్లు, భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు, విద్యుత్ దీపాలు సిద్ధం చేశారు. నరకాసుర వధ వేడుకలు సాయంత్రం 6 గంటలకు ప్రారంభంకానున్నాయి. సాయంత్రం 5 గంటలకు ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి శ్రీకృష్ణ సత్యభామ వేషధారణలో కోలాటాలతో, భజనలతో, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుతో రథం ఉర్సు గుట్టకు చేరుకుంటుంది. ఆ తరువాత సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్థానిక కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి.

ఈ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతున్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ రాయల ప్రభాకర్, ఏఎస్పీ శుభం ప్రకాష్, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, స్థానిక కార్పొరేటర్లు హాజరుకానున్నారు.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతమ్, ఉపాధ్యక్షులు ఆవునూరి రామ్మూర్తి, వనం మధు, దూడె బాలకొమురెల్లి, సహాయ కార్యదర్శులు వనం కుమార్, ఆవునూరి రామన్న, కార్యనిర్వాహక కార్యదర్శులు అన్న కుమారస్వామి, నరసింహా, ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యుల నేతృత్వంలో వేడుకలు నిర్వహిస్తున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం ప్రకాష్



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

కరీమాబాద్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): నరకాసుర వధ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం ప్రకాష్ సూచించారు. శనివారం వారు ఉర్సు గుట్ట కుడా మైదానాన్ని పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మైదానంలో పర్యటించారు. పోలీసుల బందోబస్తు, ఉత్సవాల నిర్వహణ, బారికేడ్ల ఏర్పాట్లు, సభా వేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏర్పాట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. ఉత్సవాలకు కావాల్సిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్సైలు నరేష్, శ్రవణ్‌కుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కనుకుంట్ల రవి, మరుపల్ల గౌతమ్, ఆవునూరి రామ్మూర్తి, వనం మధు, దూడె బాలకొమురెళ్ళి, వనం కుమార్, ఆవునూరి రామన్న, శెట్టి మోహన్, కుమారస్వామి, నరసింహా, శ్యాం, రాజు, రామ్, పవన్, సతీష్, రంజిత్, సురేష్, కార్తీక్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఔషధాల లభ్యత, వైద్యుల హాజరు, పరీక్ష పరికరాల వినియోగం, తల్లి-శిశు సంరక్షణ వంటి అంశాలపై నిరంతరం మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాలబాలికలందరికీ వారి షెడ్యూల్ ప్రకారం ఇమ్యూనైజేషన్ వందశాతం ఇప్పించాలన్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు.

జిల్లాలో నమోదు అయిన కుష్టు వ్యాధి కేసులకు తగిన అందించి వ్యాధిగ్రస్థుల దగ్గరి ఇంటి వారిని స్ర్కీనింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించి వ్యాధి విస్తరించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు విధిగా సమయపాలన పాటించాలని, జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు ప్రారంభించే ముందు ప్రొటోకాల్ తప్పనిసరి పాటించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ ఆచార్య, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడి అరెస్ట్‌ను చూపిస్తున్న పోలీసులు

నల్లబెల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులోని నిందితుడిని శనివారం రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మెరగుత్తి సురేశ్ కుటుంబఘర్షణల్లో భాగంగా అన్న, వదినలపై కత్తితో బుధవారం దాడి చేశాడు. అదే రోజు రాత్రి వదిన స్వరూప మృతి చెందింది. అన్న రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, వరంగల్ ఎంజీఎం దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. అనంతరం నిందితుడు సురేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, విచారణ చేయగా నిందితుడు సురేశ్ ఇంటి స్థలం విషయం, అలాగే అన్న రూ.10 వేలు తీసుకొని ఇవ్వడంలేదని కక్షతో కత్తితో పొడిచానని తెలియజేశాడన్నారు. దీంతో నిందితుడు సురేశ్‌ను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సాయిరమణ, ఎస్సై గోవర్ధన్‌లు వెల్లడించారు.

కేయూ పరీక్షల రీషెడ్యూల్ టైమ్ టేబుల్ వెల్లడి

కేయూ క్యాంపస్ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంద్ నేపథ్యంలో అక్టోబరు 18న శనివారం నిర్వహించాల్సిన పరీక్షల రీ షెడ్యూల్ టైమ్ టేబుల్‌ను శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌కట్ల రాజేందర్, ఎమ్డీ ఆసీమ్ ఇక్బాల్, డాక్టర్ పద్మజలు వెల్లడించారు. పరీక్షల కేంద్రాలు, పరీక్షల సమయాల్లో ఎటువంటి మార్పులు లేవని, విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు గమనించాలని స్పష్టం చేశారు. రీ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. 18న జరగాల్సిన సీఎల్ఐఎస్సీ పరీక్షల అక్టోబరు 24న శుక్రవారం నిర్వహిస్తారు. అక్టోబరు 18న జరగాల్సిన ఎల్ఎల్‌బీ మూడేళ్ల మొదటి, ఐదో సెమిస్టర్, ఐదేళ్ల ఐదో, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 21న గురువారం నిర్వహిస్తారు. అక్టోబరు 18న జరగాల్సిన కేయూ ఎంటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలను అక్టోబరు 31న శుక్రవారం నిర్వహిస్తారు. 18న జరగాల్సిన కేయూ ఎంఎస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్స్ కోర్సు నాలుగో సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 25న శనివారం నిర్వహిస్తారు.

బీసీ బంద్‌తో ప్రయాణికుల ఇబ్బందులు

ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీల వసూలు

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకోసం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంద్ పిలుపు ఇవ్వడంతో వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోలలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రయాణికులు బస్టాండ్‌లో ఉండి బస్సుల కోసం ఎదురు చూశారు. దీపావళి పర్వదినం పండుగ సందర్భంగా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో స్వగ్రామాలకు పయనమైన బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ నుంచి వరంగల్, హనుమకొండ, పరకాల, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు సర్వీసులు నడవక అదనపు చార్జీలు చెల్లించి ప్రైవేటు వాహనాల్లో స్వగ్రామాలకు తరలి వెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్, ఖమ్మం, భూపాలపల్లి, కరీంనగర్ ఇతర రూట్లలో బస్సు సర్వీసులు నడిపినట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు.

వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరగాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరగాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దీపావళి పర్వదినం సందర్భంగా నగరంలో అన్ని చోట్ల వీధి దీపాలు వెలగడంతో పాటు అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా ఉండాలని అన్నారు. నగరంలో ఎక్కడూనా పైపుల లీకేజీ ఉంటే వెంటనే గుర్తించి తగిన పరిష్కారం చూపాలన్నారు. నీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న పనులతోపాటు ఇంకా ఎక్కడైనా అవసరం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలన్నారు. వీధిదీపాల నిర్వహణతో పాటు విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ జరగాలన్నారు. దీపావళి సందర్భంగా రంగలీల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మహేందర్, సంతోష్‌బాబు, మాధవిలత, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులు ఫైర్ సేఫ్టీ పాటించాలి

నగరంలో బాణాసంచా విక్రయదారులు ఫైర్ సేఫ్టీ పాటించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో వివిధ విభాగాల వింగ్ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. దీపావళి పండగను నగర ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. బాణాసంచా కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ అనుమతులు పొందిన వారు మాత్రమే బాణాసంచా విక్రయాలు జరపాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల మధ్య అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనుమతి పొందిన ప్రాంతాలలో మాత్రమే టపాసుల షాపులు విక్రయించాలన్నారు. షాపుల వద్ద ఎమర్జెన్సీచ ఎగ్జిట్ గేట్లు తప్పకుండా ఉండాలన్నారు. నగర ప్రజల భద్రత, పరిశుభ్రతపై నగర పాలక సంస్థ చొరవ చూపుతుందని, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డీఎఫ్‌వో శంకరలింగం, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై విచక్షణారహితంగా దాడి

బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



యువకుల దాడిలో గాయపడ్డ ఇబ్రహీం

వరంగల్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తన వైపు సీరియస్‌గా ఎందుకు చూస్తున్నావ్..' అన్న కారణంగా ఓ యువకుడు తన కుమారుడిపై విచక్షణారహితంగా దాడిచేసి గాయపరచాడని హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 15న సాయంత్రం మహ్మద్ అమన్.. సత్యం అనే స్నేహితుడితో కలిసి యాదవనగర్ పెట్రోల్ పంపు వద్ద ఉండగా సత్యం స్నేహితులైన బన్నీ, త్రిశూల్ అనే వ్యక్తులు అక్కడి వచ్చారు. ఈ క్రమంలో త్రిశూల్ అనే యువకుడు అమన్ అనే యువకుడిపై పదే పదే చూస్తుండటంతో ఎందుకు తన వైపు చూస్తున్నావని ప్రశ్నించడంతో అమన్ నెత్తిపై త్రిశూల్ చేతితో కొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరిని అక్కడే ఉన్న సత్యం, బన్నీ విడిపించారు.

వెంటనే అమన్ అక్కడికి తన సోదరుడు ఇబ్రహీంను పిలిపించుకొని రెడ్డికాలనీ రోడ్డు నెంబర్-2లో ఉన్న త్రిశూల్ దగ్గరికి నిలదీయగా ఇబ్రహీం, త్రిశూల్ మధ్య మాటామాటా పెరగడంతో ఇబ్రహీంపై త్రిశూల్‌తో పాటు మరో కొంత మంది కలిసి దాడిచేయగా ఇబ్రహీం తీవ్రంగా గాయ పడినాడు. జరిగిన విషయాన్ని అమన్ తండ్రి సుభానికి తెలపగా ఇబ్రహీంను ఆస్పత్రి తరలించి హనుమకొండ పోలీసులకు ఆదే రోజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ రహితంగా దీపావళి వేడుకలు



ప్రమిదలతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

రాంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణ కోసం హనుమాన్ నగర్‌లోని ఏకశిల హైస్కూల్‌లో పర్యావరణ రహిత దీపావళి వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రమిదలు వెలిగించి, పూలతో రంగవల్లులను వేశారు. పర్యావరణాన్ని హాని చేయని బాణా సంచాలను మాత్రమే వినియోగించి ఆనందంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని ఉపాధ్యాయ బృందం సూచించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

● డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ● ఘనంగా టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషిచేస్తానని హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని డీఎస్ఏ టెన్నిస్ కోర్టులో ఒక్క రోజు పాటు ఏర్పాటు చేసిన వెటరన్ ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెన్నిస్ కోర్టులో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుతోపాటు హనుమకొండలో విస్తరిస్తున్న టెన్నిస్ క్రీడకు కావలసిన మౌలిక వసతుల సమకూర్చడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లా సురేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామిలు మాట్లాడుతూ.. జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు హనుమకొండలో ప్రతీ నెల టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు.

అనంతరం టెన్నిస్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఏసీపీ నాగయ్య, ఆర్ఐ శ్రీధర్ జోడితో పాటు ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీనివాస్, తిప్పాని స్వాత్వక్ జోడికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్యాట్రన్ కె.రవిచంద్ర, అసోసియేషన్ కోశాధికారి ఎస్.సుదర్శన్, బాధ్యులు వెంకట్‌నారాయణ, మాల్లారెడ్డి, వినీల్, శివరాజ్, డీఎస్ఏ టెన్నిస్ కోచ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పందెం కోళ్ల అపహరణ

ఖానాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దమ్మగడ్డలో పందెం కోళ్లను అపహరించుకుపోయిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమ్మగడ్డ గ్రామానికి చెందిన కుంచం వెంకన్న ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో నుంచి భయటకు రాకుండా బయట తలుపులు బిగించారు. ఇంటి ఆవరణలో ఉన్న రూ.20 వేల విలువ చేసే 6 పందెం కోళ్లను దొంగిలించారు. తెల్లవారిన తర్వాత తలుపులు రాకపోవడంతో చుట్టుపక్కల వారి సహకారంతో బయటకు వచ్చి చూడగా కోళ్లు దొంగతనానికి గురయ్యాయి. గత నాలుగు రోజుల కిందట ఇదే గ్రామానికి చెందిన వల్లెపు ఎల్లయ్య ఇంట్లోనూ పందెం కోళ్లు అపహరణకు గురయ్యాయి. దొంగతనంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఈవెంట్లలో విజేతలు..

- **పురుషుల 5వేల మీటర్ల పరుగుపందెంలో :** రషీద్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), నిషాంత్ కరహన ద్వితీయ(హరియాణా), సందిప్పల్ తృతీయ(ఉత్తర ప్రదేశ్).
- **మహిళల 5వేల మీటర్ల పరుగుపందెం:** సుప్రీత్‌కచప్ ప్రథమ(జార్ఖండ్), మితాలి రాక్ ద్వితీయ(మహారాష్ట్ర), లతిక్ తల్వార్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల హ్యామర్‌త్రో :** స్నేహ ప్రథమ(హరియాణా), ప్రతిభ ద్వితీయ(మధ్యప్రదేశ్), మిటల్ సోలాంకి తృతీయ (గుజరాత్).
- **పురుషుల జావెలిన్‌త్రో :** ఆనంద్‌సింగ్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), ఆదిత్య ద్వితీయ(హరియాణా), పర్ధిక్‌కుమార్ తృతీయ(హరియాణా)
- **మహిళల ట్రిపుల్ జంప్ :** పూర్వ రెష్వంత్ ప్రథమ(మహారాష్ట్ర), పీతి ద్వితీయ(రాజస్థాన్), మేరీ ముక్తసొరెంజ్ తృతీయ(ఒడిశా).
- **మహిళా 400 మీటర్ల హార్డిల్స్ :** హర్శిత ఆర్.ప్రథమ(తమిళనాడు), మౌమిజాన ద్వితీయ(ఎన్‌సీవోఈ పాటియాల), లౌలీ రాజ్‌పుత్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల 400 మీటర్ల హార్డిల్స్ :** అర్జున్ ప్రదీప్ ప్రథమ(కేరళ), నటరాజ్ ద్వితీయ(తమిళనాడు), హర్దిప్‌కుమార్ తృతీయ(పంజాబ్).
- **మహిళల జావెలిన్‌త్రో :** కుషియాదవ్, ప్రథమ(రాజస్థాన్), సాలోని ద్వితీయ(హరియాణా), ప్రతిక్ష పటేల్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల ట్రిపుల్ జంప్ :** విషాల్ బహదుర్ ప్రథమ(జార్ఖండ్), ప్రదీప్ ఎకుమార్ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), నర్పిందర్‌సింగ్ తృతీయ(పంజాబ్).
- **మహిళల 200 మీటర్ల పరుగుపందెం :** సుదిష్ఠ ప్రథమ(మహారాష్ట్ర), ఆయూషీ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), సమృతి జంవాల్ తృతీయ(హిమాచల్‌ప్రదేశ్).
- **పురుషుల 200 మీటర్ల పరుగుపందెం :** డొండపతి ప్రథమ(ఒడిశా), రాజబాబు ద్వితీయ(హరియాణా), ప్రతిక్ డి.తృతీయ(కర్ణాటక).
- **పురుషుల 800 మీటర్ల పరుగుపందెం :** సోమనాథ్ చాహన్ ప్రథమ (హరియాణా), ప్రత్మేష్ ద్వితీయ(మహారాష్ట్ర), షకీల్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల 800 మీటర్ల పరుగుపందెం :** లక్ష్మితాద్ ప్రథమ(గుజరాత్),ప్రీతియాదవ్‌ద్వితీయ(మధ్యప్రదేశ్),ప్రతిక్షాయాదవ్‌తృతీయ(జేఎస్‌డబ్ల్యూ).
- **మహిళా హెప్టాథ్లాన్ :** కుషి ప్రథమ(బీఎస్ఎఫ్), నిక్షి కుమారి ద్వితీయ(బిహార్), ఇషా చందర్‌పార్క్ తృతీయ (ఉత్తరాఖండ్).
- **పురుషుల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** రాహుల్ ప్రథమ(హరియాణా), నవ్‌రతన్ ద్వితీయ(హరియాణా), రణ్‌వీర్ ఏటీఆర్ సింగ్ తృతీయ (గుజరాత్).
- **మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** ప్రచిదేవ్‌కర్ ప్రథమ(మహారాష్ట్ర), సుష్మిత టిగ్గ ద్వితీయ(ఒడిశా), మంజుచౌదరి తృతీయ(రాజస్థాన్).

ముగిసిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో అరుణ్‌దీప్ మీట్ రికార్డు
- మహిళా హ్యామర్‌త్రోలో స్నేహకు స్వర్ణం
- పోటీల నిర్వహణ సక్సెస్


మహిళల ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించిన 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన ఒలంపియన్లు, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు, అనేక అంశాల్లో పోటీ పడుతూ పతకాలే లక్ష్యంగా చెమటోడ్చారు. హోరాహోరీగా తలపడి పాత రికార్డులను బద్దలు కొట్టారు. కొత్త రికార్డులను నమోదు చేశారు. చివరి రోజు మరో కొత్త రికార్డు నమోదైంది. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో కేరళకు చెందిన అరుణ్ దీప్ ఫైనల్‌లో 50.29 సెకండ్లతో కొత్త రికార్డు సృష్టించారు. అంతకుముందు బిలాస్‌పూర్‌కు చెందిన పి.యషస్(కర్ణాటక) పేరు మీదున్న 50.89 సెకండ్ల పాత రికార్డును అరుణ్‌దీప్ ఛేదించి ఈ కొత్త రికార్డు నెలకొల్పాడు. దీనితో ఈ జాతీయస్థాయి పోటీల్లో మొత్తం ఆరు కొత్తరికార్డులు నమోదైనట్లయింది.


పురుషుల 800 మీటర్ల పరుగు పందెంలో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు


మహిళా హ్యామర్‌త్రోలో స్వర్ణ పతకం సాధించిన హరియాణా అథ్లెట్ స్నేహ

నిరాశ మిగిల్చిన తెలుగు అథ్లెట్లు

మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి 21, ఆంధ్రప్రదేశ్ నుంచి 6గురు మొత్తం 27 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించినా.. ఒక్క మెడల్స్ సాధించకపోవడంతో క్రీడాభిమానులు, క్రీడాపోషకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) సహకారంతో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం 938 అథ్లెట్లు ఎంపిక కాగా, ఇందులో 55 మంది హాజరు కాకపోవడంతో 883 మంది అథ్లెట్లు 21 ఈవెంట్లలో తలపడి తమ ప్రతిభను చాటుకున్నారు.

విజయవంతంగా నిర్వహించాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ 100, 200, 400, 800, 1500, 5వేలు, 10వేల మీటర్ల పరుగు పందెంతో పాటు 20 కిలోమీటర్ల రేస్‌వాక్, 110, 400 మీటర్ల హార్డిల్స్ 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, డెకాథ్లాన్, హెప్టథ్లాన్, క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు క్రీడలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈ పోటీల్లో 883 మంది అథ్లెట్లు, 135 మంది టెక్నికల్ అఫిషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. చివరి రోజున పోటీల నిర్వహణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీ జోన్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, సీఐలు సార్ల రాజు, పుల్యాల కిషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, పింగిలి రమేష్‌రెడ్డి, రంగాపురం రమణ, ఊర యుగేందర్‌రెడ్డి, రామప్ప పోలీస్ అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్ఏ కోచ్ శ్రీమాన్, టెక్నికల్ అఫిషియల్స్ గంగిశెట్టి మనోజ్, వాసుదేవ్, సురేష్, రజనీకాంత్, దిమ్మిక నాగరాజు, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ బాధ్యులు, టీం మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లు బాగున్నాయి

- ఇండియా టీమ్ చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్



హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మన క్రీడాకారులు ప్రతిభావంతులని, ఇటీవల కాలంలో వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో వారు రాణిస్తున్న తీరే నిదర్శనమని అథ్లెటిక్స్ ఇండియన్ టీం చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్ అన్నారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరుగుతున్న 5వ జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పోటీలను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అఫిషియల్స్‌కు, కోచ్‌లకు, ఇతర పర్యవేక్షకులకు బస, భోజన వసతి, ఇతరత్రా సౌకర్యాల కల్పనను ఆయన మెచ్చుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న అథ్లెటిక్స్‌కు వసతి, బస సౌకర్యాలు కల్పించకపోవడానికి నిధుల కొరతే కారణమన్నారు. జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలు వరంగల్‌లో జరగడం తెలంగాణకే గర్వకారణమన్నారు. ఈ పోటీల ప్రత్యక్ష ప్రసారంతో ప్రధానంగా వరంగల్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరు వస్తుందన్నారు. గతంలో 2022లో సింథటిక్ ట్రాక్ లేనప్పుడే ఇక్కడ నేషనల్స్ విజయవంతంగా జరిగాయని, ఇప్పుడు సింథటిక్ ట్రాక్ ఏర్పాటైన తర్వాత మొదటి సారి ఈ పోటీలు మరింత సమర్థవంతంగా సాగుతున్నాయని చెప్పారు.


జేఎస్ఎస్‌లో స్టీపుల్ చేజ్‌లో మహిళా అథ్లెట్లు


ట్రిపుల్ జంప్ చేస్తున్న మహిళా అథ్లెట్



హర్డిల్స్ పోటీల్లో పాల్గొన్న అథ్లెట్లు


స్టీపుల్ చేజ్‌లో పాల్గొన్న అథ్లెట్లు


జావెలిన్‌త్రోలో..

కాంగ్రెస్, బీజేపీ బీసీ ద్రోహుల పార్టీలు

- పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలి..
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాటమే..
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


హనుమకొండ బస్టాండ్‌లో బీఆర్ఎస్ నేతలతో ధర్నా చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నాయని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మధుసూదనాచారి పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారానే బీసీలు తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి బీసీ సమాజాన్ని మోసం చేసిందని విమర్శించారు. బీసీల రాజ్యాధికారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌బాబు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పోలెపల్లి రాంమూర్తి, దాడి మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్జించిన బీసీలు

- బీసీ బంద్ విజయవంతం
- వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ర్యాలీలు
- జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు
- బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాలు

హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి శనివారం నిర్వహించిన తెలంగాణ బీసీ బంద్ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు, జాతీయ, ప్రాంతీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, యువకులు, కార్మిక, కర్షక వర్గాలు, ఉద్యోగులు, న్యాయవాదులు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌ను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. పాఠశాలలు బంద్ పాటించాయి. పెట్రోల్ బంక్‌లు పని చేయలేదు. ఆటో డ్రైవర్లు సైతం బంద్‌లో పాలు పంచుకున్నారు. బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది.

బీసీ జేఏసీ బంద్ పిలుపులో భాగంగా బీసీ జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నేతలు, బీసీ విద్యార్థి సంఘం, బీసీ యువజన సంఘం నాయకులు, కాంగ్రెస్ బీఆర్ఎస్, కమ్యూనిస్టు, ప్రజా సంఘాల నేతలు ఉదయం 4గంటలకే రోడ్లపైకి వచ్చారు. బస్ డిపోల వద్ద ధర్నా నిర్వహించారు. డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డగించారు. హనుమకొండ బస్‌స్టేషన్ ప్రధాన గేట్ వద్ద బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లోని విద్యా సంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలను, సినిమా థియేటర్లను, పెట్రోల్ బంక్‌లను స్వచ్ఛందంగా బంద్ చేయించారు. వరంగల్ బస్టాండ్ వద్ద కూడా బస్సులు రాకుండా అడ్డుపడ్డారు.


బంద్ సందర్భంగా వరంగల్-1, 2 డిపోల్లో నిలిచిపోయిన బస్సులు

హనుమకొండ జిల్లాలో..

బంద్‌లో భాగంగా కేయూ జంక్షన్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నయీంనగర్, నక్కలగుట్ట, హనుమకొండ చౌరస్తా మీదుగా భారీ బైక్ ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తానే స్వయంగా బైక్ నడుపుతూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మెన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి సైతం బంద్‌లో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చేంద వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనన్నారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కావలసిందేన్నారు. బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకవాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్పించి బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు.

ములుగు రోడ్డు జంక్షన్‌కు చేరిన అనంతరం అక్కడి కూడలిలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు బైరి రవిక్రిష్ణగౌడ్, ఈవీ శ్రీనివాస్ రావు, దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్,


హనుమకొండలోని అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజు యాదవ్

తుమ్మల శోభారాణి, చిర్ర రాజు, తాళ్లపల్లి సురేష్, వైద్యం రాజు గోపాల్, బీమగాని యాదగిరి, తడక సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్ నేతృత్వంలో మరో ర్యాలీ హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుంచి సుబేదారిలోని అమరవీరుల స్థూపం వరకు సాగింది. పలు బీసీ సంఘాల నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద ర్యాలీని ఉద్దేశించి సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లను వారి జనాభా ప్రకారం అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన సాగిస్తామన్నారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బీసీ జేఏసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. నడికుడ మండలంలో జరిగిన బంద్‌లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. పరకాలలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎల్కతుర్తి, ధర్మసాగర్, భీమదేవరపల్లి, దామెర, శాయంపేట, కమలాపూర్ మండలాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. బస్సులు నడవకపోవడంతో వరంగల్ బస్టాండ్ నిర్మానుష్యంగా కనిపించింది. హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో సీపీఐ నాయకులు దుకాణాలను దగ్గరుండి మూయించారు. వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు దుకాణాలను మూసివేయించారు. దుకాణాల మూతతో నిత్యం రద్దీగా ఉండే వరంగల్ మండి బజార్ ప్రాంతం బోసిపోయి కనిపించింది. పోచమ్మమైదాన్ సెంటర్‌లో మన్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పర్వతగిరి మండలకేంద్రంలో బీసీ అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా, బైక్ ర్యాలీ జరిపారు. పోచమ్మమైదాన్ నుంచి కాంగ్రెస్, వరంగల్ స్టేషన్ నుంచి బీజేపీ, హెడ్‌పోస్టాఫీసు నుంచి ఎంసీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు సాగాయి. నర్సంపేట పట్టణంలో కూడా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

కేయూలో మార్కుల కలకలం

- అభ్యంతరాలను వ్యక్తం చేసిన విద్యార్థి నాయకులు
- సోషియాలజీ విభాగంలో మార్కుల షీట్ల పరిశీలన
- ప్రొఫెసర్లతో వాగ్వాదం.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


మార్కుల షీట్లను చూస్తున్న విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో విద్యార్థుల సెమినార్ మార్కుల అంశం రగడ రేపుతోంది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చెత్త శుభ్రం చేస్తే ఎగ్జామ్‌లో పాస్' కథనంపై విద్యార్థి సంఘాల నేతలు స్పందించారు. కేయూ క్యాంపస్‌లోని సోషియాలజీ విభాగంలో నాలుగో సెమిస్టర్‌లో భాగమైన విద్యార్థుల సెమినార్‌కు కేటాయించిన మార్కుల షీట్లను శనివారం సాయంత్రం పరిశీలించారు. సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.స్వర్ణలత, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ కుంట అయిలయ్యలతో విద్యార్థుల సెమినార్ మార్కుల షీట్లలో తేడాలు ఎందుకు ఉన్నాయంటూ ప్రశ్నించారు. కాన్ఫిడెన్షియల్‌గా ఉండే మార్కుల షీట్లను ఫొటోలు తీసుకోవద్దంటూ అధ్యాపకులు అభ్యంతరాలు చెప్పబోగా విద్యార్థులు ఎందుకు అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. అయితే విభాగాధిపతి సంతకంతో చేసిన మార్కుల షీట్‌తో పాటు అదనంగా మరో మార్కుల షీట్ ఎందుకు ఉందని విద్యార్థులు ప్రశ్నించారు. రెండుమార్కుల షీట్ల పత్రాల్లో విద్యార్థులకు సెమినార్‌కు కేటాయించిన మార్కుల్లో స్వల్పంగా వ్యత్యాసాలున్నాయని విద్యార్థులు ఆరోపించారు.

ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ శనివారం ఉదయం సోషియాలజీ విభాగాన్ని సందర్శించారు. కథనంలో వచ్చిన అంశాల ఆధారంగా విద్యార్థులకు కేటాయించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సెమినార్ మార్కుల్లో తేడాలున్నాయా? అంటూ విభాగాధిపతితో పాటు ఇతర అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అయితే శనివారం బీసీ జేఏసీ బంద్ నేపథ్యంలో వర్సిటీలో బంద్‌ను పురస్కరించుకుని పూర్తి వివరాలను అందకుండానే వెనుతిరిగినట్లు సమాచారం. దీపావళి సెలవు తర్వాత మళ్లీ వచ్చి వివరాలన్నీ సేకరిస్తానని అన్నట్లు సమాచారం. కాగా ఆరు నెలల కిందట సోషియాలజీ విభాగం రెండో ఏడాది నాలుగో సెమిస్టర్ సెమినార్ మార్కుల కేటాయింపు జరుగగా ఇప్పుడు తాజా వివాదం జరుగుతుంటంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అయితే విద్యార్థులెవ్వరూ నాలుగో సెమిస్టర్ సెమినార్‌కు సంబంధించిన అంశంలో ఫెయిల్ కాలేదని, అందరికీ మార్కులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వివరణ ఇవ్వాలని కేయూ ఉన్నతాధికారులు విభాగాధిపతిని ఆదేశించినట్లు తెలుస్తోంది.

దివ్వెల సందడి షురూ..

19న భోగి, 20న దీపావళి, 21న కేదారేశ్వర వ్రతాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటిల్లిపాదినీ అలరించే దివ్వెల పండుగ రానే వచ్చింది. ఈ నెల 19 నుంచి భోగి పండుగతో ప్రారంభమయ్యే వేడుకలు 21న నోములతో ముగుస్తాయి. 20న దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. దివ్వెల పండుగ వచ్చిందంటే ఇళ్లల్లో సందడి కనిపిస్తుంది. భోగి స్నానాలతో ప్రారంభమై కేదారీశ్వర వ్రతాలు నోములు ఎత్తుకునే వరకు వేడుకలు జోరుగా సాగుతాయి. దీపావళి పండుగను పురస్కరించుకొని పూల దుకాణాలు, నోము సామానులు, టపాకాయల దుకాణాల్లో అమ్మకాలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం నుంచే సందడి మొదలైంది. లక్ష్మి రోజు కావడంతో నోము సామానులు దీప ప్రమిదల కొనుగోళ్లు ప్రారంభించారు.


నోము సామాను విక్రయిస్తున్న దృశ్యం

మహిళపై చేయిచేసుకున్న బీసీ నేతలు

- బాధిత మహిళ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో ఉద్రిక్తత
- బీసీ నేతలను బాధిత కుటుంబీకులతో కలిసి నిలదీస్తున్న బీజేపీ శ్రేణులు


చేయి చేసుకున్న బీసీ నేతలను నిలదీస్తున్న బాధిత మహిళ మంగమ్మ

మరిపెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళపై బీసీ నేతలు చేయిచేసుకున్న సంఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ భూక్యా మంగమ్మ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సకాలంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై కోటేశ్వర్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఘర్షణ వాతావరణాన్ని శాంతపరిచారు. ఆ మహిళ బీజేపీ శ్రేణులతో కలిసి మరిపెడ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ దగ్గర రాస్తారోకో చేస్తున్న బీసీ నేతలను పోలీసుల ఎదుటే నిలదీశారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులను, బీజేపీ శ్రేణులను అక్కడి నుంచి బయటకు పంపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ బస్టాండ్ కాంప్లెక్స్‌లో కంగన్‌హాల్ తెరిచి ఉంచగా, 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ నేతలు బంద్ నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సెంటర్లో కంగన్‌హాల్ తెరిచి ఉండగా అక్కడికి వెళ్లి షాపు బంద్ చేయాలని వారు హల్‌చల్ చేశారు. దీంతో ఆ షాపు నిర్వాహకులు బంద్ చేయడానికి సామానులు సర్దుతుండగా మంగమ్మ భర్త లింగంనాయక్ చెంపపై బీసీ నేతలు కొట్టడంతో మంగమ్మ షాపు బంద్‌చేస్తూనే ఉన్నాం కాదా? ఎందుకు కొడుతున్నారని వాగ్వివాదానికి దిగింది. దీంతో బీసీ నేతలు ఆమెపై చేయిచేసుకొన్నారు. ఆమె చేతికి, వీపుపై దెబ్బలు తగిలాయి. ఈ ఘటనపై మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

పార్కుల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

జూలైవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ అన్నారు. డివిజన్‌లోని న్యూ మిలీనియం బ్యాంక్ కాలనీలోని పార్కు అభివృద్ధికి, పార్క్ మెయింటనెన్స్ కోసం వాకర్స్ తరుపున గ్రాస్ కటింగ్ మిషన్‌ను కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ సమక్షంలో సీహెచ్‌వో రమేశ్‌కు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ దానర వెంకటేశ్వర్లు, థామస్ రెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌గా కుమార్

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ నూతన కార్యవర్గం ఎంపికైంది. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో నుంచి అత్యధికంగా కార్యవర్గంలో ఎంపికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. హనుమకొండ కేశవ వుమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మట్టెడ కుమార్ జాయింట్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. వీరితో పాటు వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీతో పాటు తదితర పదవులకు వర్సిటీ క్యాంపస్ నుంచి ఎంపికయ్యారు.

ఎంపీడీవోను కలిసిన కారోబార్లు

హసన్‌పర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సుమన వాణిని శనివారం కారోబార్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవోను కలిసిన వారిలో తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గుండ్లపెల్లి వెంకన్న గౌడ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు మేడ యాదగిరి, కారోబార్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బండి రమేష్, మండల కార్యదర్శి కుక్కముడి నరేష్, సీఈవో ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్‌కు యూరియా సరఫరా చేయాలి

హసన్‌పర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీఎస్ మార్క్‌ఫెడ్ నుంచి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేయాలని కోరుతూ అగ్రోస్ నిర్వాహకులు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు బండి సందీప్ రెడ్డి మాట్లాడుతూ.. బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ డిప్లొమా చదివిన నిరుద్యోగులు 2020లో ఆగ్రోస్ సెంటర్ల నోటిఫికేషన్ ద్వారా రూ.1.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ప్రభుత్వానికి డిపాజిట్ చేసి లైసెన్సులు పొంది సెంటర్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గత ఖరీఫ్ నుంచి యూరియా సరఫరా చేయకుండా పీఏసీఎస్ సెంటర్లకు మాత్రమే యూరియా సరఫరా చేస్తున్నారని తెలిపారు. పీఏసీఎస్ లేని చోట్ల ఆగ్రోస్‌కు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఆమోదిత సంస్థలైన ఆగ్రోస్ రైతు సేవా సెంటర్లకు కూడా టీఎస్ మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా చేసి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. కలెక్టర్ తక్షణమే స్పందించి నిరుద్యోగ యువత సమస్యను పరిష్కరించాలని టీఎస్ మార్క్‌ఫెడ్ నుంచి యూరియా సరఫరా చేయాలని కోరారు.

గుండెపోటుతో కేయూ ఉద్యోగి మృతి



అక్రమ్ (ఫైల్)

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి అక్రమ్ (56) శనివారం ఉదయం 5 గంటల సమయంలో గుండెపోటుతో మృతిచెందారు. కేయూ నివాసగృహాల్లో ఉండే అక్రమ్ ఉదయం నిద్ర సమయంలో గుండెపోటుకు గురై కుప్పకూలి మృతిచెందినట్లు వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. అక్రమ్ వర్సిటీలో టెక్నీషియన్-2 గ్రేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరూ కుమార్తెలు, భార్య ఉన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండలోని బొక్కలగడ్డలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడు అక్రమ్ భౌతికకాయానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఇతర వర్సిటీ ఉన్నతాధికారులు, వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, నవీన్‌కుమార్, వల్లాల తిరుపతి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించి ఓదార్చారు.

కేయూ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



రాంచందర్



రవికుమార్

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రామచందర్, దేశిని రవి కుమార్‌లు ఎన్నికయ్యారు. కేయూలో ఇటీవల జరిగిన రెండో మహాసభల్లో వీరి ఎంపిక జిల్లా కమిటీ నేతృత్వంలో చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు రాంచందర్, రవికుమార్‌లు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని అన్నారు.

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అన్నారు. అవుట్ సోర్సింగ్‌ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలనుకల్పించాలని అన్నారు. సర్వీస్‌లో ఉండి మృతి చెందిన, పదవీ విరమణ పొందిన వారికి రూ.5లక్షలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా నూతన అధ్యక్షకార్యదర్శులను పలువురు అభినందిచారు.

మద్యం షాపులకు తగ్గిన డిమాండ్

- చివరి రోజు అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ
- 124 వైన్‌షాపులకు 23న లక్కీడ్రా

వరంగల్ క్రైం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మందకొడిగా సాగిన మద్యం షాపు దరఖాస్తుల ప్రక్రియ చివరి రెండు రోజులు ఊపందుకుంది. గత నెల 25న మద్యం షాపుల నోటిఫికేషన్ రాగా, 26 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారంరోజుల వరకు దరఖాస్తులే రాలేదు. రూ.2లక్షలు ఉన్న టెండర్ ఫీజును రూ.3లక్షలు చేయడంతో ఎవరూ ముందుకు రాలేదనే చర్చ జరిగింది. కానీ, ఎక్సైజ్ అధికారులు మాత్రం చివరి రెండురోజులే కీలకమని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ మేరకు కుర్చీలు, నీళ్లు, టెంట్లు ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి వరకు వ్యాపారులు దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. రిజర్వేషన్, పోలీస్‌స్టేషన్‌లు, షాపులవారీగా పూర్తి స్థాయి సమాచారం రావడానికి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

కాగా, 2023-25 కాల వ్యవధికి గతంలో వరంగల్ అర్బన్ (హనుమకొండ)లో 5,859 దరఖాస్తులుగా రాగా, ఈ సారి 67 షాపులకు సుమారు 2500 నుంచి 3000 దరఖాస్తులు తగ్గే ఆవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాత్రి 10గంటల లోపు వరకు ఓవరాల్‌గా మొదటిరోజు నుంచి చివరి రోజు వరకు సుమారుగా 2,500 దరఖాస్తులు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేశారు. అదే విధంగా వరంగల్ రూరల్ (వరంగల్)జిల్లాలో 2023-25 టెండర్లల్లో 2,900 దరఖాస్తులు రాగా, ఈసారి 57 వైన్ షాపులకు సుమారు 1,700 దరఖాస్తులు వచ్చినట్లుగా సూపరిటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. కాగా, ఈ నెల 23న వరంగల్ అర్బన్, రూరల్‌లోని 124 షాపులకు లక్కీ డ్రా తీయనున్నారు. 124 షాపులను దక్కించుకోవడానికి సుమారు 4,500 మంది పోటీపడనున్నారు.

కదం తొక్కిన బీసీలు



అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న న్యాయవాదులు

వడ్డెపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు వివిధ బీసీ సంఘాలు శనివారం హనుమకొండలో ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి కదంతొక్కి పదం పాడారు. తెలంగాణ బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అగ్రవర్ణాల మనసు మార్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. బీసీ బంద్‌కు మద్దతుగా హనుమకొండ చర్చి జంక్షన్‌లో వడ్డెపల్లి దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్(జేకే), జైభీం జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్, బీజేపీ దళిత మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రమేష్, దళిత సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీసీ బంద్‌కు మద్దతుగా బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర నాయకులు మాలోత్ నానునాయక్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకుర్యాలీ నిర్వహించారు. అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆల్ ఇండియా దళితయాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రత్నం శైలేందర్, జాతీయ మాల మహానాడు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పనిగల శ్రీనివాస్, యూత్ జిల్లా అధ్యక్షుడు గరిగె అనిల్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

- హసన్‌పర్తి: మండలంలోని పంచాయతీ గ్రామాలతో పాటు గ్రేటర్ విలీన గ్రామాలలో శనివారం బీసీ జేఏసీ ఇచ్చిన బంద్ సంపూర్ణమైంది. బీసీ జేఏసీకి మద్దతుగా అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంపూర్ణ మద్దతు పలికాయి. విద్యా, వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బందులో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్‌తోపాటు వివిధ రాజకీయపార్టీల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు బందులో పాల్గొని ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు.

బంద్ విజయవంతం

- హనుమకొండ చౌరస్తా: బీసీ రిజర్వేషన్ల కోసం శనివారం చేపట్టిన బంద్ హనుమకొండ చౌరస్తాలో ప్రశాంతంగా జరిగింది. బంద్‌ను విజయవంతం చేసిన వ్యాపారులకు, షాపింగ్ మాల్ వర్కర్లకు, యాజమాన్య వర్గాలకు ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, టీడీపీ నాయకులు చీకటి రాజు, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎస్‌వీఎల్‌సీఈ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థి బీసీ సంఘాల నేతలు

- మడికొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జాక్ ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపు మేరకు మడికొండలో కాంగ్రెస్ పార్టీ 46, 64 డివిజన్ల అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు యాదవ్, కాంగ్రెస్ శ్రేణులు నార్లగిరి కుమారస్వామి, సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పైడిపాల రఘుచందర్, వస్కుల శంకర్, బి.రవీందర్, లింగమూర్తి పాల్గొన్నారు.
- వరంగల్ లీగల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు డిమాండ్ చేశారు. శనివారం బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ ఇచ్చిన తెలంగాణ బంద్ పిలుపునకు న్యాయవాదులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉభయ జిల్లా న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణలు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచిన బిల్లును పార్లమెంట్‌లోప్రవేశపెట్టి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కోర్టు నుంచి కాళోజీ సెంటర్ మీదుగా అమర వీరుల స్తూపం వద్దకు పెద్ద ఎత్తున న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి బీసీ బంద్‌కు తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ ఉపాధ్యక్షుడు ఫైదం జైపాల్, కార్యవర్గ సభ్యులు మర్రి రాజు, హనుమకొండ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, కోశాధికారి సాంబశివరావు, సీనియర్ న్యాయవాదులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కాజీపేటలో బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- కేయూ క్యాంపస్: బీసీ బంద్‌కు మద్దతుగా కేయూ పూలే విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి, వరంగల్ బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించి మద్ద తు ప్రకటించారు. బీసీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని అన్నారు. కేంద్రం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని అన్నారు.

అలాగే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన బంద్ కేయూలో శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. బీఎస్పీ, బీఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, పీడీఎస్‌యూ, ఇతర విద్యార్థి ప్రజాసంఘాల నేతలు బంద్‌లో పాల్గొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో తరగతులను బహిష్కరించారు. అలాగే హనుమకొండ బస్సు డిపో ఎదుట కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. బీసీరిజర్వేషన్లు అమలుచేయాలనిడిమాండ్ చేశారు.

- కాజీపేట: కాజీపేటలో ఉదయం బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు విడివి డిగా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. షాపులను, ప్రైవేట్ స్కూళ్లను బంద్ చేశారు. 62, 63వ డివిజన్ కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాద వ్, విజయశ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమార్, సుంచు అశోక్‌లు భారీ ర్యాలీ చేసి నిరసన చేపట్టారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలి, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని పెద్దఎత్తున నినాదాలు చేశారు. 47వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధించేవరకు కొట్లాడుతాం.. అని నినాదాలు చేశారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు భారీ బైక్ ర్యాలీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

▸▸ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ 58వ డివిజన్ పరిధిలోని శ్రీలక్ష్మి నగర్, శ్రీనగర్, రాఘవేంద్రనగర్ ఫేస్ -2, వడ్డెపల్లి ఎస్సీ కాలనీలలో రూ. కోటి 60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజలకు అందని పథకాలన్నీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అందుతున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, టీపీసీసీ సోషల్ మీడియా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.డి.ముస్తాక్ నెహాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి విజయ్, తాళ్లపెల్లి రవీందర్(జేకే), జీడబ్ల్యూఎంసీ డీఈ సారంగం, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి

సీసీ కెమెరాలు ప్రారంభం

58వ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ ఫేజ్-2లో మహిళా సంఘాల ఆర్థిక ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్, రాఘవేంద్ర నగర్ ఫేస్ -2 అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొత్త కనకయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం

- నిందితుల కోసం పోలీసుల గాలింపు

కాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీజిల్‌కాలనీ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో దుండగులు నగదు చోరీ చేసేందుకు యత్నించారు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట డీజిల్‌కాలనీ ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం రాత్రి దుండగులు మిషన్ ధ్వంసం చేసి నగదు చోరీ చేసేందుకు యత్నించారు. ఈ ఘటనలో మిషన్ స్వల్పంగా ధ్వంసమైంది. ఈ క్రమంలో అటువైపుగా నైట్‌పెట్రోలింగ్ చేస్తుండగా పోలీస్ సైరన్ విని నిందితులు పారిపోయారు. పోలీసులు ఏటీఎం మిషన్‌ను పరిశీలించారు. ఎలాంటి నగదు చోరీ జరగలేదని పోలీసులు నిర్ధారించారు. ఫింగర్‌ప్రింట్‌లు, సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిందితులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. నిందితుల ఆనవాళ్లు, ఆచూకీ తెలిసిన వారు 87126 85008 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుమతిరెడ్డిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టభద్రులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ

హసన్‌పర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి పట్టభద్రులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకొని సృజనాత్మకతతో ముందుకు సాగితేనే విజయాలు వరిస్తాయన్నారు. కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. పట్టభద్రులైన విద్యార్థులందరు సమర్థవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములై నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగి జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం డిపార్టుమెంట్ స్థాయిలో ఉన్నత ప్రతిభకనబర్చిన విద్యార్థినులను సన్మానించి పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, డాక్టర్ ఇ.కుమారస్వామి, డాక్టర్ కె.శ్రీనివాస్, బి.ప్రశాంత్, ఏవో వేణుగోపాలస్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు జి.ఝాన్సీరాణి, ఎస్.స్వేత, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించిన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల పరిరక్షణ విభాగం(మిషన్ వాత్సల్య)లో బాలల పరిరక్షణ అధికారిగా పనిచేస్తున్న సౌరం ప్రవీణ్‌కుమార్‌ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అభినందించి సన్మానించారు. శనివారం హనుమకొండలో నిర్వహించిన మనోన్యాయ లీగల్ ఎయిడ్ క్యాంప్‌లో సిరి స్వచ్ఛంద సంస్థ, అన్నమనేని మేఘాంష్ ఫౌండేషన్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ సంస్థల ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పాటు సామాజిక సాహిత్య సాంస్కృతిక రంగాలలో వృత్తిపరంగా 25ఏళ్ల పాటు అందించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రవీణ్‌కుమార్‌ను సిల్వర్ జూబ్లీ అవార్డుతో పాటు జ్ఞాపికతో సన్మానించారు.



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జడ్జి పట్టాభిరామారావు

వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ వర్సిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి అన్నారు. హైదరాబాద్ ఓయూలో సీఐటీయూ మూడో రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మెట్టు రవి హాజరై మాట్లాడారు. వర్సిటీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. టైంస్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఇంటర్నల్‌గా నింపాలని అన్నారు. వర్సిటీలకు నిధులు, నియమకాలు చేపట్టాలని అన్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగులకు బడ్జెట్‌ను ఇవ్వాలని అన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలనుకల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా మెట్టు రవి, (కేయూ, వరంగల్), రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేశ్, తెలంగాణ యూనివర్సిటీస్ ఉపాధ్యక్షులుగా కచ్చకాయల చిరంజీవిలను ఎన్నుకున్నారు. రాష్ట్ర మహాసభ గౌరవ ప్రతినిధిగా జేవీ, పద్మశ్రీలను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..

- పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యుల్లత



డిప్యూటీ కమిషనర్‌ను ఘనంగా సత్కరిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘాల నాయకులు

హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతులకు కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యుల్లత తెలిపారు. ఈ మేరకు సంఘ నాయకుల విన్నపం మేరకు ఆమె సానుకూలంగా స్పందించారు. హనుమకొండ జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విద్యుల్లత పదోన్నతిపై డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయిన సందర్భంగా శనివారం జడ్పీ సమావేశం హాల్‌లో ఘనంగా సత్కరించారు. పంచాయతీరాజ్ మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా శాఖ, హనుమకొండ జిల్లా పరిషత్ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీవో మేన శ్రీను, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో రవి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం రవి ప్రకాశ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, వరంగల్ జడ్పీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడవెల్లి యుగేందర్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి చెట్ల రవి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు, సునీల్, హనుమకొండ, వరంగల్ జడ్పీ సిబ్బంది, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యుల్లతను పుష్పగుచ్చాలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

జాగృతి జనం బాటను విజయవంతం చేయాలి



వడ్డెపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమయ్యే జాగృతి జనం బాటను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాగృతి జనం బాటలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత మేధావులతో మమేకమవుతారని తెలిపారు. జాగృతి జనం బాటలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తుందన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రత్యేక చట్టాలు, హక్కులు, జీవోలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. పెరిగిన బీసీ జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసీ జాగృతి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మానుపాటి రమేష్, జాగృతి ఆటో యూనియన్ అధ్యక్షుడు కురుసాంగి వేణు, రాష్ట్ర, జిల్లా నాయకులు బూనాద్రి రంజిత్, గుగులోతు దేవేందర్ నాయక్, లోకిని సమ్మయ్య, సంతోష్‌కుమార్, పాలకుర్తి నారాయణ, విజేందర్, రఘు, మానుపాటి సురేందర్, రాయపాటి గణేష్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ పేరు మార్పు

ఛత్రపతి శంభాజీనగర్ స్టేషన్‌గా మార్చిన మహారాష్ట్ర ప్రభుత్వం

ఛత్రపతి శంభాజీనగర్, అక్టోబరు 18: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ పేరును ఛత్రపతి శంభాజీనగర్ స్టేషన్‌గా మారుస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ స్మారకార్థం ఇదివరకటి ఏక్‌నాథ్‌షిండే ప్రభుత్వం ఔరంగాబాద్ పేరును ఛత్రపతి శంభాజీనగర్‌గా మార్చిన విషయం తెలిసిందే. దాదాపు మూడేళ్ల తర్వాత ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని మహాయుతీ ప్రభుత్వం రైల్వేస్టేషన్ పేరును మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకప్పుడు హైదరాబాద్ స్టేట్‌లో భాగంగా ఉన్న ఈ నగరంలో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1900లో రైల్వేస్టేషన్‌ను నిర్మించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని నాందేడ్ డివిజన్ పరిధిలో ఉన్న ఈ రైల్వేస్టేషన్ కాచీగూడ- మన్మాడ్ రైల్వే మార్గంలో ప్రధాన స్టేషన్‌గా కొనసాగుతూ దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతోంది.

ఆ భూముల సేల్‌డీడ్స్ రద్దు చెల్లదు

- నిషేధిత జాబితాలో లేకపోతే రద్దు కుదరదు
- ప్రభుత్వ భూములనుకుంటే టైటిల్ నిరూపించుకొని చట్టబద్ధంగా స్వాధీనం చేసుకోవచ్చు: హైకోర్టు
- రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడ భూముల సేల్‌డీడ్స్ రద్దుపై ధర్మాసనం తీర్పు



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో లేని భూముల సేల్ డీడ్స్‌ను సబ్‌రిజిస్ట్రార్ రద్దు చేయడం కుదరదని హైకోర్టు పేర్కొంది. సదరు భూములు తమవేనని ప్రభుత్వం భావిస్తే.. సివిల్ సూట్లు, అప్పీళ్ల ద్వారా టైటిల్ నిరూపించుకోవచ్చని, తర్వాత చట్టబద్ధంగా ఆ భూములను స్వాధీనం చేసుకోవచ్చని తెలిపింది. అంతే తప్ప.. సేల్‌డీడ్స్‌ను రద్దు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలోని భూములకు సంబంధించిన సేల్‌డీడ్స్‌ను కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా సబ్‌రిజిస్ట్రార్ రద్దు చేయడాన్ని తప్పుబడుతూ ఈ వ్యాఖ్యలు చేసింది. బహదూర్‌గూడ గ్రామంలో సర్వే నంబర్లు 38, 54, 55, 56లోని దాదాపు 38 ఎకరాల భూములకు సంబంధించిన 17 సేల్‌డీడ్స్‌ను రద్దు చేయాలంటూ 2017లో జిల్లా కలెక్టర్ లేఖ రాయగా.. సబ్‌రిజిస్ట్రార్ సదరు సేల్‌డీడ్స్‌ను రద్దు చేస్తూ క్యాన్సలేషన్ డీడ్స్ రిజిస్ట్రేషన్ చేశారు. అయితే తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఇలా ఏకపక్షంగా పాత సేల్‌డీడ్స్ రద్దు చేయడం చెల్లదంటూ ముస్తాంగ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ టీవీ రత్నారావు, పి.ధీరజ్ రంగారెడ్డి తదితరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. సేల్ డీడ్స్ రద్దు చేసేందుకు, క్యాన్సలేషన్ డీడ్స్ ప్రజెంట్ చేసేందుకు తహసీల్దార్‌కు అర్హత లేదన్నారు. తహసీల్దార్ కాంపిటెంట్ అథారిటీ కాదని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎలాంటి కోర్టు డిక్రీ లేదా ప్రభుత్వ ఆదేశాలు లేకుండా క్యాన్సలేషన్ డీడ్స్ రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్‌రిజిస్ట్రార్‌కు లేదని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలివ్వడం, తహసీల్దార్ క్యాన్సలేషన్ డీడ్స్ ప్రజెంట్ చేయడం, వాటిని సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయడం ఏకపక్షమని, ఎలాంటి అథారిటీ లేకుండా ఈ ప్రక్రియ చేపట్టారని పేర్కొన్నారు. ఎంపిక చేసుకుని మరీ తమ సేల్ డీడ్స్‌ను రద్దు చేశారని ఆరోపించారు. అవే సర్వే నంబర్లలో డ్రీమ్ ఇండియా అనే కంపెనీ పేరిట 148 ఎకరాలు ఉందని, కానీ, ఆ సేల్‌డీడ్స్‌ను మాత్రం రద్దు చేయడానికి అధికారులకు ధైర్యం రాలేదని తెలిపారు.

నిషేధిత జాబితాలో ఉంటేనే..

రెవెన్యూ శాఖ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులు, సప్లిమెంటరీ సేత్వార్, న్యూ విలేజ్ మ్యాప్ ప్రకారం బహదూర్‌గూడ గ్రామంలోని సర్వే 28 నుంచి 62 వరకు ఉన్న 650 ఎకరాల భూములు ప్రభుత్వ భూములని పేర్కొన్నారు. అందుకే సదరు 17 సేల్‌డీడ్స్‌ను రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. రిజిస్ట్రేషన్ యాక్ట్ -1908 సెక్షన్ 22ఏ (నిషేధిత జాబితా)లో ఉన్న భూముల సేల్‌డీడ్స్‌ను మాత్రమే రద్దు చేయాలని కోరే అధికారం రెవెన్యూ అధికారులకు ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత కేసులోని భూములు నిషేధిత జాబితాలో లేవన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు మరచిపోయారని వ్యాఖ్యానించింది. ఈ మేరకు పిటిషన్లను అనుమతించిన ధర్మాసనం.. పిటిషనర్ల సేల్‌డీడ్స్ రద్దు చేస్తూ రిజిస్టర్ చేసిన క్యాన్సలేషన్ డీడ్స్‌ను కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వానికి, పిటిషనర్లకు మధ్య ఉన్న టైటిల్ వివాదాలకు ఈ తీర్పు ఏ విధంగానూ అడ్డురాదని స్పష్టం చేసింది. ప్రభుత్వం లేదా కలెక్టర్, రెవెన్యూ అధికారులు సదరు భూములపై టైటిల్ నిరూపించుకోవడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవచ్చని, సివిల్ సూట్లు, అప్పీళ్లు కొనసాగించవచ్చని పేర్కొంటూ తుది తీర్పు వెలువరించింది.

భూగర్భ గరళం!

రాష్ట్రంలో పలుచోట్ల తాగేందుకు పనికిరాని భూగర్భజలాలు

- 73 చోట్ల పరిమితికి మించిన స్థాయిలో ఫ్లోరైడ్
- 2చోట్ల పరిమితికి మించి క్లోరైడ్, 137చోట్ల నైట్రేట్
- కేంద్ర భూగర్భ జలమండలి నివేదికలో వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తాగడానికి ఏ మాత్రం అనుకూలంగా లేవని కేంద్ర జలశక్తి శాఖకు చెందిన కేంద్ర భూగర్భ జల మండలి నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలోని భూగర్భ జలాల్లో అనుమతించిన పరిమితులకు మించి ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్‌తో పాటు ఇతర రసాయన మూలకాలున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. 2014 సంవత్సరానికి గాను వానాకాలానికి ముందు 412 చోట్ల, వానాకాలం తర్వాత 375 చోట్ల నమూనాలు సేకరించి, హైదరాబాద్‌లోని రీజనల్ కెమికల్ లాబోరేటరీలో పరీక్షించి ఈ మేరకు ఓ నివేదికను రూపొందించింది. చాలా జిల్లాల్లోని భూగర్భ జలాల్లో మనుషుల ఆరోగ్యానికి హానికరమైన మూలకాలున్నట్టు ఈ పరీక్షల్లో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా 73చోట్ల పరిమితికి మించి ఫ్లోరైడ్, 2చోట్ల పరిమితికి క్లోరైడ్, 137 చోట్ల నైట్రేట్ ఉన్నట్లు తేలింది. భూగర్భ జలాల్లో ప్రధానంగా కాల్షియం బైకార్బొనేట్ రసాయన పదార్థాన్ని అధిక మోతాదులో ఉన్నట్టు నిర్ధారణ అయింది. హన్మకొండ (భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఐనవోలు, వర్ధన్నపేట, ఎల్కతుర్తి), వరంగల్ (ఆత్మకూరు, చెన్నరావుపేట, నర్సంపేట, శాయంపేట), జగిత్యాల (గొల్లపల్లి, జూలపల్లి, కొడిమ్యాల, కోరుట్ల), జనగామ (ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల, నర్మెట్ట, రఘునాథపల్లె), నాగర్‌కర్నూలు (బిజినేపల్లి,కల్వకుర్తి, కోడేర్, లింగాల, ఊర్కోండ, వంగూరు) కరీంనగర్ (హుజూరాబాద్, తిమ్మాపూర్), మేడ్చల్ మల్కాజ్‌గిరి(ఘట్‌కేసర్, మేడ్చల్), నిర్మల్ (బాసర, కద్దెంపెద్దూరు, కుబీర్), ఖమ్మం (బోనకల్, పెనుబల్లి, వైరా, ఎర్రుపాలెం), రంగారెడ్డి (అబ్దుల్లాపూర్‌మెట్, ఆమన్‌గల్, బాలాపూర్, మంచాల, రాజేంద్రనగర్, శంషాబాద్, యాచారం), నల్లగొండ (చింతపల్లి, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, తిప్పర్తి), మహబూబ్‌నగర్ (దేవరకద్ర, మూసాపేట), సిద్దిపేట (జీపీ పొన్నాల, సిద్దిపేట, తొగుట), వికారాబాద్ (దౌలతాబాద్, పేద్దేముల్) జిల్లాల్లో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు అధికంగా ఉన్నాయని గుర్తించింది. మొత్తం 73 చోట్ల లీటర్‌లో 1.5 గ్రాములకు మించి... ఫ్లోరైడ్ ఉన్నట్లు తేలింది. ప్రధానంగా నాగర్‌కర్నూలు జిల్లా జూపల్లి గ్రామంలో పరిమితికి మించి నైట్రేట్ ఉన్నట్లు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల మినహా అన్ని జిల్లాల్లో నీళ్లలో నైట్రేట్ అవశేషాలు ఉన్నాయని గుర్తించారు. లీటర్‌కు 45 మిల్లీగ్రాముల కన్నా ప్రాంతాల్లో ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్, బజార్‌హత్నూర్, బేల, గుడిహత్నూర్, జైనథ్, నేరడిగొండ, తలమడుగు, ఉట్నూరు), నాగర్‌కర్నూలు (అచ్చంపేట, కల్వకుర్తి, చారకొండ, కోడేర్, లింగాల, నాగర్‌కర్నూలు, తాడూరు, ఉప్పునుంతల), నల్లగొండ (చింతపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, కేతేపల్లి, మర్రిగూడ, మిర్యాలగూడ, మునుగోడ్, నల్గొండ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, వేములపల్లి), నిర్మల్ (భైంసా, కద్దమ్‌పెద్దూర్, కుబీర్, ముథోల్, పెంబి, సోన్), నిజామాబాద్ (ఆర్మూర్, బాల్కొండ, ధర్పల్లి, మోర్తాడ్), ఖమ్మం (ముదిగొండ, తల్లాడ, తిరుమలాయపాలెం, వైరా, ఎర్రుపాలెం), రంగారెడ్డి (అబ్దుల్లాపూర్‌మెట్, అమన్‌గల్, చేవెళ్ల, ఫారూఖ్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కొత్తూరు, మాడ్గుల్, మహేశ్వరం, షాబాద్, యాచారం), సంగారెడ్డి (హత్నూర, జిన్నారం, కంది, కోహిర్, మునిపల్లి, న్యాలకల్, సదాశివపేట్, సంగారెడ్డి, వట్‌పల్లి), సిద్దిపేట (చేర్యాల, చిన్నకోడూరు, దుబ్బాక్, గజ్వేల్, జగదేవ్‌పూర్, కొండపాక, మర్కూక్, ములుగు, సిద్దిపేట్), వికారాబాద్ (బంట్వారం, ధరూర్, కొడంగల్, కోటిపల్లి, మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పనేట, పరిగి, పేద్దేముల్, పూడూరు, తాండూరు, వికారాబాద్) తదితర ప్రాంతాలున్నాయి. గద్వాల జిల్లాలో 17 ప్రాంతాల్లో, కామారెడ్డిలో 17 ప్రాంతాల్లో, మెదక్‌లో 17 ప్రాంతాల్లో, ఖమ్మంలో 13 ప్రాంతాల్లో, యాదాద్రి భువనగిరిలోని 13 ప్రాంతాల్లో భూగర్భ జలాలు తాగడానికి ఏ మాత్రం అనుకూలం కాదని గుర్తు చేసింది.

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను తీవ్రంగా ఖండించిన బ్రిటన్

లండన్, అక్టోబరు 18: బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను బ్రిటన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఆ దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై విద్వేషం, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయంటూ గురువారం కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ బాబ్ బ్లాక్‌మ్యాన్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రస్తావించారు. ఆయన ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఫర్ బ్రిటిష్ హిందూస్ అనే గ్రూపునకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వేధింపుల కారణంగా హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు ఈ ఏడాది దీపావళి చేసుకునే పరిస్థితులు లేవని చెప్పారు. ప్రభుత్వం తరఫున లేబర్ పార్టీ సభా నాయకుడు అలన్ క్యాంప్‌బెల్ సమాధానం ఇస్తూ బంగ్లాదేశ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని తెలిపారు. మతపర స్వేచ్ఛను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

మొజాంబిక్‌లో బోటు బోల్తా

- ముగ్గురు భారతీయుల మృతి.. ఐదుగురి గల్లంతు

బెయిరా, అక్టోబరు 18: ఆఫ్రికా దేశం మొజాంబిక్ తీరంలో పడవ ప్రమాదం చోటు చేసుకుంది. బెయిరా ఓడరేవు సమీపంలో సిబ్బందిని తరలిస్తున్న ఓ లాంచ్ బోటు సముద్రంలో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు భారతీయ సిబ్బంది మృతిచెందగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఓ ట్యాంకర్ షిప్‌నకు చెందిన 14 మంది భారతీయ సిబ్బంది షిఫ్ట్ మార్పిడి కోసం శుక్రవారం ఓడరేవు నుంచి సముద్రంలో నిలిచి ఉన్న నౌక వద్దకు లాంచ్ బోటులో బయలుదేరారు. ఈ క్రమంలో బోటు అకస్మాత్తుగా అదుపు తప్పి బోల్తా పడింది. రెస్క్యూ సిబ్బంది, సముద్ర సంస్థలు సహాయక చర్యలు చేపట్టాయి. ఆరుగురు భారతీయ సిబ్బందిని సురక్షితంగా రక్షించగా, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు.

బాంకె బిహారీ ఆలయంలో 54ఏళ్ల తర్వాత తెరుచుకున్న భాండాగారం

న్యూఢిల్లీ, అక్టోబరు 18: ఉత్తరప్రదేశ్‌లోని బృందావనంలో ఉన్న, శ్రీకృష్ణుడు కొలువైన బాంకె బిహారీ ఆలయంలోని గర్భగుడిలో ఉన్న రత్న భాండాగారాన్ని 54ఏళ్ల తర్వాత శనివారం తెరిచారు. భాండాగారంలో ఉన్న వజ్రాలు, ఆభరణాలు, బంగారం, వెండి తదితర వస్తువులను అంత్యంత భద్రత మధ్యన లెక్కించారు. భద్రత కోసం ఈ కార్యక్రమాన్నంతటినీ వీడియో తీశారు. సుప్రీం కోర్టు నియమించిన 11సభ్యుల ఉన్నతస్థాయి కమిటీ ఎదుట ఈ లెక్కింపు జరిగింది. ఈ భాండాగారాన్ని చివరిసారిగా 1971లో తెరిచారు. ఆలయ భాండాగారాన్ని తెరవాలని సుప్రీంకోర్టు సెప్టెంబరు 29న ఆలయ కమిటీని ఆదేశించింది. కాగా, బాంకె బిహారీ ఆలయాన్ని 1862లో నిర్మించారు.

గిరిజన వయో వృద్ధుడు పూజారి వీరయ్య మృతి

- 108వ ఏట కన్నుమూత



వీరయ్య(ఫైల్)

దుమ్ముగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాల గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్ఎన్‌రావుపేటకు చెందిన గిరిజన వయో వృద్ధుడు, పూజారి పాణం వీరయ్య(108) శనివారం కన్నుమూశారు. నడిగడ్డలోని కొర్రాజుల దేవర పూజావిధానంలో భాగమైన బోనం వండి నైవేద్యం అందించే ఆయన రెండేళ్లకోసారి జరిగే కొర్రాజుల పండగను గిరిజన సంప్రదాయం ప్రకారం దగ్గరుండి జరిపించేవారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఘటన

దుబ్బాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన జమున గారి ప్రవీణ్ కుమార్ (33) వ్యవసాయం చేయడంతో పాటు వరి కోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం దాదాపు రూ. 8 లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వారి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ప్రవీణ్ భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి

మంచాల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి చెందిన ఘటన మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన పంతంగి మానస(22) ఏడు నెలల గర్భవతి. సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా పీహెచ్‌సీకి వచ్చి మానసకు ఐరన్ ఇంజక్షన్ తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. అయితే, ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే మానస తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మరణించింది.

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

- హాజరైన మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్, సీపీ సాయిచైతన్య
- నిందితుడిని పట్టుకునేందుకు 8 ప్రత్యేక బృందాల ఏర్పాటు

నిజామాబాద్/హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పాత నేరస్థుడి చేతిలో దారుణ హత్యకు గురైన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ అంత్యక్రియలను శనివారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. నిజామాబాద్‌లోని బ్యాంక్ కాలనీలో ప్రమోద్ మృతదేహానికి ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సాయిచైతన్య నివాళులర్పించారు. అక్కడి నుంచి గూపన్‌పల్లి శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర కొనసాగింది. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య, అదనపు డీసీపీ బస్వారెడ్డి ప్రమోద్ పాడెను మోశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రమోద్ కుటుంబాన్ని ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ నిందితుడు షేక్ రియాజ్‌ను పట్టుకునేందుకు 8బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, కానిస్టేబుల్ హత్యపై డీజీపీ శివధర్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ప్రమోద్ మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ.. ఆయన కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



కానిస్టేబుల్ ప్రమోద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సాయిచైతన్య

ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం

- ఇటలీలో నిలిపివేత
- దీపావళికి దూరం కానున్న ప్రయాణికులు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: ఇటలీలోని మిలన్ నుంచి న్యూఢిల్లీ బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో శుక్రవారం ఆ సర్వీసును రద్దు చేసి, అక్కడే నిలిపివేశారు. ప్రయాణికులను విమానాశ్రయంతో పాటు చుట్టుపక్కల ఉన్న హోటళ్లలో వసతి కల్పించారు. వారిని సోమవారం తరువాత వేరే విమానాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చనున్నారు. ఈ కారణంగా విమానంలోని 256 మంది ప్రయాణికులు, పది మంది సిబ్బంది దీపావళి పండగకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒక ప్రయాణికురాలి పరిస్థితిని గమనించి ఆమెను మాత్రం ఆదివారం వేరే విమానంలో పంపించనున్నారు. ఆమె యూరోపియన్ యూనియన్‌లో పర్యటించడానికి షెంజెన్ వీసా తీసుకోగా, దాని కాలపరిమితి ఈ నెల 20న ముగియనుంది. అందువల్ల ఇటలీలో ఆమెకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఆ విమానం శుక్రవారం మధ్యాహ్నం 2.54 గంటలకు ఢిల్లీలో బయలుదేరింది. పాకిస్థాన్ గగనతలం మీదుగా వెళ్లే అవకాశం లేకపోవడంతో చుట్టు తిరిగి ప్రయాణించి తొమ్మిది గంటలు ఆలస్యంగా మిలన్ చేరుకుంది. అక్కడ దిగిన వెంటనే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మరమ్మతుల కోసం తిరుగు ప్రయాణం సర్వీసును రద్దు చేశారు.

‘దంగల్’ నటికి పెళ్లయింది



ఆమీర్‌ఖాన్ నటించిన ‘దంగల్’ చిత్రంలో ఆయన చిన్న కూతురుగా నటించిన జైరా వసీమ్ గుర్తుంది కదూ. తొలి సినిమాతో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటి అవార్డ్ సైతం పొందింది. ఆ తర్వాత మరో చిత్రం ‘సీక్రెట్ సూపర్ స్టార్’లో జైరా నటించింది. మరికొన్ని సినిమాల్లో నటించాలనుకుంది కానీ మతపరమైన కారణాల వల్ల 2019 లోనే కెరీర్‌కు గుడ్‌బై చెప్పేసిన జైరా మళ్లీ ఇప్పుడు వార్తల్లోకి వచ్చింది. తనకి పెళ్లయిందని పేర్కొంటూ శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టి, రెండు ఫొటోలు షేర్ చేసింది. అయితే తన భర్త వివరాలు మాత్రం ఆమె ఆ పోస్ట్‌లో పేర్కొనలేదు.

మళ్లీ బ్లాక్‌బస్టర్ ఇచ్చారు



కిరణ్ అబ్బవరం

‘ఈ దీపావళికి నాకు మళ్లీ బ్లాక్‌బస్టర్ ఇచ్చారు. ‘కె-ర్యాంప్’ చిత్రానికి మేము ఊహించినదానికంటే ప్రేక్షకుల నుంచి ఎక్కువ స్పందన వస్తోంది. మహిళా ప్రేక్షకుల సంఖ్య అధికంగా ఉంది. ఆట, ఆటకూ కలెక్షన్లు పెరుగుతున్నాయి. ఇప్పుడున్న పోటీలో ఇంత మంచి కలెక్షన్లు రావడం సాధారణ విషయం కాదు. పండక్కి మంచి వినోదంతో పాటు సందేశం, ఒక వైబ్ మూవీలో ఉండాలని చేసిన ప్రయత్నమిది. ‘కె-ర్యాంప్’తో మంచి సక్సెస్ ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు’ అని అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడుగా జైన్స్ నాని తెరెక్కించిన చిత్రమిది. సినిమా శనివారం విడుదలైన సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ ‘ఈ సినిమాను కేవలం నవ్వించడం కోసమే తీశాం. ఇందులో లాజిక్ వెదక్కూడదు’ అని చెప్పారు.

ప్రేక్షకుల ప్రేమ మరువలేనిది



ప్రదీప్ రంగనాథన్

“డ్యూడ్’ సినిమాని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీరందించిన ప్రేమ మర్చిపోలేనిది. ‘డ్రాగన్’ కంటే నాలుగు రెట్లు ఎక్కువ వసూళ్లు వస్తున్నాయని నిర్మాతలు చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. నాకు ఇంత మంచి సినిమాని ఇచ్చిన డైరెక్టర్ కీర్తికి, నన్ను నమ్మిన నిర్మాతలకు కృతజ్ఞతలు’ అని అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా, మమిత బైజు కథానాయికగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రమిది. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ ‘సినిమా విడుదలైన మొదటి రోజే ప్రపంచ వ్యాప్తంగా రూ.22 కోట్లు వసూళ్లు చేసింది’ అని చెప్పారు.

క్రిస్మస్‌కు విడుదల



ఆదిసాయికుమార్ కథానాయకుడిగా మార్మిక శక్తుల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం ‘శంబాల’. షైనింగ్ పిక్చర్స్ బేనర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. యుగంధర్ ముని దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా శంబాల కథా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. భారీ బడ్జెట్‌తో విజువల్ వండర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం, పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కె బంగారి



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ వెన్నుకు సంబంధించిన ఇబ్బంది వల్ల అస్వస్థతకు గురై, ఆపరేషన్ చేయించకున్నారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, నటుడు సుమన్, రామకృష్ణ గౌడ్ ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. తన ఆరోగ్యం కుదుటపడిందనీ, ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవని ఆర్.కె. గౌడ్ వారికి చెప్పారు.

భారీ యాక్షన్ ఎంటర్టైనర్



ఇటీవలె విడుదలైన ‘సు ఫ్రమ్ సో’తో విజయం అందుకున్న కన్నడ నటుడు రాజ్.బి.శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం ‘జుగారి క్రాస్’. గురుదత్త గనిగ స్వీయ దర్శకత్వంలో సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత పూర్ణచంద్ర తపస్వి రాసిన ‘జుగారి క్రాస్’ నవల ఆధారంగా చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమాను ప్రకటించి, టైటిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. అద్భుతమైన విజువల్స్, గగుర్పాటుకు గురిచేసే బీజీఎం ప్రధానాకర్షణగా నిలిచాయి. ఇదో భారీ యాక్షన్ ఎంటర్టైనర్ అని చిత్రయూనిట్ తెలిపింది. ఇప్పటికే ఈ చిత్ర దర్శకుడు గురుదత్త, హీరో రాజ్.బి.శెట్టి కలసి ‘కరావళి’ అనే చిత్రం చేస్తున్నారు.

వారికి ప్రతి ఏడాది దీపావళి ముందే వచ్చేస్తుంది. మాటలు టపాసుల్లా పేలుతాయి. నవ్వులు మతాబుల్లా విరుస్తాయి. చిరు చిరు జ్ఞాపకాలు చిచ్చుబుడ్లలా వెలుగుతాయి.. ఇక గిల్లికజ్జాలు... ఆటలు... పాటలు.. మాటలు... వీటికి కొదవే ఉండదు. అందరూ చిన్నపిల్లలైపోతారు. ఆ కాసేపు... మెగాస్టార్, సూపర్‌స్టార్, మామూలు స్టార్... ఇలాంటి భేదాలేవీ ఉండవు. ఇదంతా ఎక్కడంటారా? '80' రీ-యూనియన్‌లో! ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారీ... రీ-యూనియన్ జరిగింది. ఆ ముచ్చట్లను అలనాటి హీరోయిన్లు సుహాసిని, లిజి, కుష్బూ, పూర్ణిమా భాగ్యరాజా - 'నవ్య' కోసం ప్రత్యేకంగా పంచుకున్నారు..

స్టార్స్ ధమాకా!


కుష్బూ


సుహాసిని

80 రీ-యూనియన్ ఎలా మొదలయింది?

లిజి: నేను ఒక ఫంక్షన్‌లో సుమలత, మోహన్‌లను కలిశాను. నేను, మోహన్ ఒకే ఊళ్లో (చెన్నైలో) ఉంటాం. కానీ ఎప్పుడూ కలవం. వాళ్లను కలిసినప్పుడు నాకు చాలా హ్యాపీగా అనిపించింది. 'చెన్నైలో ఉన్నవాళ్లందరం ఒకసారి కలిస్తే...' అనే ఆలోచన వచ్చింది. హాసిని (సుహాసిని)కి చెప్పాను. "చెన్నై నుంచే ఎందుకు? మిగిలిన ఊళ్ల నుంచి కూడా పిలుద్దాం" అంది. 'వాళ్లు వస్తారా?'అని నాకు అనుమానం వచ్చింది. బెంగళూరు, హైదరాబాద్, త్రివేండ్రం... ఇలా అన్ని ప్రాంతాల్లో ఉన్న వారిని పిలిచాం. వాళ్ల స్పందన చూసి మేము చాలా ఆశ్చర్యపోయాం. ఆలోచన నాదే అయినా... హాసిని అందరినీ ఒక చోట కలపగలిగింది. ఈ కథ అలా మొదలయింది.

కుష్బూ: నేను 80ల చివర్లో సినీ రంగానికి వచ్చాను. అందుకని నన్ను మొదటి సంవత్సరం పార్టీకి పిలవలేదు. రీ-యూనియన్ జరుగుతోందని తెలిసిన తర్వాత నేనే గేట్ క్రాష్ చేసి వచ్చేశా!

పూర్ణిమ: మొదటి కొన్నేళ్లు మా ఆయన (భాగ్యరాజా) రాలేదు. సాధారణంగా ఆయన ఎవరినీ కలవటానికి ఇష్టపడరు. "నేను డైరక్టర్‌ని కదా... మీ అందరూ యాక్టర్స్" అనేవారు. కొన్నేళ్ల తర్వాత ఒకసారి వచ్చారు. ఆ తర్వాత ప్రతి ఏడాది 'రీ-యూనియన్ ఎప్పుడొస్తుందా?' అని ఎదురుచూస్తూ ఉంటారు.


లిజి

అందరికీ ఒకే డ్రస్‌కోడ్ ఉంటుందా?

లిజి: దీని వెనక చాలా ప్లానింగ్ ఉంటుంది. రీ-యూనియన్ పార్టీలోనే- వచ్చేసారి ఎక్కడ నిర్వహించాలి? థీమ్ ఏమిటి? డ్రస్ కోడ్ ఏమిటనే విషయాన్ని నిర్ణయించుకుంటాం. ఆ తర్వాత ఎవరి డిజైనర్‌తో వాళ్లు డిజైన్ చేయించుకుంటారు. పార్టీకి వచ్చే వారు డ్రస్‌కోడ్‌ను పాటించాలి. డ్రస్ కోడ్‌తో పాటుగా రకరకాల ఆటలు ఉంటాయి. పెర్ఫార్మెన్స్‌లు ఉంటాయి.

సుహాసిని: సరదాగా ఇబ్బంది పెట్టే గేమ్స్ ఉంటాయి. అందరూ వాటిని ఆడాల్సిందే! ఉదాహరణకు సిల్క్‌స్మితలా డ్యాన్స్ చేయాలి అంటే - ఎంత పెద్ద సూపర్‌స్టార్ అయినా అలా డ్యాన్స్ చేయాల్సిందే! అందరం ఫ్రెండ్సే కదా... ఎలాంటి తారతమ్యాలు ఉండవు.

రీ-యూనియన్ పూర్తయిన తర్వాత ఎలా అనిపిస్తుంది?

పూర్ణిమ: 10 రోజులు వెల్‌నెస్ సెంటర్‌లో రిఫ్రెష్ అయి వచ్చినట్లుంది. ఆ ఆనందం బయట వాళ్లకు కూడా కనిపిస్తుంది.

లిజి: ఒక విధమైన హ్యాంగోవర్‌లో ఉంటాను. నా మిగిలిన స్నేహితులు "వచ్చేసారి థీమ్ ఏమిటి?" అని అడుగుతూ ఉంటారు.

సుహాసిని: రీ-యూనియన్ పూర్తయిపోయి ఇంటికి వెళ్తున్న సమయంలో ఒక విధమైన సంతృప్తి కలుగుతుంది. సంతోషంగా అనిపిస్తుంది. అదే సమయంలో మనసులో అందరినీ వదిలి వెళ్తున్నాననే బాధ కూడా కలుగుతుంది. 'అందరం ఒకే చోట ఉండిపోతే బావుంటుంది కదా!' అనిపిస్తుంది. ఈసారి శోభనకు త్రివేండ్రంలో ఒక ప్రోగ్రాం ఉంది. అది పూర్తి చేసుకొని 11 గంటల విమానం ఎక్కి, పార్టీకి 12.45కి వచ్చింది. మేమందరం ఉదయం 3.45 దాకా కలిసే ఉన్నాం. అయినా ఎవరూ కదలలేదు.

> ఇప్పటి దాకా జరిగిన వాటిలో... చిరంజీవిగారి ఇంట్లో జరిగిన రీ-యూనియన్ చాలా స్పెషల్. అందరం చాలా ఎంజాయ్ చేశాం. అది ఇప్పటికీ మా అందరికీ గుర్తుంది.. (సుహాసిని, కుష్బూ, లిజి, పూర్ణిమ)

అందరిలోను బాగా చలాకీగా.. చిలిపిగా ఉండేదెవరు?

కుష్బూ: మొత్తం అందరిలోను చిలిపి జయరాం!

సుహాసిని: నా ఉద్దేశంలో కుష్బూనే చిలిపి. బయట పెద్ద నటి కావచ్చు, రాజకీయ నాయకురాలు కావచ్చు. కానీ రీ-యూనియన్‌లో మాత్రం ఆ పొరలన్నీ తొలగిపోతాయి..

పూర్ణిమ: నా ఉద్దేశంలో సుహాసినే అందరి కన్నా చలాకీగా ఉంటుంది. అందరితోనూ కలిసిపోతుంది. నవ్వుతూ ఉంటుంది. నవ్విస్తూ ఉంటుంది.


పూర్ణిమా భాగ్యరాజా

అందరినీ పిలుస్తారా? కొందరికే ఎంట్రీ ఉంటుందా?

సుహాసిని: అందుబాటులో ఉన్నవారందరినీ పిలుస్తాం. బాలీవుడ్ హీరో, హీరోయిన్లను కూడా పిలుస్తాం. 'రా వన్' సినిమా విడుదల సమయంలో షారుక్‌ఖాన్ చెన్నైకి వచ్చారు. తనకు ఏదో సాయం అవసరమయింది. నాకు ఫోన్ చేశారు. '80 రీ-యూనియన్ పనుల్లో బిజీగా ఉన్నా... ఎల్లుండి ఫోన్ చేస్తా" అన్నా. షారూక్- " నన్ను కూడా పిలవచ్చు కదా" అన్నారు. "మీరు 90లలో సినిమా ఇండస్ట్రీకి వచ్చారు కదా..." అన్నా. "కాదు, కాదు... నేను నటించటం మొదలుపెట్టింది 80లలోనే..." అన్నారు. ఆ రీ-యూనియన్‌కి ఆయన కూడా వచ్చారు. ఆమిర్‌ఖాన్ తాను కూడా వస్తానని ఫోన్ చేశారు. పద్మినీ కొల్హాపూరి, మీనాక్షీ శేషాద్రి, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్... ఇలా కొందరు రీ-యూనియన్‌కు వచ్చారు. మరి కొందరు మిస్ అవుతూ ఉండచ్చు. ఎవరిని పిలవాలనే విషయం హోస్ట్‌పై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్‌లో దీన్ని హోస్ట్ చేస్తున్నారనుకుందాం. ఎవరైతే హోస్ట్ చేస్తున్నారో... వారు తమ ఫ్రెండ్స్‌ను పిలవచ్చు. ఆ తర్వాత ఏడాది హోస్ట్ వాళ్లను పిలవకపోవచ్చు. అది వారిష్టం.

ఎవరు ఏం చేయాలనే విషయాన్ని ఎవరు నిర్ణయిస్తారు?

సుహాసిని: ఎవరు ఏ పెర్ఫార్మెన్స్ చేయాలనే విషయాన్ని డిజైన్ చేసేది నేనే! ఈసారి రీ-యూనియన్‌లో నదియా, నేను, కుష్బూ, జయశ్రీ చేసిన డ్యాన్స్ క్లిప్స్ బయటకు వచ్చాయి. ఇదంతా కేవలం పదిశాతం మాత్రమే! సాధారణంగా ఈ క్లిప్స్‌ను ఎప్పుడూ బయటకు వదలం- ఎందుకంటే అందరం ఫ్రెండ్స్ కదా! ఈ డ్యాన్స్‌ను నదియా కంపోజ్ చేసింది. మేమందరం ఎలాంటి రిహార్సల్స్ లేకుండా ఆమెతో స్టెప్స్ వేసామంతే! ఇక్కడ మీకో విషయం చెప్పాలి. నేను మంచి డ్యాన్సర్‌ను కాను. ఎప్పుడూ మిగిలిన పనుల్లో బిజీగా ఉంటా... అయినా మొదటి వరసలో నేనుంటా! ఎందుకంటే నేనే డిజైన్ చేస్తాను కాబట్టి స్టెప్స్ నాకు బాగా గుర్తుంటాయి. ఇక 'మిడ్లీ' (అన్ని పాటల కదంబం)ల కోసం మేము రిహార్సల్స్ చేస్తాం. మాకు అదొక పిక్నిక్‌లా అనిపిస్తుంది. మొదట అందరూ "మాకు ఆ స్టెప్ రాదు... మేము ఆ స్టెప్ వేయలేం"... ఇలా రకరకాల కారణాలు చెబుతారు. కానీ చివరకు అందరూ కలిసే డ్యాన్స్ చేస్తాం. ఒకసారి శోభన ఒక డ్యాన్స్ కంపోజ్ చేసింది. నేను, అర్జున్, శోభన- ముగ్గురం దానిలో ఉన్నాం. ఆ డ్యాన్స్ అంతా ఏక్రోబాటిక్స్‌లా ఉంటుంది. దాన్ని నేను ఎప్పుడూ మర్చిపోలేను. 2011లో అంబరీష్, సుమలత ఒక ప్రొఫెషినల్ కొరియోగ్రాఫర్‌ను పెట్టుకొని... 'రియల్ నుంచి డిజిటల్ వరకు' అని ఒక డ్యాన్స్ చేశారు. దాన్ని కూడా మరచిపోలేను.

మీ అందరూ ఒకప్పటి పోటీదారులే కదా.. ఇప్పుడెలా స్నేహితులైపోయారు?

పూర్ణిమ: ఆ రోజులు దాటిపోయాయి. ఇప్పుడు మేమందరం ఫ్రెండ్స్. ఆ ఒక్క విషయాన్ని మాత్రమే గుర్తుపెట్టుకుంటాం. ఇక నా విషయానికి వస్తే- పెళ్లి అయిన తర్వాత నేను నటించటం మానేశాను. గృహిణిగా స్థిరపడ్డాను. అలాంటి సమయంలో మేమందరం రీ-యూనియన్ కోసం కలవటం మరపురాని విషయం.

సుహాసిని: ఒకప్పుడు మేము మిస్ అయిన వాటిని గుర్తు తెచ్చుకుని నవ్వుకుంటాం కూడా! ఉదాహరణకు భాగ్యరాజా తీసిన 'డార్లింగ్.. డార్లింగ్..డార్లింగ్'లో హీరోయిన్‌గా నేను నటించాలి. కానీ డేట్స్ లేకపోవటంతో పూర్ణిమ నటించింది. ఆమెకు భాగ్యరాజాతో పరిచయం అక్కడే! "నావల్లే నీకు భాగ్యరాజా దొరికాడు" అంటూ ఉంటా!

• సీవీఎల్‌ఎన్ ప్రసాద్

ఒకే దారి... ఒకే సారి!

ఎంతో ఇష్టపడి న్యాయవాద డిగ్రీని అందుకున్నా... కుటుంబ బాధ్యతల కారణంగా ప్రాక్టీస్‌కు దూరమైన తల్లి... తల్లి స్ఫూర్తితో 'లా' చదివి, అమ్మ చదువును సార్థకం చేయాలని తపించిన కుమార్తె... వారిద్దరూ ఇటీవల ఒకేసారి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్నారు. పేదలకు న్యాయం జరిగేలా చూడాలన్నదే తమ ఆశయం అంటున్నారు... కాకినాడకు చెందిన మెహెరాణి, లక్ష్మీ ఐశ్వర్య.

మెహెరాణికి చదువంటే ఎంతో ఇష్టం. తన అన్నయ్యలా న్యాయవిద్య అభ్యసించాలని ఆమె కోరిక. అయితే... ఆమె బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే ఉండగానే... పోలీస్ శాఖలో ఎస్‌ఐ అయిన గాజుల వీరవెంకట సత్యనారాయణతో వివాహం అయింది. చదువు కొనసాగించాలనే మెహెరాణి తపనను గుర్తించిన భర్త... ఆ దిశగా ఆమెను ప్రోత్సహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసిన మెహెరాణి... రాజీవ్ గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో చేరి తన కలను నెరవేర్చుకున్నారు. 2015లో తను కోరుకున్న న్యాయవాద డిగ్రీని అందుకున్నారు. అయితే... భర్త ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాలకు తిరగడం వల్ల ఎక్కడా ప్రాక్టీస్ చేసే అవకాశం ఆమెకు లభించలేదు. మెహెరాణి, సత్యనారాయణ దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు మెహెర్... బిట్స్‌పిలానీలో ఇంజినీరింగ్, యూఎస్‌లో ఎంఎస్ చేశారు. విదేశాల్లో డేటా సైంటిస్ట్‌గా స్థిరపడ్డారు. కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య మాత్రం తల్లిలా న్యాయ విద్యను అభ్యసించాలనుకున్నారు. హ్యూమానిటీస్ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేశాక... 2020లో ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీలో... అయిదేళ్ల బీబీఏ- ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) కోర్సులో చేరి.. ఐదేళ్ల విద్యను అభ్యసించారు.



అమ్మ గురించి ఆలోచించి...

"ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో... బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకోవాలనుకున్నప్పుడు... అమ్మ గురించే ఆలోచించాను. తను ఎంతో ఇష్టంగా 'లా' చదివి, ఖాళీగా ఉండడం నాకు నచ్చలేదు. అమ్మ చదువుకు సార్థకత ఉండాలనుకున్నాను. అందుకే అమ్మకు నచ్చజెప్పాను. ప్రస్తుతం విజయవాడ ఏసీబీ విభాగంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మా నాన్న మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు" అని చెప్పారు లక్ష్మీ ఐశ్వర్య. "నా తల్లిదండ్రులు మల్లిపూడి బాబామెహర్ ప్రసాద్, శ్యామల, భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 'లా' చదివాను. కుటుంబ బాధ్యతలను, చదువును సమన్వయం చేసుకోవడం మొదట్లో కష్టంగా ఉండేది. న్యాయవాద కోర్సు పూర్తిచేసి, పట్టా అందుకున్నా... ప్రాక్టీస్ చేయడం సాధ్యపడలేదు. ఇప్పుడు మా అమ్మాయి కోరిక మేరకు ప్రాక్టీస్‌కు సిద్ధమయ్యాను. ఇటీవల బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా ఒకే రోజు మా పేర్లు నమోదు చేసుకున్నాం. న్యాయం కోసం వచ్చే పేదలకు సాయపడాలనేదే మా ఆశయం" అంటున్నారు మెహెరాణి. ఐఏఎస్ కావాలి. సమాజానికి సేవ చెయ్యాలి. ఇదే నా లక్ష్యం" అంటున్న లక్ష్మీ ఐశ్వర్య... ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్‌లో ఎల్‌ఎల్‌ఎం చేస్తున్నారు.



• పీవీవీ వరప్రసాద్, కాకినాడ

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఓజీ	తెలుగు చిత్రం	అక్టోబర్ 23
అమెజాన్ ప్రైమ్		
హోస్ట్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 22
జియో హాట్‌స్టార్		
పిచ్ టూ గెట్ రిచ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 20
భద్రకాళి	తెలుగు చిత్రం	అక్టోబర్ 24
మనోరమా మ్యాక్స్		
స్టేషన్ 5	మలయాళ చిత్రం	అక్టోబర్ 18

బడ్జెట్ దీపావళి

పండగ కచ్చితంగా ఖర్చుతో కూడుకున్న వేడుకే! అలాగని సంబరాలు చేసుకోవడం మానుకోలేం కాబట్టి, వీలైనంత చవకగా దీపావళి పండగ జరుపుకొనే మార్గాల కోసం అన్వేషించాలి. అలాంటి మార్గాల్లో ఇవి కొన్ని..



క్యాండిల్స్ బదులుగా దివ్వెలు!: బల్బులు, క్యాండిల్స్‌తో దీపావళి వెలుగులు విరజిమ్మాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. కాబట్టి ఈ దీపావళినాడు మట్టి ప్రమిదలు సేకరించి, వాటి మీద ఆక్రిలిక్ కలర్స్‌తో డిజైన్లు గీయండి. వీటిలో నూనె లేదా మైనం నింపి వెలిగించండి. మట్టి ప్రమిదలు క్యాండిల్స్ కంటే ఎక్కువ సమయంపాటు వెలుగుతాయి.

పువ్వుల రంగోలి: రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులకు బదులు పూల రేకులు, పసుపు, బియ్యం పిండిలతో రంగోలి తయారుచేయండి. వీటి ఖరీదు తక్కువ. పైగా అలంకరణ కూడా తేలికే! ఇంటి వాకిలి లేదా హాల్‌ను పూల రంగోలీలతో నింపేస్తే ఇంట్లో పండుగ శోభ వెల్లివిరుస్తుంది.

వెలుగులు విరజిమ్మేలా: వాడకుండా వదిలేసిన సీసాలను సేకరించి వాటికి రంగులేయండి. వాటి లోపల ఫెయిరీ లైట్లను నింపి, కిటికీల దగ్గర ఉంచి ఆన్ చేయండి. రంగు కాగితాలతో పూలను తయారుచేసి, సీసాల్లో నింపినా బాగుంటుంది. సీసాల్లో గోళీలు, గులకరాళ్లు నింపి, ఫెయిరీ లైట్లను కూడా అలంకరించుకోవచ్చు.

దుపట్టాతో డెకరేషన్: గది సీలింగ్ నుంచి మూలలకు రంగురంగుల దుపట్టా లేదా చీరలతో అలంకరించుకోవచ్చు. కిటికీలకు, తలుపుల దగ్గర కర్టెన్లుగానూ వాడవచ్చు. బెడ్ వెనకాల గోడకు డిజైన్‌లా దుపట్టాలను అలంకరించి, వాటి మీద అక్కడక్కడా పువ్వులను గుచ్చండి. గదికి పండగ శోభ వస్తుంది.

దాండియా!: డీజె లేదని దిగాలు పడవలసిన అవసరం లేదు. స్నేహితులను పోగు చేసి దాండియా ఆడుకోవచ్చు. వినసొంపైన పాటల లిస్ట్ తయారుచేసుకుని దీపావళి రాత్రి దాండియాతో హంగామా చేయవచ్చు. ఇందుకోసం దాండియా స్టిక్స్, మిలమిలమెరిసే దాండియా దుస్తులు ఉంటే చాలు.

భలే బహుమతులు!: ప్రమిదలకు ఆకర్షణీయమైన రంగులతో పెయింట్ చేసి స్నేహితులకు ఇవ్వవచ్చు. మైనం కొని క్యాండిల్స్ తయారుచేసి బహూకరించవచ్చు. స్వీట్లు తయారుచేసే సామర్థ్యం ఉంటే వాటిని అందంగా గిఫ్ట్ ప్యాక్ చేసి స్నేహితులు, బంధువులకు బహూకరించవచ్చు.

దీప కాంతుల ధగధగలు

దీపావళి పండుగ రోజున ఇల్లంతా దీపాలతో అలంకరించుకుంటూ ఉంటాం. పూజ సమయంలో మట్టి ప్రమిదల్లో నువ్వుల నూనె లేదా ఆవు నెయ్యితోపాటు ఒత్తులు వేసి వెలిగిస్తాం. ఇంటిని అలంకరించడానికి కొవ్వొత్తులు, మైనం దీపాలు, ఎలక్ట్రిక్ దీపాలు, రంగురంగుల ఎల్‌ఈడీ లైట్లు ఉపయోగిస్తుంటాం. వీటితోపాటు ప్రస్తుతం రకరకాల దీపాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వాటిపై ఓ లుక్కేద్దామా..!



వేలాడే దీపాలు

దేవతా మూర్తుల విగ్రహాలు, నెమళ్లు, హంసలు, శంఖు చక్రాలు, కలశం రూపాలతో కూడిన దీపపు కుందులకు పొడవాటి చెయిన్, హుక్ అమరుస్తారు. పండుగ రోజున వీటిని పూజగదిలో, హాల్లో వేలాడదీసుకుని చక్కగా వెలిగించుకోవచ్చు. పండుగ తరువాత దీపం వెలిగించకపోయినా డెకరేషన్ ఐటెమ్స్‌గా నిలిచి ఉంటాయి. మట్టి, ఇత్తడి, పంచలోహాలతో రూపొందించిన రకరకాల వేలాడే దీపాలు అందుబాటులో ఉన్నాయి.



స్టాండ్ దీపాలు

దీపావళి రోజున ఇంట్లో, ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి పూలతో అలంకరించి సాయంత్రం కాగానే దీపాలు పెట్టుకుంటాం. ఇలా చేయడం కొంచెం శ్రమ అనుకునేవారికోసమే స్టాండ్ దీపాలు వచ్చేశాయి. పండుగ శోభ ఉట్టిపడేలా వివిధ ఆకారాల్లో ఇవి లభ్యమవుతున్నాయి. వీటిని తెచ్చుకుని ఇంట్లో అందంగా అమర్చుకుని దీపాలు వెలిగిస్తే చాలు. ఇంటికి ఎలాంటి అలంకరణ చేయనవసరం లేదు.




3డీ దీపాలు

దీపం వెలిగించగానే చుట్టూరా అందమైన ముగ్గు ప్రత్యక్షమవుతుంది. అయిదారు దీపాలను పూజగదిలో లేదా హాల్ మధ్యలో అందంగా అమర్చి వెలిగిస్తే చాలు చక్కని రంగవల్లి ఆవిష్కృతమవుతుంది. నూనెతో వెలిగించేవి, మైనంతో తయారుచేసినవి, నీళ్ల పోస్తే వెలిగేవి అందుబాటులో ఉన్నాయి. ఎల్‌ఈడీ బల్బులు, వాటర్ సెన్సర్ టెక్నాలజీలతో రూపొందించిన రంగురంగుల తామర పువ్వుల దీపాలను ఓ నీళ్ల కంచంలో ఉంచితే చాలు ఇల్లంతా పండుగ శోభతో మెరిసిపోతుంది.



మంత్ర దీపం

పండుగ రోజున మనసారా దేవుని స్మరించుకుంటూ దీపం వెలిగిస్తాం. వెంటనే దీప శ్లోకం లేదా గాయత్రీ మంత్రం చదువుకుంటూ ఉంటాం. అవి చదవడం రానివారి కోసమే ఈ మంత్ర దీపం అందుబాటులోకి వచ్చేసింది. ఇది ఎలక్ట్రిక్ దీపం. దీనికి చిన్న ఎల్‌ఈడీ బల్బు అమర్చి ఉంటుంది. దీపం వెనక ఉన్న మీట నొక్కగానే బల్బు దీపంలా వెలుగుతుంది. అంతేకాదు గాయత్రీ మంత్రం, ఓంకారం, పంచాక్షరీ మంత్రం ఇలా మనకు నచ్చిన చాంటింగ్ వినవచ్చు. ఈ దీపం రీఛార్జబుల్ కూడా.



నీళ్ల దీపాలు

పేరుతోనే అందరిలో ఉత్సుకత కలిగిస్తుంటాయి ఈ దీపాలు. ప్రమిదలో యానోడ్, క్యాథోడ్ అనే రెండు వైర్లతో పాటు బటన్ సెల్, సెన్సర్ అమరుస్తారు. ప్రమిదలో నీళ్లు పోయగానే సెన్సర్ ద్వారా వైర్ల మధ్య కరెంట్ ప్రవహిస్తుంది. దీంతో బల్బు వెలుగుతుంది. ఒక్కో బటన్ సెల్ సుమారు 50 గంటలపాటు బల్బుని వెలిగిస్తుంది. పువ్వులు, కొవ్వొత్తులు, కుందులు ఇలా రకరకాల ఆకారాల్లో నీటి దీపాలు లభ్యమవుతున్నాయి. పండుగ రోజునే కాదు చిన్న ఫంక్షన్లు, పూజలు, ఇతర వేడుకల సమయాల్లో; గృహాలంకరణకు కూడా ఈ నీటి దీపాలను వెలిగించుకోవచ్చు.

గవర్నర్‌ను కలిసిన టీజీపీఎస్సీ చైర్మన్, సభ్యులు

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో శనివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశంతో పాటు కమిషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశం గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కమిషన్ సభ్యులతో కలిసి వార్షిక నివేదికను సమర్పించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి టీజీపీఎస్సీ చేసిన పనులను ఆ నివేదికలో పేర్కొన్నారు.

హ్యామ్ రోడ్లు సరే.. మా బకాయిలు కూడా విడుదల చేయండి

- రూ.800 కోట్లు ఉన్నాయి
- సీఎం రేవంత్‌కు బీఏఐ జాతీయ ఉపాధ్యక్షులు డీవీఎన్ రెడ్డి లేఖ



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారులను హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్)లో అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించడంతో పాటు హర్షిస్తున్నామని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. అయితే హ్యామ్ పనుల కోసం టెండర్లను ఆహ్వానించడానికి ముందుగానే పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను చెల్లించాలని కోరారు. గత రెండేళ్లుగా రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్కులు, అత్యవసర పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించి రూ.10 వేల నుంచి రూ.కోటి వరకు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల్లో దాదాపు రూ.800 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రూ. కోటిలోపు ఉన్న బిల్లులను ప్రభుత్వం వీలైనంత త్వరితగతిన విడుదల చేస్తుందని 2024 జనవరిలో హైటెక్స్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో సీఎం రేవంత్ చెప్పిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. తమ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాల్లో ఈడీ సోదాలు

- దేశ, విదేశీ కలిపి రూ.38 లక్షల విలువైన కరెన్సీ స్వాధీనం

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న ఐదు విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాల(ఫారిన్ ఎక్స్ఛేంజ్ సెంటర్)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బృందాలు సోదాలు నిర్వహించాయి. ఈ సోదాల్లో దేశ, విదేశీ కలిపి రూ.38 లక్షల విలువైన కరెన్సీ(రూ.11.9 లక్షల భారత కరెన్సీ, రూ.26.7 లక్షలకు సమానమైన విదేశీ కరెన్సీ)ని సీజ్ చేశారు. అలాగే, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రిజమ్ ఫారెక్స్ లిమిటెడ్, గరుడ ఫారెక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీవిమల్‌నాథ్ ఫారెక్స్ లిమిటెడ్, విక్టరీ ట్రావెల్స్ అండ్ ఫారెక్స్ లిమిటెడ్, డిజిటల్ ఫారెక్స్ లిమిటెడ్ సంస్థల్లో సోదాలు చేశామని ఈడీ ప్రకటించింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అనుమతులు లేకుండా ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఈడీ అధికారులు గుర్తించారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ ప్రతినిధులు శనివారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా.. గతంలో తమకు రూ.104 కోట్ల బిల్లులు విడుదల చేయించడం, డిప్యూటేషన్‌లకు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి ఎం. శశిధర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు 23 వరకు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

శనివారం రాత్రి వరకు వచ్చిన దరఖాస్తులతోనే అంతే స్థాయిలో ఆదాయం వచ్చింది. ఈసారి ఇతర రాష్ట్రాల వ్యాపారులు తెలంగాణలో మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి చూపినట్లు స్పష్టమవుతోంది. ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఒక మహిళా వ్యాపారి ఏకంగా 50 షాపులకు దరఖాస్తు చేయడం విశేషం.

నిండు గర్భిణి దారుణ హత్య

- గొడ్డలితో నరికి చంపిన భర్త కుటుంబ సభ్యులు
- కులాంతర వివాహం చేసుకున్నారనే కక్షతో..



దహెగాం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్న యువతిపై కక్ష పెంచుకున్న కుటుంబం.. దాడికి పాల్పడింది. నిండు గర్భిణి అనే కనికరం కూడా చూపకుండా గొడ్డలితో నరికి చంపింది. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గెర్రెకు చెందిన శివార్ల సత్తయ్యకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు కుమార్‌కు గతంలోనే వివాహమైంది. చిన్న కొడుకు శేఖర్ వారి ఇంటి ఎదురుగా ఉండే శ్రావణి (21)ని గత ఏడాది కులాంతర వివాహం చేసుకున్నాడు. శేఖర్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, శ్రావణిది ఎస్సీ సామాజిక వర్గం. ఈ పెళ్లిని శేఖర్ తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో తీవ్ర స్థాయిలో గొడవలు జరిగాయి. ప్రేమ వివాహం చేసుకున్నప్పటి నుంచి శేఖర్ అత్తగారి ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి ఆ కుటుంబంపై సత్తయ్య కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం శేఖర్‌తోపాటు శ్రావణి తల్లిదండ్రులు వంట చెరుకు కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో శ్రావణి మాత్రమే ఉండడాన్ని గమనించిన సత్తయ్య, అతడి పెద్దకుమారుడు కుమార్, పెద్ద కోడలు కవిత.. శ్రావణిపై దాడికి పాల్పడ్డారు. 9 నెలల గర్భిణి అయిన శ్రావణిపై కత్తి, గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. శ్రావణి కేకలు విని ఇరుగుపొరుగు వారు కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. శ్రావణి తండ్రి తలండి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలసత్వం.. ఇంకానా!?

ప్రభుత్వం వచ్చి రెండేళ్లైనా కొందరి పనితీరులో మార్పు లేదు.. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల అమల్లో నిర్లక్ష్యం వద్దు.. సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దు

ఏ దశలోనూ ఫైళ్లు, పనులు ఆగిపోవడానికి వీల్లేదు.. కేంద్ర గ్రాంట్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి

ప్రతి వారం నివేదికలివ్వండి.. సీఎస్, ముఖ్య కార్యదర్శులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

కొంతమంది అధికారుల పనితీరు బాగాలేదంటూ అసంతృప్తి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అన్ని విభాగాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో అధికారుల అలసత్వాన్ని సహించేది లేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా.. కొంతమంది అధికారుల పనితీరులో మార్పు లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వాన్ని వీడాలని తేల్చి చెప్పారు. ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని, అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ముందుగా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సీఎంవో కార్యదర్శులు, సీఎస్ రామకృష్ణారావుతో శనివారం ఉదయం తన నివాసంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విషయంలో అధికారులు మరింత చురుగ్గా పని చేయాలని చెప్పారు. అన్ని విభాగాల కార్యదర్శుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని, పనుల పురోగతిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఎక్కడా కూడా ఫైళ్లు, పనులు ఆగిపోవడానికి వీల్లేదని హెచ్చరించారు. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావాల్సిన నిధులను రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఏయే పథకాల్లో రాష్ట్ర వాటాను చెల్లిస్తే.. కేంద్రం నుంచి నిధులు వస్తాయో.. వాటికి ముందుగా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇకపై సీఎస్‌తోపాటు సీఎంవో అధికారులు తమ పరిధిలోని విభాగాలపై ప్రతి వారం తనకు నివేదికలు అందించాలని, తానే స్వయంగా వాటిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

తల్లిదండ్రులను పట్టించుకోకపోతే.. జీతంలో కోత



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి 'రైజింగ్ తెలంగాణ 2047' విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలపాలని నిర్దేశించారు. నిస్సహాయులకు సహాయం చేయాలని, పేదలకు అండగా నిలవాలని ఉద్బోధించారు. గ్రూప్-2కు ఎంపికైన 783 మందికి శిల్పకళా వేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. "హాస్టళ్లలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారు. సెంటిమెంట్‌తో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. అలాంటి వాళ్ల పట్ల మీరు జాగ్రత్తగా ఉండాలి. ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా.. ఫుడ్ పాయిజన్‌తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలి. సమర్థంగా పని చేసి ఆదర్శంగా నిలవాలి" అని దిశానిర్దేశం చేశారు.

అల్లుడిని అంబానీ.. బిడ్డను బిర్లా

పదేళ్ల అధికారంలో ఉండి ఆ పెద్ద మనిషి (కేసీఆర్) చేసిన పాపాల పుట్ట పగులుతోందని సీఎం రేవంత్ అన్నారు. ఆయన కుటుంబం, బంధు వర్గమంతా ఆగర్భ శ్రీమంతులు కావాలని, సంపదలో నిజాం నవాబుతో పోటీ పడాలన్న లక్ష్యంతో కేసీఆర్ పని చేశారని, అల్లుడిని అంబానీ, బిడ్డను బిర్లా చేయాలని కలలు కంటూ.. పదేళ్ల పాలన కొనసాగించారని ధ్వజమెత్తారు. వాళ్ల దోపిడీ గురించి తాము చెప్పడం లేదని, వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసినందున గత ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఒక్కో రేవంత్ అయ్యారని, అందుకే, బీఆర్ఎస్ ఓటమి పాలైందని తెలిపారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసిన గతపాలకులు.. అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ఎనిమిదేళ్ల క్రితమే జరగాల్సింది..

"పదేళ్ల అధికారంలో ఉండి నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదు. నిద్ర పోయే ముందు ఒక్క క్షణమైనా గుండెల మీద చేయి పెట్టుకుని రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి వారిని గుర్తుచేసుకుంటే.. ఈ నియామకాలు ఏడెనిమిది సంవత్సరాల కిందటే జరిగి ఉండేవి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోయిన కూతురికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన కేసీఆర్.. కుటుంబ సభ్యులందరికీ ఏదో ఒక పదవిని అప్పచెప్పారని, కానీ, రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. 2015లో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను 2025 వరకూ పూర్తి చేయలేదంటే.. నిరుద్యోగుల పట్ల గత ప్రభుత్వ ప్రాధాన్యం ఏమిటో తెలుస్తుందని విమర్శించారు. "ఉమ్మడి రాష్ట్రంలో 2011లో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత మేం వచ్చేంత వరకూ భర్తీ (2025లో) చేయలేదు. ఇంత కంటే దుర్మార్గం ఏమైనా ఉంటుందా? పదేళ్లపాటు నియామకాలు జరగలేదు. దీంతో, నిరుద్యోగుల గుండెలు పగిలినా గత పాలకులు పట్టించుకోలేదు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకుల హయాంలో ప్రశ్న పత్రాలు పల్లీ బటానీల్లా జిరాక్స్ సెంటర్లలో వెలుగుచూశాయని తప్పుబట్టారు. "రూ.3 కోట్లు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చారని గత పాలకులు ఆరోపించారు. పేదింటి బిడ్డలు రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగం కొనగలరా!? కష్టపడి చదివిన వారిని అవమానించేలా మాట్లాడారు" అని మండిపడ్డారు. దీనిపై ఉద్యోగాలు పొందిన వారు తమ ఆర్థిక పరిస్థితిని వివరించారని, కనీసం ఉండేందుకు పక్కా ఇల్లు లేని నిరుపేదలు ఈసారి గ్రూప్-1కి ఎంపికయ్యారని తెలిపారు. రాజకీయంగా చౌకబారు ఆరోపణలు ఎదుర్కొన్నప్పుడు చాలా ఆవేదన కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతపాలకులు నీళ్లు, నిధులు, నియామకాల గురించి చిత్తశుద్ధితో పని చేసి ఉంటే.. కాళేశ్వరం కూలేశ్వరం అయ్యేది కాదని మండిపడ్డారు. లక్ష కోట్లు గోదావరిలో పోసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును కట్టడం, కూలడం మూడేళ్లలోనే జరిగిపోయిందని, ఇలాంటి పరిస్థితి దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే ఏ దేశంలోనూ లేదని ధ్వజమెత్తారు. ఫాంహౌస్‌లో పంటలతో ఎకరానికి రూ.కోటి సంపాదించానని చెప్పిన కేసీఆర్.. ఆ విద్యను రాష్ట్ర రైతులకు ఎందుకు చెప్పలేదని తప్పుబట్టారు. 64 కళల్లో చోర కళ కూడా ఒకటని కేసీఆర్ ద్వారా తెలిసిందని, ఆ విషయాన్ని ఆయన నిరూపించారని విమర్శించారు.

త్వరలో గ్రూప్-3, గ్రూప్-4 ఫలితాలు

ఉద్యోగాలను భర్తీ చేయడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. దసరాకు ముందు 562 మందికి గ్రూప్-1 నియామక పత్రాలు అందించామని, ఇప్పుడు దీపావళికి ముందు 783 మందికి గ్రూప్-2 నియామక పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్ష రాసిన 2 లక్షల మందిలో ఎంపికైన మీరంతా మట్టిలో మాణిక్యాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో అంకితభావంతో శ్రమించాలని పిలుపునిచ్చారు. ఖాళీలు మిగలకూడదని ముందుగా గ్రూప్-1 ఫలితాలు ఇచ్చి.. ఇప్పుడు గ్రూప్-2 ఫలితాలు విడుదల చేశామని, త్వరలోనే గ్రూప్-3, గ్రూప్-4 ఫలితాలనూ విడుదల చేస్తామని వెల్లడించారు. ఇవన్నీ కలిపితే 11 వేల ఉద్యోగాలు అవుతాయని, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు.

ప్రతి ఒక్కరూ నైపుణ్యంతో ఉద్యోగం పొందడమే లక్ష్యం

- కార్పొరేట్‌లో పోటీనెదుర్కొనేందుకే యంగ్ ఇండియా స్కూళ్లు
- గత పదేళ్లలో సొంత కుటుంబ అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని దోచుకున్నారు
- గ్రూపు-2 ఉద్యోగ నియామక పత్రాల పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి బిడ్డ బడికి వెళ్లి.. ఇంగ్లిష్ మీడియంలో విద్యాభ్యాసం చేసి.. నైపుణ్యంతో ఉద్యోగం పొందాలన్నదే తమ సర్కారు లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా కార్పొరేట్ రంగంలో ఉద్యోగాల సాధనకు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తున్నట్లు శనివారం శిల్పకళా వేదికలో గ్రూపు-2 అభ్యర్థుల ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో చెప్పారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్ వర్సిటీ పనులు శరవేగంగా సాగుతున్నాయన్న భట్టి విక్రమార్క.. ఒకే రోజు 783 మందికి గ్రూపు-2 ఉద్యోగ నియామక పత్రాలు అందించడం చరిత్రలోనే సువర్ణాక్షరాలు లిఖించదగిన రోజని అభివర్ణించారు. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణలో గానీ తన రాజకీయానుభవంలో ఏనాడూ ఇంత మందికి ఒకేసారి నియామక పత్రాలు అందించిన దాఖలాల్లేవన్నారు. సొంత రాష్ట్రంలో ఆత్మ గౌరవంతో 'మన ఉద్యోగాలు మనమే' సాధించుకోవచ్చన్న ఆశతో ఉద్యమం చేశామని, సాధించుకున్న తెలంగాణలో గత పదేళ్లలో త్యాగాలు చేసిన అమరుల ఆశయాలు నెరవేరలేదని అన్నారు. ప్రజల కోరికను నెరవేర్చేందుకు సోనియాగాంధీ తెలంగాణను ఇస్తే పదేళ్ల అధికారంలో ఉన్న వారు తమ కుటుంబం అభివృద్ధి చెందితే చాలునన్నట్లు రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ఈ నియామక ఉత్తర్వులు తల్లుల కన్నీళ్లు తుడిచే పత్రాలని, నియామక పత్రాలందుకున్న అధికారుల నుంచి రాష్ట్ర ప్రజలకు లబ్ధి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

'దండుపాళ్యం' పాలన ఎవరిదో అందరికీ తెలుసు

- నిరాశతోనే 'కేబినెట్'పై నిరాధారమైన ఆరోపణలు
- గత 20 నెలల్లో రాష్ట్రానికి రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'దండుపాళ్యం' పాలన అంటే ఎవరిదో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. అందుకే కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. అధికారం లేదన్న అసహనం, నిరాశతో కేబినెట్‌పై ప్రతిపక్షాలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రుల మధ్య కుమ్ములాటలు, కేబినెట్ సమావేశంలో వర్గాలుగా విడిపోయి గొడవలు పడ్డారంటూ కట్టుకథల్ని సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ సమష్టిగా రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. తాము పాలనను గాలికొదిలేస్తే గత 20 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేవా అని ప్రశ్నించారు. మంత్రులంతా వ్యక్తిగత పంచాయతీలు పెట్టుకుంటే "ఎలీ లిల్లీ" వంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు తెలంగాణకు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. మీ అంతర్గత కుమ్ములాటలను కప్పిపుచ్చుకోవడానికి మాపై బురద చల్లడం మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. "మీ అహంకారపూరిత వ్యవహారశైలి, పాలనా వైఫల్యాల చరిత్రను దాచుకునేందుకు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలతో మైండ్ గేమ్ ఆడుతున్నారు. విజ్ఞులైన తెలంగాణ ప్రజలు మీ కుతంత్రాలను నమ్మరు." అని ఆయన వ్యాఖ్యానించారు.

6 నెలల్లో రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐలు

పారిశ్రామికాభివృద్ధి విషయంలోనూ తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) ఆకర్షణలో తెలంగాణ ముందంజలో ఉందని.. గత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లోనే రాష్ట్రానికి రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐలు వచ్చాయని వెల్లడించారు. 2023-24లో ఇదే కాలంతో పోలిస్తే ఇవి 33 శాతం ఎక్కువ కావడం గమనార్హమన్నారు. దేశంలోనే టాప్-3 అర్బన్ ఎఫ్‌డీఐ కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. '2023-24లో పరిశ్రమల జీఎస్ వీఏ రూ.2.46 లక్షల కోట్లు కాగా.. అది 2024-25లో 12.6 శాతం పెరిగి రూ.2.77 లక్షల కోట్లకు చేరుకుందని వెల్లడించారు.

త్వరలో మహారాష్ట్రకు సీఎం రేవంత్‌రెడ్డి!

- 150 మీటర్లతో తుమ్మిడిహెట్టి బ్యారేజీకి అనుమతి కోసం
- ఆ రాష్ట్ర సీఎం ఫడణవీస్‌ను కలవనున్న తెలంగాణ సీఎం
- వారం, పది రోజుల్లో పర్యటన ఉండే అవకాశం: ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో మహారాష్ట్రకు వెళ్లనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం పనుల పునరుద్ధరణలో భాగంగా 150 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ సమ్మతి కోరనున్నారు. వారం, పది రోజుల్లో ఈ పర్యటన ఉండే అవకాశముందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగా, 150 మీటర్లతో బ్యారేజీ నిర్మాణంతో ఏర్పడే ముంపునకు సంబంధించి అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ ముంపుపై పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనం కూడా చేసింది. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే 288.01 ఎకరాలు ముంపునకు గురవుతాయని, 149 మీటర్ల ఎత్తుతో కడితే 770.53 ఎకరాలు, 150 మీటర్లతో కడితే 1467.92 ఎకరాలు ముంపునకు గురవుతాయని సీడబ్ల్యూపీఆర్ఎస్ లెక్క తేల్చింది. దాంతో ఆ నివేదిక ఆధారంగా మహారాష్ట్ర సీఎంను కలిసి.. ఎలాగైనా 150 మీటర్లతో బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరే అవకాశం ఉంది. మహారాష్ట్రలో అమల్లో ఉన్న 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి నిర్వాసితులకు గరిష్ఠ పరిహారం ఇవ్వనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం చెప్పే అవకాశాలున్నాయి. భూసేకరణ కోసం పరిహారంతోపాటు పునరావాసం, పునర్‌నిర్మాణం కింద ఎకరానికి రూ.25 లక్షలు ఇవ్వనున్నట్లు మహారాష్ట్ర సీఎంకు తెలపనుంది.

గతంలోనూ రెండు ప్రభుత్వాల ఒప్పందం..

వాస్తవానికి 2016 మార్చి 8న తుమ్మిడిహెట్టిని 148 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. అప్పట్లో కూడా సీఎంగా దేవేంద్ర ఫడణవీసే ఉన్నారు. అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కోసం కూడా ఒప్పందం చేసుకున్నారు. అయితే తుమ్మిడిహెట్టితోపాటే మేడిగడ్డను కూడా కడతామని అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కాలక్రమంలో తుమ్మిడిహెట్టిని పక్కన పెట్టింది. 2023 అక్టోబరు 21న కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్లలో సీపేజీలు ఏర్పడటంతో.. తుమ్మిడిహెట్టి పునరుద్ధరణపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టింది.

ఐటీ సిటీ.. స్వీట్‌కు దాసోహం!

హైదరాబాదీల్లో అత్యధికులు తీపి ప్రియులే.. నెలకు సగటున 10 సార్లకన్నా ఎక్కువే తింటున్న వైనం

- రోజూ మిఠాయిలు తినేవారు 7 శాతం
- 4 శాతం మందే స్వీట్స్‌కు దూరం
- దేశంలో ఇతర పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి
- లోకల్ సర్కిల్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే వెలుగుల పండుగే కాదు.. తీపి పండుగ కూడా. మిఠాయిలకు గిరాకీ అమాంతం పెరుగుతుంది. అయితే, హైదరాబాదీలు మాత్రం పండుగలతో సంబంధం లేకుండా ప్రతీ రోజూ పండుగే అన్నట్లు స్వీట్లు లాగించేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇది ఆందోళనకర విషయమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్‌లో దాదాపు నాలుగింట మూడొంతుల మంది ప్రతీ నెలలో పదిసార్లకన్నా ఎక్కువగానే స్వీట్లు తింటున్నారు. 'లోకల్ సర్కిల్స్' అనే సంస్థ దీపావళికి ముందు నిర్వహించిన సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. సర్వేలో భాగంగా దేశవ్యాప్తంగా 303 జిల్లాల్లో 84 వేల మందికిపైగా వ్యక్తులను ప్రశ్నించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నారు. హైదరాబాద్ నుంచి 8,830 మంది ఈ అధ్యయనంలో పాల్గొన్నారు.

మన దగ్గర వినియోగం ఇలా..

ఈ సర్వే ప్రకారం హైదరాబాద్‌లో రోజువారీ స్వీట్లు తినే వారు 7% మంది. నెలలో 15 కన్నా ఎక్కువసార్లు తింటున్నవారు 24% మంది. 32% మంది నెలలో 8నుంచి 15సార్లు తింటున్నారు. 14% మంది నెలలో 3 నుంచి 7 సార్లు స్వీట్లు తీసుకుంటున్నారు. స్వీట్లు అస్సలు తినని వారు కేవలం 4% మందే. సంప్రదాయ స్వీట్లతోపాటు ప్యాకేజ్డ్ స్వీట్ ఫుడ్స్‌ను (కేకులు, బిస్కెట్లు, ఐస్ క్రీములు, చాక్లెట్లు, క్యాండీలు మొదలైనవి) సైతం హైదరాబాదీయులు బాగానే ఇష్టపడుతున్నట్లుగా సర్వేలో వెల్లడైంది. 13% మంది ప్రతిరోజూ ఏదో ఒక ప్యాకేజ్డ్ స్వీట్ ఫుడ్స్‌ను తింటున్నారు.

ఇంట్లో అందరూ స్వీటు ప్రియులే!

సర్వేలో పాల్గొన్న వారిలో 15% మంది తమ ఇంట్లోని ప్రతి ఒక్కరూ చక్కెర లేదా చక్కెర ఉత్పత్తులకు బాగా అలవాటయ్యారని తెలిపారు. 18% మంది తమ కుటుంబ సభ్యులలో సగం నుంచి ముప్పావు వంతు మందికి ఈ అలవాటు ఉందని చెప్పుకొచ్చారు. 26% మంది తమ కుటుంబంలో ఎవరికీ మిఠాయిల పట్ల ప్రత్యేకమైన ఇష్టమేమీ లేదని తెలిపారు. కాగా తీపిపై ఎంత మమకారం ఉన్నప్పటికీ, నగర ప్రజల్లో ఆరోగ్యం పట్ల కూడా అవగాహన ఉందని సర్వే వెల్లడించింది.

జాతీయ స్థాయిలోనూ ఇదే తీరు

దేశవ్యాప్తంగా ఇతర పట్టణాల్లోనూ స్వీట్ల పట్ల మక్కువ బాగా పెరిగిందని సర్వేలో తేలింది. 74% మంది నెలకు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు సంప్రదాయ భారతీయ స్వీట్లను తింటున్నారు. వీరిలో 5% మంది రోజూ తింటున్నారు. గత ఏడాది జరిగిన సర్వేతో పోలిస్తే ఈసారి స్వీట్ల వాడకం ఏకంగా 40% పెరిగినట్లు తెలిసింది. 79% మంది నెలకు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు ప్యాకేజ్డ్ స్వీట్ ఫుడ్స్‌ను తింటున్నారు.

అతిగా తింటే అనేక రోగాలు



మనం రోజూ తినే ఆహారంలో ప్రోటీన్ల శాతం తగ్గి.. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటున్నాయి. అలాగే ప్రతీరోజూ స్వీట్స్ తినడమనేది ఒక వ్యసనం. తీపి తిన్న తర్వాత మన మెదడులో హ్యాపీ హార్మోన్ విడుదల అవుతుంది. ఒక్కసారి అలవాటైతే.. మళ్లీ మళ్లీ తినాలనిస్తుంటుంది. మద్యపానంలాగా ఇదీ ప్రమాదకరమే. తీపి ఎక్కువగా తినడం వల్ల బరువు పెరిగి ఊబకాయానికి దారి తీస్తుంది. అలాగే బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, స్లీపింగ్ డిజార్డర్, గుండెజబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటివి వస్తాయి. స్వీట్ల బదులు పళ్లు తినటం అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యానికి మంచిది.

- డాక్టర్ ఎం.వీ.రావు, కన్సల్టెంట్ ఫిజీషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్

2 రోజులూ ఢిల్లీలోనే మంత్రి ఉత్తమ్

» మంత్రి సురేఖతో విభేదాలే కారణమా..?!

» నా పర్యటన వ్యక్తిగతం: ఉత్తమ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి 2 రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ఆయన శనివారం సాయంత్రం వరకు దేశ రాజధానిలోనే గడిపారు. తెలంగాణలో మంత్రి కొండా సురేఖ అంశంపై రేగిన తీవ్ర దుమారంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేరు ప్రధానంగా వినిపించడంతో ఆయన రెండురోజుల ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలను కలిసేందుకు ఆయన ఢిల్లీకి వచ్చారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే, తాను వ్యక్తిగత పనులపైనే ఢిల్లీకి వచ్చానని, తన పర్యటనతో రాజకీయాలకు సంబంధం లేదని 'ఆంధ్రజ్యోతి'కి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టతనిచ్చారు.

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పేరు మార్పు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీపీహెచ్‌సీసీ) పేరును తెలంగాణ పోలీసు హౌసింగ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని కార్పొరేషన్ ఎండి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పేరుతో కార్పొరేషన్ ఇకపై విస్తృత శ్రేణిలో నూతన సేవలను అందించనుంది. ముఖ్యంగా సాంకేతికత ఆధారిత వ్యాపార కార్యకలాపాల నిర్వహణ, సాంకేతిక సదుపాయాల కల్పన, ఇంజనీరింగ్ ప్రాజెక్టుల నిర్వహణ, సాంకేతిక సలహాలు, డిజైన్లు, నిర్మాణ సేవలు, క్రీడా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, లాజిస్టిక్స్‌కు సంబంధించిన రంగాలలో సేవలను విస్తరిస్తుందని రమేశ్ వివరించారు.

పండుగ వేళ అజాగ్రత్త వద్దు: అగ్నిమాపకశాఖ డీజీ

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి వేళ టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్ సూచించారు. అనుమతులు లేకుండా విక్రయించే నాసిరకం టపాసులు కొనుగోలు చేయడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పండుగ వేళ అత్యవసర సేవలు అందించేందుకు అగ్నిమాపక శాఖ తరఫున అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. క్విక్ రెస్పాన్స్ టెండర్లు(క్యూఆర్‌టీ) అన్ని ముఖ్య ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తునే ఉంటాయని, అనుకోని ప్రమాదం జరిగితే తక్షణం అక్కడకు చేరుకుని అవసరమైన సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రాల్లో అవసరమైనచోట మల్టీపర్పస్ ఫైర్ టెండర్లు మోహరించామని చెప్పారు. ప్రజలు అత్యవసర సేవలకోసం టోల్ ఫ్రీ నెంబర్లు 101, 112కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. మంచిర్యాలకు చెందిన తల్లీకూతుళ్ల మృతి



రమాదేవి, తేజస్విని (ఫైల్)

మంచిర్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాలకు చెందిన తల్లీ కూతుళ్ల మృతి చెందారు. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి పాత విగ్నేశ్, రమాదేవి (52) దంపతులకు స్రవంతి, తేజస్విని ఇద్దరు కుమార్తెలు. వారిద్దరికీ వివాహాలు జరగ్గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. చిన్న కూతురు తేజస్విని (30) నూతన గృహ ప్రవేశం ఉండడంతో విగ్నేశ్, రమాదేవి సెప్టెంబరు 15న అమెరికాకు వెళ్లారు. షికాగోలో ఉంటున్న పెద్ద కుమార్తె స్రవంతి కుమారుడి జన్మదినం సందర్భంగా శనివారం విగ్నేశ్, రమాదేవి, తేజస్విని, తేజస్విని భర్త కిరణ్ కారులో స్రవంతి ఇంటికి బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారును భారీ ట్రక్కు ఢీకొనడంతో రమాదేవి, తేజస్విని అక్కడికక్కడే మృతి చెందారు. విగ్నేశ్, అల్లుడు కిరణ్‌కు గాయాలైనట్లు సమాచారం.

బీసీల పేరిట కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు

» రిజర్వేషన్ల పెంపు బిల్లు పెడితే మద్దతిస్తాం: హరీశ్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు పేరిట కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు ఆడుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ మద్దతు ఇస్తుంటే... మరి ఆపుతున్నదెవరు? అని శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఆరు సార్లు జనాభా లెక్కింపు చేపట్టిన కాంగ్రెస్.. ఏనాడూ బీసీ గణన చేయలేదని, బీజేపీ సైతం నాలుగేళ్లుగా జనగణన వాయిదా వేస్తూ వస్తోందని ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీలు.. బీసీలపై కపట ప్రేమను నటిస్తున్నాయని మండిపడ్డారు. జిత్నా అబాదీ, ఉత్నా హక్ (మేమెంతో.. మాకంత) అని నినదించే రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లును ఎందుకు పెట్టడం లేదు? ఈ విషయంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదు? అని నిలదీశారు. రిజర్వేషన్ల పెంపు కోసం ఏ పార్టీ బిల్లు పెట్టినా.. బీఆర్ఎస్ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి పోతుందని రైతులు కంటతడి పెడుతుంటే.. కాంగ్రెస్ నేతలు వాటాల కోసం కొట్టుకు చస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య శనివారం కేటీఆర్‌ను కలిశారు. గత ప్రభుత్వం హయత్‌నగర్‌లో తనకు కేటాయించిన భూమిని కొంతమంది కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకురాగా.. ఆయన వెంటనే రంగారెడ్డి కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కంటి సమస్య ఉందని మొగులయ్య ప్రస్తావించగా.. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తానని హామీ ఇచ్చారు.

సైబర్ నేరగాళ్ల వలలో టీడీపీ ఎమ్మెల్యే

» 1.07 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

» హైదరాబాద్ పోలీసులకు పుట్టా సుధాకర్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల బారిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పడ్డారు. ఉగ్రవాదుల బ్యాంకు లావాదేవీలతో ప్రమేయం ఉందంటూ మనీ లాండరింగ్ పేరు చెప్పి ఎమ్మెల్యేను సైబర్ నేరగాళ్ల ముఠా భయపెట్టింది. నకిలీ పత్రాలు చూపిస్తూ ఏక్షణంలోనైనా అరెస్ట్ చేస్తామని బెదిరించి రూ. 1.07 కోట్లు కొల్లగొట్టింది. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ హైదరాబాద్ బంజారాహిల్స్ నివాసంలో ఉన్నపుడు ఈనెల 10న ఉదయం 7.30 గంటల ప్రాంతంలో 9220373818 నంబర్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తాను ముంబై క్రైం బ్రాంచ్ అధికారి గౌరవ్ శుక్లాగా పరిచయం చేసుకున్నాడు. మనీ లాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా ఇటీవల అరెస్ట్ చేసిన ఉగ్రవాది ఖాతా నుంచి మీ బ్యాంకు ఖాతాకు డబ్బు బదిలీ అయ్యిందని చెప్పి, దానికి సంబంధించి నోటీసులు, సీబీఐ అరెస్ట్ వారెంట్ అంటూ కొన్ని పత్రాలు చూపాడు. కొద్ది సేపటి తర్వాత మరో నంబర్ 7842581950 నుంచి వీడియో కాల్ చేసిన నేరగాడు, ముంబై సైబర్ క్రైం బ్రాంచ్ అధికారి విక్రమ్‌గా పరిచయం చేసుకున్నాడు. ఉగ్రవాది సదాఖాన్ ఖాతా నుంచి రూ. 3 కోట్లు మీ బ్యాంకు ఖాతాకు బదిలీ అయ్యాయని, ఈ కేసు విచారణకు ముంబై సైబర్ క్రైం కార్యాలయానికి రావాలంటూ భయపెట్టాడు. దర్యాప్తునకు సహకరించకపోతే ఏక్షణంలోనైనా అరెస్ట్ చేస్తామంటూ బెదిరించాడు. బ్యాంకు ఖాతాను పరిశీలించాలంటూ పలు దఫాలుగా రూ. 1.07 కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. తర్వాత మరో రూ. 60 లక్షలు డిమాండ్ చేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన ఎమ్మెల్యే ఇటీవల హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.



ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి, సీతక్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు



ఎంజీబీఎస్ వద్ద నిరసనల్లో పాల్గొన్న మహేశ్‌కుమార్‌గౌడ్, మందకృష్ణ మాదిగ, జాజుల

బీసీ బంద్ సక్సెస్!

(మొదటిపేజీ తరువాయి)



ఎంజీబీఎస్‌లో పరిస్థితి ఇదీ..

జరిగింది. పార్టీలకు అతీతంగా బీసీ నాయకులంతా రోడ్లపైకి వచ్చి రిజర్వేషన్ల కోసం గళమెత్తారు. ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. విద్యాసంస్థలన్నీ ముందుగానే సెలవు ప్రకటించాయి. ప్రైవేట్ సంస్థలు, వర్తక, వాణిజ్య సముదాయాలు, దుకాణాల వారు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. కొన్నిచోట్ల తెరిచి ఉన్న దుకాణాలు, వ్యాపార సంస్థలను ఆందోళనకారులు బలవంతంగా మూయించారు. రాళ్లదాడులు, విధ్వంసానికి పాల్పడ్డారు. పలుచోట్ల బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీల శ్రేణులు పరస్పరం పోటాపోటీ ప్రదర్శనలకు దిగాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రజా రవాణా స్తంభించింది. దీపావళి సెలవులు రావడంతో రాజధాని హైదరాబాద్, ఇతర పట్టణాల నుంచి సొంతూర్లకు వెళ్లాలనుకున్న ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. దీంతో ప్రైవేటు వాహనాల వారు రెండు, మూడింతల చార్జీ వసూలు చేశారు. యాదగిరిగుట్టలో ఉచిత బస్సులు కూడా లేకపోవడంతో భక్తులు ఆటోల్లో కొండపైకి వెళ్లాల్సి వచ్చింది.

రాజధానిలో గరం గరం

ఎంజీబీఎస్ వద్ద జరిగిన నిరసనల్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ర్యాలీ చేస్తుండగా కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ కిందపడిపోయారు. ఇక వామపక్షాల నేతలు కె.నారాయణ, కూనంనేని సాంబశివరావు, కార్యదర్శి జాన్‌వెస్లీ, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, ప్రజా సంఘాల నేతలు నారాయణగూడ నుంచి అబిడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో బీఆర్ఎస్ నేతలు తలసాని, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, వద్దిరాజు రవిచంద్ర తదితరులు బైఠాయించి నిరసన తెలిపారు. ఇక తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. జాగృతి అధ్యక్షురాలు కవితతో పాటు ఆమె కుమారుడు ఆదిత్య కూడా ఆందోళనలో పాల్గొన్నారు. జూబ్లీ బస్టాండ్ వద్ద ఎంపీ ఈటెల రాజేందర్, బీజేపీ నేతలు రహదారిపై బైఠాయించారు. బర్కత్‌పుర బస్‌డిపో ఎదుట ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ధర్నా చేశారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే..

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఆపి మరీ, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం 23 నెలలుగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బంద్‌కు మద్దతు పలికిన పార్టీలన్నీ, రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం ఆమోదించేవరకు మద్దతుగా నిలవాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు కోరారు. బీసీ బంద్ చరిత్రలో నిలిచిపోతుందని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. తమకు మద్దతు ఇచ్చిన పార్టీలు, ప్రజా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అన్ని రాజకీయ పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక అందరి సహకారంతో బంద్ విజయవంతమైందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేసి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ అఖిలపక్షంతో ఢిల్లీవెళ్లి ఒత్తిడి తేవాలన్నారు. సీఎం రేవంత్ ఒక రెడ్డి బిడ్డ అయినప్పటికీ చాలెంజ్‌గా తీసుకొని అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేశారని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.



బర్కత్‌పుర బస్‌డిపో వద్ద ధర్నాలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య



నారాయణగూడ నుంచి అబిడ్స్ వరకు భారీ ర్యాలీ తీసిన వామపక్ష నేతలు, కోదండరాం



అబిడ్స్‌లో బలవంతంగా దుకాణాలను మూసివేయిస్తున్న దృశ్యం



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు

పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తతలతో..

హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో ఓ బంగారం దుకాణం, నల్లకుంటలో ఒక పెట్రోల్ బంక్, హోటల్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌పై నిరసనకారులు రాళ్లు విసిరారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడికి సంబంధించిన పవన్ మోటార్స్ షోరూంపై కొందరు రాళ్లదాడి చేయడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. పరిగిలో హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై బీసీ నేతలు బైఠాయించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. పరస్పరం దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో బీజేపీ, మిగతా పక్షాల నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తంగా మారింది. జఫర్‌గడ్ మండల కేంద్రంలో వామపక్షాలు, బీజేపీ నేతలు పోటాపోటీగా దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బీసీ నేతల దాడిలో ఓ కంగన్‌హాల్ నిర్వాహకురాలు, ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు బాహాబాహీకి దిగడంతో బీజేపీ పట్టణాధ్యక్షుడు బానోత్ విజయ్‌కు గాయాలయ్యాయి.

బీజేపీ, కాంగ్రెస్‌ల తీరు.. హంతకులే నివాళులర్పించినట్లుంది



ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొన్న కవిత తనయుడు ఆదిత్య

» తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమం: కవిత

» బీసీ బంద్‌లో పాల్గొన్న కవిత తనయుడు ఆదిత్య

దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్.. బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీ.. బంద్‌కు మద్దతు తెలపడం చూస్తుంటే హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామ చేసి రాజకీయ సంక్షోభం సృష్టిస్తేనే బీసీల రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుందన్నారు. బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్‌కు మద్దతు ప్రకటించిన కవిత.. జాగృతి, యూపీఎఫ్ నాయకులతో కలిసి ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజంగా బీసీ రిజర్వేషన్ల పై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు మోదీ కాళ్ల పట్టుకునైనా రిజర్వేషన్లు సాధించాలని డిమాండ్ చేశారు. 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు నడుచుకుంటూ వస్తదని, ఈ విషయంలో బీజేపీ ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే, వారి ఇళ్లను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమం చేపడతామని కవిత అన్నారు. కాగా, కేసీఆర్ మరో రాజకీయ వారసత్వం రాష్ట్ర రాజకీయాల్లోకి రంగప్రవేశం చేసింది. తాజాగా బీసీ బంద్‌లో కవితతో పాటు ఆమె పెద్ద కుమారుడు ఆదిత్య(21) పాల్గొన్నారు. ప్లకార్డు చేతపట్టి నినాదాలు చేశారు. ఇటీవలే అమెరికాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ఆదిత్యకు రాజకీయాలంటే తల్లికిమాదిరిగానే ఆసక్తి. బీసీల కోసం తనతల్లి చేస్తున్న ఉద్యమాలకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాల్సిన అవసరముందని ఆయన అన్నారు.



బిహార్‌లో మహాగట్‌బంధన్‌దే గెలుపు

» ఓట్ల కుంభకోణాన్ని బయటపెట్టి రాహుల్ విజయానికి ముందే బాటలు వేశారు

» సీఎంగా నితీశ్ అన్ని రంగాల్లోనూ విఫలం..

» అధికారం కోసమే బీజేపీ-జేడీయూ పొత్తు

» బిహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి



కాంగ్రెస్ అభ్యర్థి అమిత్‌గిరి నామినేషన్ ర్యాలీలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బిహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్-ఆర్జేడీ-వామపక్షాలతో కూడిన మహాగట్‌బంధన్ ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ బిహార్ ఎన్నికల పరిశీలకులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే బిహార్ ప్రజలను చైతన్య పరిచారని, రాష్ట్రంలో జరిగిన ఓట్ల కుంభకోణాన్ని ప్రజలకు వివరించి మహాఘట్‌బంధన్ విజయానికి బాటలు వేశారన్నారు. ఇటీవల మహిళలకు తాయిలాలను పంచిన ప్రధాని మోదీ.. ఒక విధంగా వారి కూటమి ఓటమిని ముందుగానే అంగీకరించారని ఎద్దేవా చేశారు. బిహార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా పట్నా నుంచి పర్యటన ప్రారంభించిన మంత్రి పొంగులేటి.. శనివారం పశ్చిమ చంపారన్ జిల్లా నూతన్ అసెంబ్లీ నియోజకవర్గం మహాకూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి అమిత్‌గిరి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సీఎంగా నితీశ్ కుమార్ అన్ని రంగాల్లో విఫలమయ్యారని.. ఈసారి ఆయన్ను ప్రజలు తిరస్కరించబోతున్నారని చెప్పారు. బిహార్‌లో నితీశ్-బీజేపీ పాలన కేవలం మాటలకే పరిమితమైందని.. వాస్తవానికి ఇది అసమర్థ పాలన అని విమర్శించారు. బిహార్‌లో పెరిగిన నిరుద్యోగంతో యువత నిరాశలో ఉన్నారని.. ఇతర రాష్ట్రాలకు ఉద్యోగాల కోసం వలస వెళ్తోందని చెప్పారు. అందువల్లే దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బిహార్ యువకులే కనిపిస్తున్నారని.. ఇది వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. బీజేపీ-జేడీయూ పొత్తు కేవలం అధికారం కోసమే తప్ప ప్రజల కోసం కాదని.. సీఎం నితీశ్ నీతిబాహ్య చర్యలకు పాల్పడుతుంటారని ఆరోపించారు. నామినేషన్‌కు ముందు కాంగ్రెస్ వార్ రూంలో ఎన్నికల వ్యూహంపై స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చించారు.

ఈసారి లక్ష్యం ఎకరా రూ. 200 కోట్లు

రాయదుర్గంలో 4,700 గజాల భూమి వేలానికి సిద్ధం

» 145 కోట్ల రిజర్వు ధర.. .200 కోట్లకు చేరుతుందని అంచనా

» నవంబరులో నియోపోలీస్ భూముల వేలం

» 25 ఎకరాల వరకు వేలం వేసేందుకు ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో బంగారు గనిగా మారిన రాయదుర్గం ప్రాంతంలో ఇప్పటికే ఎకరా భూమి రూ.177 కోట్ల ధరకు అమ్ముడై రికార్డు సృష్టించగా, ఇప్పుడు తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కార్పొరేషన్ (టీజీఐఐసీ) మరో భారీ వేలానికి రంగం సిద్ధం చేస్తోంది. రాయదుర్గం పన్‌మక్త ప్రాంతంలో 4,700 గజాలు (0.97 ఎకరా.. దాదాపు ఒక ఎకరా) విస్తీర్ణంలో ఉన్న రెండు ప్రైమ్ ప్లాట్లను నవంబరు 10న వేలం వేయనున్నారు. ఈ భూములకు రిజర్వ్ ధరను రూ.145 కోట్లుగా నిర్ణయించారు. అంటే.. ప్రతి గజం ధర రూ. 3.10 లక్షలు. ఇది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలో మరో పెద్ద మైలురాయిగా అవుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే అధికారుల అంచనా ప్రకారం, ఈ భూములు నాలెడ్జ్ సిటీ సమీపంలో ఉండటంతో ఐటీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు భారీ సంఖ్యలో పోటీ పడతారని అంచనా. దాంతో చివరికి బిడ్లు రూ.200 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు నవంబరులోనే కోకాపేట్ ప్రాంతంలోని నియోపోలీస్ భూములు కూడా వేలం వేయనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడున్న ప్రభుత్వ భూముల్లో 25 ఎకరాల వరకు వేలం వేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో ఎకరానికి రూ. 60 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ధర పలికిన సంగతి తెలిసిందే. ఈ వేలం విజయవంతమైతే, ప్రస్తుతమున్న విలువ ప్రకారం మొత్తం రూ.2,500 నుంచి రూ.3వేల కోట్ల వరకు తెలంగాణ ప్రభుత్వం ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనాలు వెల్లువెత్తుతున్నాయి.

మేము కూడా లొంగిపోతాం!

మావోయిస్టు పార్టీ ఉదంతి ఏరియా కమిటీ లేఖ

చర్ల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : తాము కూడా లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నామని ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా ఉదంతి ఏరియా మావోయిస్టు పార్టీ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు కమిటీ బాధ్యుడు సునీల్ పేరిట శుక్రవారం ఓ లేఖ విడుదల చేసింది. తాము లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఇతర యూనిట్లలోని సభ్యులు కూడా లొంగిపోవడానికి రావాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితులు బాగోలేవని, సెంట్రల్ కమిటీ అనేక తప్పిదాలు చేసిందని ఇప్పటికే కేంద్ర కమిటీ సభ్యులు అభయ్, రూపేష్ దాదా లేఖలు విడుదల చేసి, లొంగి పోయారని ఉదంతి ఏరియా కమిటీ ఆ లేఖలో పేర్కొంది. ప్రస్తుతం పోరాటం కొనసాగించాలంటే తాము బతకాలని, అందు కోసం తాము సాయుధ పోరాటాన్ని వదిలి వేసేందుకు గరియాబంద్‌కు వెళ్తున్నామని.. గోబ్రా, సినాపాలి, ఎస్‌డీకేలోని అన్ని యూనిట్లు లొంగిపోవడానికి రావాలని సునీల్ పేర్కొన్నాడు. ఇప్పటికే అనేకమంది మిత్రులను కోల్పోయామని.. సోనూ దాదా, రూపేష్ దాదా తీసుకున్న నిర్ణయానికి తమ యూనిట్ మద్దతిస్తోందని తెలిపాడు. తమ సహచరులు అవసరమైతే సెల్ నం.9329913220కు కాల్ చేయాలని, లొంగిపోవడానికి ఆయుధాలతో రావాలని సునీల్ ఆ లేఖలో కోరాడు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో
రికార్డు స్థాయిలో నామినేషన్లు

ఒకేరోజు 31 మంది 48 సెట్ల దాఖలు.. ఇప్పటి వరకు 96 నామినేషన్లు


నామినేషన్లు వేసి బయటకు వస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

బంజారాహిల్స్/ చిక్కడపల్లి/ బోరబండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. శనివారం 31 మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్‌లు వేశారు. దీంతో అభ్యర్థుల జాబితా 96కు చేరింది. కాగా సమయం ముగుస్తున్న సమయంలో సుమారు 20 మంది నామినేషన్‌లు వేసేందుకు రాగా రిటర్నింగ్ అధికారులు వారికి టోకెన్లు ఇచ్చి ఈ నెల 21న రావాల్సిందిగా సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానందతో కలిసి మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తరఫున ఆయన భార్య మొదటి సెట్ నామినేషన్ వేశారు. గ్రూప్-1 నిరుద్యోగ జేఏసీ నుంచి అస్మాబేగం నామినేషన్ దాఖలు చేశారు. కాగా ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసిత బాధితుల్లో ముగ్గురు రైతులు నామినేషన్ వేయగా, మాల సంఘాల జేఏసీ నుంచి 30 మంది నామినేషన్‌లు వేసేందుకు వచ్చారు. అయితే వీరిలో కొన్ని నామినేషన్‌లు స్వీకరించిన అధికారులు మిగతా వారికి టోకెన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాలలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకే ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నట్టు చెప్పారు.

టీయూజేఏసీ నుంచి 20 మంది పోటీ!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ(టీయూజేఏసీ) అభ్యర్థుల మొదటి జాబితాను శనివారం చిక్కడపల్లిలోని జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి విడుదల చేశారు. మొత్తం 20 అభ్యర్థులు ఈ జాబితాలో ఉన్నారు. రెండో జాబితా త్వరలోనే విడుదల చేస్తామని రాంరెడ్డి, జేఏసీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ చెప్పారు. ఉద్యమకారులను విస్మరించిన అన్ని పార్టీలకు ఈ ఎన్నికలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

నవీన్‌పై దుష్ప్రచారం.. పోలీసులకు ఫిర్యాదు

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ముస్లింల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఒక తెలుగు దినపత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో ప్రచురితమైనట్లు పేపర్ కటింగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఫేక్‌న్యూస్‌తో నవీన్‌పై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ నేత నయీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతి చెందిన 26 రోజులకు మావోయిస్టు నేత కాతా అంత్యక్రియలు

- ప్రజాసంఘాల నేతలు, కవులు, రచయితల నివాళులు

కోహెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో గత నెల 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కాతా రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అలియాస్ రాజు దాదా అంత్య క్రియలు శనివారం జరిగాయి. మృతి చెందిన 26 రోజుల తర్వాత ఆయన అంత్య క్రియలు జరగడం గమనార్హం. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని ఆయన స్వగ్రామం తీగలకుంటపల్లిలో జరిగిన అంత్య క్రియలకు రాష్ట్ర ప్రజా సంఘాల నేతలు, కవులు, రచయితలు, అమరుల బంధు మిత్రుల కమిటీ సభ్యులు హాజరై నివాళులర్పించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాతాను హతమార్చారని, కుటుంబ సభ్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి.. దర్యాప్తు చేయాలని కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఆయన కొడుకు రాజా చంద్ర, భార్య మాళవి పిటిషన్లు వేశారు. హైకోర్టు తీర్పు వచ్చే వరకూ మృతదేహాన్ని ఖననం చేయకుండా భద్రపరచాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నెల 15న వీరి పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించడంతో మృతదేహాన్ని తీసుకెళ్లాలని తమపై పోలీసులు ఒత్తిడి తెచ్చారని కాతా కొడుకు రాజా చంద్ర ఆరోపించారు. ఈ నెల 17న స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలుకు ప్రయత్నించినా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ అనుమతించ లేదని తెలిపారు. మృతదేహాన్ని తీసుకెళ్లకుంటే తామే పారేస్తామని పోలీసులు చెప్పడంతో గత్యంతరం లేక తీసుకొచ్చి ఖననం చేశామని రాజా చంద్ర చెప్పారు.

కారం.. భారం..!

- లోకేశ్ వర్సెస్ ప్రియాంక్ ఖర్గే ..
- 'ఎక్స్'లో ఐటీ మంత్రుల వార్



బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఐటీ శాఖ మంత్రుల మధ్య 'ఎక్స్' వేదికగా వార్ కొనసాగుతోంది. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరిన తర్వాత ఇది మొదలైంది. 'ఆంధ్ర ఆహారం అంటే కారం అంటారు. ఆహారమే కాదు మా పెట్టుబడులు కూడా కారంగానే ఉంటాయి. మా పొరుగువారిలో కొందరికి అప్పుడే మంట పుట్టింది' అని ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ గురువారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందిస్తూ రీ పోస్టు చేశారు. 'ఆహారంలో కొంత కారాన్ని అందరూ ఇష్టపడతారు. కానీ పౌష్టికాహార నిపుణులు సమతుల్యమైన ఆహారాన్ని సూచిస్తారు. అర్థశాస్త్ర నిపుణులు సమతుల్యమైన బడ్జెట్‌ను సిఫారసు చేస్తారు. మా పొరుగు రాష్ట్రంవారికి భారం రూ.10 లక్షల కోట్లు దాటింది. ఆర్థిక లోటు (ఆదాయం కొరత) దయనీయస్థితిలో ఉంది. అది భారమే' అని ప్రియాంక్ ఖర్గే శుక్రవారం పోస్టు పెట్టారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రూ.1.16 లక్షల కోట్ల రుణం తీసుకుందని ప్రస్తావించారు.


ఉన్నత విద్య ప్రణాళికను విడుదలచేస్తున్న బాలకిష్టారెడ్డి, పురుషోత్తం, శ్రీరాం వెంకటేశ్

అన్ని వర్సిటీల్లో ఇన్నోవేషన్ క్లస్టర్లు

- వచ్చే ఏడాది నుంచి డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం
- ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఇన్నోవేషన్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. మండలి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం ఉపాధ్యక్షుడు ఆచార్య పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. గత ఏడాది కాలంలో ఉన్నత విద్యామండలిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా రూ. 45 కోట్ల ఉపకార వేతనాలు మంజూరు చేయించడం తనకు అత్యంత సంతృప్తి కలిగించిన అంశమన్నారు. రాష్ట్రంలోని 15వేల మంది గ్రామీణ విద్యార్థినులకు ఏడాదికి రూ.30వేల చొప్పున ఉపకార వేతనాలు లభిస్తున్నాయన్నారు. పారిశ్రామిక అనుసంధాన విద్యను ప్రోత్సహించేందుకు గత ఏడాదికాలంలో అనేక పరిశ్రమలు, సంఘాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5వేల మంది.. పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. విదేశీ వర్సిటీలతో కలిసి డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నామని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు సగం సెమిస్టర్ రాష్ట్రంలో, మిగతా సెమిస్టర్ విదేశాల్లోని వర్సిటీలో చదువుతారన్నారు. యూజీ తర్వాత పీజీ చేసేవారి సంఖ్య నానాటికి తగ్గుతుండటం తీవ్ర ఆందోళనకర అంశమన్నారు. నగరంలో జాతీయ, అంతర్జాతీయ పరిశోధన కేంద్రాల్లో పీహెచ్‌డీ చేసినవారి అవసరం ఉండగా.. రాష్ట్రంలో తీవ్ర కొరత ఉందన్నారు. ఈ అంశంపై ఉన్నత విద్యామండలి ప్రధానంగా దృష్టి సారించిందని, డిగ్రీ పూర్తిచేసిన వారిలో కనీసం 20శాతం మంది పీజీ అభ్యసించేలా, పీజీ పూర్తిచేసినవారిలో కనీసం 10శాతం మంద పీహెచ్‌డీ చదివేలా ప్రోత్సహిస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక ఉపకారవేతనాలు అందించే కార్యక్రమాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వరదదెబ్బకు పాక్ సైనికుల పరార్

- పంజాబ్ సరిహద్దు ఆవలివైపు కనిపించని పాక్ సైనికులు
- అక్కడ పర్యటించిన హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లో సరిహద్దు ఆవలివైపు పాక్ సైనికులు లేరు! సరిహద్దు ఫెన్సింగ్ వద్ద నిల్చుని బైనాక్యులర్స్ ద్వారా వీక్షించిన కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ఈ విషయాన్ని గమనించి సైనికాధికారులను ఆరాతీయగా వరదదెబ్బకు శత్రు సైనికులు పత్తా లేకుండాపోయారని వివరించారు. వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పంజాబ్‌లోని భారత్-పాక్ సరిహద్దు ప్రాంతాల్లో శనివారం బండి పర్యటించారు. వరదలతో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 'పీఎం ఆవాస్ యోజన' కింద ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆస్తి, పంట నష్టంపై పూర్తి నివేదిక రాగానే సాయం అందిస్తామని వరద బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. గురుదాస్‌పూర్ జిల్లాలోని భారత సరిహద్దు గ్రామాలను బండి సందర్శించారు. బీఎస్ఎఫ్ అధికారుల పహారాలో ఉన్న సంగ్లి గ్రామంలోని బాధితులను పరామర్శించారు. వరదలవల్ల ఈ గ్రామంలోని ఇళ్లు 20 అడుగుల మేర మునిగిపోయాయని, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతి కల్పిస్తున్నట్లు బీఎస్ఎఫ్ అధికారులు మంత్రికి వివరించారు. వారితో కలిసి దేశ సరిహద్దు ఫెన్సింగ్ వరకు వెళ్లిన సంజయ్.. వరదలను లెక్క చేయకుండా నిరంతరం గస్తీ కాయడమే కాకుండా బాధితులను రక్షిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బందిని అభినందించారు. వారితో కలిసి సెల్ఫీ దిగారు. ఇక గురుచుర్, సమురయ్, ఘనియక్ బేట్, రన్ సేక్ తల్లాన్ గ్రామాల ప్రజలతో కేంద్ర మంత్రి మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితులకు నెలకు సరిపడా బియ్యం, పప్పు, మసాలా దినుసులతో కూడిన 'మోదీ కిట్ల'ను బండి సంజయ్ స్వయంగా అందజేశారు. వరద ముంపు బాధితులు తీవ్రమైన కష్టాల్లో ఉన్న విషయాన్ని కేంద్రం గుర్తించిందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.